స్ఫూర్తి

# విజ్ఞాన వారధి జనసారథి డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్

**మాతంగి దిలీప్‌కుమార్**

సర్వమానవాళి సాధికారికతకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల ఆవశ్యకతను నొక్కిచెప్పిన వ్యక్తి డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్. మధ్యప్రదేశ్‌లోని మాహులో 1891 ఏప్రియల్ 14వ తేదీన రాంజీ సక్పాల్, భీమా బాయిలకు 14వ సంతానంగా జన్మించారు. కబీర్ భక్తి భావనల సాంప్రదాయాన్ని విశ్వసించే కుటుంబం కావటంతో విశాల దృక్పధాన్ని, సాటివారిపై దయార్ద్ర హృదయాన్ని అలవర్చుకున్నారు. మహర్ కులంలో జన్మించటం వల్ల తండ్రి సుబేదర్‌గా సైన్యంలో స్థానాన్ని కలిగి ఉన్నప్పటికీ తన తోటి విద్యార్థుల నుంచి సమాజంలోని కుంచించుకు పోయిన భావ జాలం నుంచి ఎన్నో ఇబ్బందులను, ఛీత్కారాలను చవిచూసి జీవితానికి కావలసిన సమానత్వపు భావనకు ఓ చక్కని శిల్పాన్ని తన హృదయంలో నిర్మించి, దాని నిర్మాణానికై తన జీవిత పర్యంతం అహర్నిశలు, అవిశ్రాంతంగా శ్రమించారు. దార్శనిక దృక్పధాన్ని అలవర్చుకున్నారు.

తనవారి నుంచి మొట్టమొదటిసారిగా మెట్రిక్ పాసయిన వాడిగా తన జనం సాక్షిగా 1907లో సత్యశోధక్ సమాజ నాయకులు ఎస్.కె. బోలె అధ్యక్షతన జరిగిన సభ ద్వారా మన్ననలను పొందారు. అదే సంవత్సరం 9 సం॥ వయస్సుగల రమాబాయితో బైకుల్లా చేపల మార్కెట్‌లోని చేపలు అమ్మే దిమ్మెలపైన వీరి వివాహం జరిగింది. తర్వాత కాలంలో 1913లో తండ్రి అనారోగ్యంతో మరణిస్తారు. అదే సంవత్సరం బి.ఎ. పట్టా సాధిస్తారు అంబేద్కర్. బరోడా మహరాజు షాజీరావు గైక్వాడ్ ఆర్థిక సహాయంతో మొదటిసారి న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయ విద్యార్థిగా 1913లో నూతన ప్రపంచంలోకి అడుగు పెడతారు. మొట్టమొదటి సారిగా సమానత్వాన్ని అనుభవించారు. ఈ విధమైన సమానత్వాన్ని తన జాతి జనులకు అందించాలని ఆహర్నిశలు శ్రమిస్తారు. నిద్రాహారాలు మాని చదువుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. 1915 సంవత్సరంలో "ప్రాచీన భారతంలో వాణిజ్యం" అనే అంశంపై ఎం.ఎ. డిగ్రీని, 1916 మేలో జరిగిన మానవ పరిణామ సదస్సులో "భారతదేశంలో కులాలు, వాటి పుట్టుక" అనే అంశంపై ప్రాముఖ్యతగల వ్యాసాన్ని



సమర్పిస్తారు. 1916 జూన్‌లో పిహెచ్.డి. పరిశోధనకై "భారతదేశానికి మిగులు జాతీయ ఆదాయం" అనే పత్రాన్ని సమర్పించారు. 1917 సంవత్సరం ఆగస్టు 21న ఉపకార వేతనం ఆగిపోవడంతో బొంబాయికి తిరిగి వచ్చేస్తారు.

డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ చరిత్ర, సాంఘిక శాస్త్రం, మానవ శాస్త్రం, తత్త్వశాస్త్రం, మనో వైజ్ఞానిక శాస్త్రం, అర్ధశాస్త్రాలనూ అధ్యయనం చేశారు. బరోడా మహారాజు అంబేద్కర్‌ను ప్రశంసిస్తూ ముందుగా నిర్ణయింపబడిన అగ్రిమెంట్ ప్రకారం తన సంస్థానంలో పని చెయ్యడానికి ఆయనకు రక్షణ శాఖలో ఉన్నత ఉద్యోగం ఇస్తారు. అక్కడ ఎదురైన ఇబ్బందికర సామాజిక పరిస్థితులతో అంబేద్కర్ విసిగిపోతారు. కనీసం ఉండటానికి కూడా అవకాశం దొరకక మారు పేరుతో పూటకూళ్ళ సత్రాన్ని ఎంచుకొని అక్కడా వైషమ్యపూరితంగా కర్రలతో తనపై దాడి చేయటానికి దడికట్టిన జనాల్ని చూసి ఆ అనుభవం నుంచి కొన్ని సంవత్సరాల వరకు బయట పడలేకపోతారు. తలచుకోగానే కంటనీరు ధారలుగా వర్షించటం మొదలయ్యేది. దేశ స్థితిగతులను మార్చటానికి మరింత ముందుకు నెట్టేది. ఈ ఇబ్బందికర పరిస్థితే బొంబాయికి తిరుగు ప్రయాణం కట్టేలా చేసింది. తన జాతిజనులకు సమానత్వాన్ని అందించేందుకు అహర్నిశలు శ్రమించేలా తన జీవన పర్యంతం ప్రేరేపించింది.

ఈయన రాసిన "క్యాస్ట్ ఇన్ ఇండియా" అనే గ్రంథం (వ్యాసం) తిరిగి అచ్చయి ప్రపంచంలో అనేకమంది మేధావుల మన్ననలను పొందింది. ప్రముఖ తత్త్వవేత్త జాన్ డ్యూయి ఆలోచనా విధానాలకు ఆకర్షితులయ్యారు. మానవ స్వాతంత్ర్యం కోసం డ్యూయికి వలె పనిచేసిన తత్త్వవేత్త మరొకరు లేరు. ప్రజాస్వామ్యం అన్నది ఆయనకు ఒక ప్రభుత్వ విధానం కాదు. జీవిత పంథా. తత్త్వశాస్త్రం ముగిసిన ఆలోచన కాదు. ఒక దృష్టికి అనుగుణంగా పరిణామం చెందుతున్న ఆలోచన. అది కష్టాలను నిర్వచించి, వాటిని ఎదుర్కొనే మార్గాలను సూచిస్తుంది. సహజసిద్ధంగా వ్యత్యాస భరితంగా ఉన్న భారతావనికి ప్రజాస్వామిక విధానం అవసరాన్ని ఆయన సూచించిన తత్త్వశాస్త్రం ఆధారంగానే అంబేద్కర్ తన మనస్సులోకి ఆహ్వానించటం, ఆమోదించి అమలయ్యేలా కార్యోన్ముఖుడవ్వడటం అగుపిస్తుంది. 1918 సంవత్సరం నుంచి 1920 సంవత్సరం మార్చి వరకు సిడెన్ హోమ్ కాలేజీలో "పొలిటికల్ ఎకానమీ" లెక్చరర్‌గా పనిచేశారు. ఈ సమయంలోనే 1919 జనవరి 27 సౌత్‌బరీ కమిటీ ఎదుట మొదటిసారిగా కొన్ని ప్రతిపాదనలు చేశారు. నిమ్న వర్గాల వారి హక్కుల కోసం 1920 జనవరిలో "మూక్ నాయక్" అనే పక్షపత్రికను ప్రారంభించారు.

ఉన్నత విద్యకోసం 1920 జులైలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో చేరారు. "ది ప్రాబ్లమ్ ఆఫ్ రూపి" అనే పరిశోధనా పత్రాన్ని 1922 సంవత్సరంలో లండన్ విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆనాటి కరెన్సీ సమస్యలపై వెలువడిన అత్యుత్తమ గ్రంథంగా అది పేరుపొందింది. అధికారంలో ఉన్నవారు నిజాన్ని గుర్తించటంలో చేసిన అలసత్వం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని తీర్పు చెప్పారు. ఈ పుస్తకం ఆయన అపార మేధా సంపత్తిని తెలియజేస్తుంది. ఇది అద్భుతమైన పుస్తకం అని ది ఎకనామిక్స్ లండన్ పత్రిక, ది టైమ్స్ లండన్ పత్రికలు సమీక్షించాయి. దీనికిగాను ఆయనకు డాక్టరేట్ డిగ్రీ ఇవ్వబడింది. 1922 సంవత్సరంలో లండన్‌లో "బార్ ఎట్ లా" పూర్తిచేశారు. 1922-23 సంవత్సరాల మధ్య కాలంలో కొద్ది మాసాలు జర్మనీలోని బాన్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రం అధ్యయనం చేశారు.

కొల్హాపూర్ మహారాజ్ 1902లోనే రిజర్వేషన్ చట్టం తీసుకొచ్చారు. తన సంస్థానంలో సమర్థవంతంగా అమలుచేశారు. దీనిద్వారా అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన వర్గాల వారికి 50 శాతంపైగా రిజర్వేషన్ కల్పించి వారి అభ్యున్నతికి ఆదర్శంగా నిలిచారు. అభివృద్ధి చూపారు. 1918లో మైసూర్‌లోనూ, 1921లో మద్రాస్‌లోనూ, 1925లో బొంబాయి లోనూ ఈ రిజర్వేషన్ విధానాన్ని ఆయా సంస్థానాలు అమలుపరిచాయి.

"మనలో ముందు ఆత్మగౌరవం ఏర్పడి మన అభివృద్ధికి స్వయంకృషి కంటే మించిన

(మిగతా 35వ పేజీలో)

# అంబేద్కర్

**ఈ** ఏడాది డా॥ బి.ఆర్. అంబేద్కర్ 125వ జన్మదినోత్సవాలను దేశమంతా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జీవితం, కృషి, నేటి పరిస్థితుల్లో ఆయన ఆలోచనల ప్రాధాన్యత గురించి విస్తృతంగా చర్చ జరిగింది. అంబేద్కర్ జన్మించి 125, ఆయన మరణించి 60 సంవత్సరాల తరువాత కూడా ఆయన ఆలోచనలు, కృషి నేటికీ ప్రాసంగికత పెంచుకుంటున్నాయి. అందుకే ఈ 125వ జయంతి ఆయన ఆలోచనలపై చర్చకు సందర్భం అయింది. ఈ సందర్భంగా మూడు రకాలైన వాదనలు ముందుకొచ్చాయి. మొదటిది, అంబేద్కర్‌ను కేవలం దళితులు, బలహీన వర్గాల నాయకునిగా చేసి ఆరాధించే వాదనలు. రెండవది, ఆయనను సామాజిక మార్పును కోరుకునే రాడికల్‌గా పరిగణించే వాదనలు. మూడవది, ఆయనను కూడా భారత దేశంలో హిందుత్వాను కోరుకునే, విదేశీ మతాలను వ్యతిరేకించే వానిగా చిత్రీకరించే వాదనలు.

ఈ దేశంలో దళితులపై సాగుతున్న కుల పీడన, అంటరానితనం, వారి ఆర్థిక, సాంఘిక వెనుకబాటు తనాన్ని రాజకీయ ఎజెండాలోకి తీసుకొచ్చిన ఘనత అంబేద్కర్‌దే. ఆయన కృషి ఫలితంగానే చట్టసభల్లోనూ, విద్యా ఉద్యోగాల్లోనూ దళితులకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు లభించాయి. అంత మాత్రాన ఆయన కృషిని కేవలం అక్కడికే పరిమితం చేస్తే అంబేద్కర్ కొందరి వాడే అవుతాడుగానీ అందరివాడు కాడు. వాస్తవానికి అంబేద్కర్ కృషి భారత దేశమంత విశాలమైనది. ఈ దేశ రాజ్యాంగ నిర్మాణ పరిషత్ ఛైర్మన్‌గా అంబేద్కర్ ఉన్నారు కాబట్టే అందులో ఆయన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వ స్ఫూర్తిని ప్రవేశపెట్టగలిగారు. అది ఈ దేశ ప్రజలకు అంబేద్కర్ అందించిన పెద్ద వరం. అయితే అదే సమయంలో అంబేద్కర్ తన రాడికల్ ఆలోచనలన్నిటికీ రాజ్యాంగ రూపం ఇవ్వలేకపోయాడన్నది కూడా నిజం. ఆ విషయాన్ని ఆయనే చెప్పాడు. నిజానికి రాజ్యాంగంలోని అంబేద్కర్‌కన్నా బయటి అంబేద్కర్ మరింత రాడికల్. ఆయన రచన 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' ఒక్కటి చాలు ఆయన ఆలోచనలు ఎంతటి రాడికల్‌గా ఉన్నాయో చెప్పడానికి. అందులో ఆయన రాడికల్ భూసంస్కరణలను ప్రతిపాదించాడు. పరిశ్రమలు జాతీయం కావాలన్నాడు. అంబేద్కరిస్టులు ఈ ఆర్థిక విషయాల జోలికి పోరు. కానీ నాడూ నేడూ కమ్యూనిస్టులు ఇవే లక్ష్యాలుగా పని చేస్తున్నారు. అంబేద్కరిస్టులు సామాజిక విముక్తి గురించి అంబేద్కర్ చెప్పిన విషయాలను మాత్రమే గుర్తించి ఆర్థిక అంశాలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తే, కమ్యూనిస్టులు ఆర్థిక విముక్తికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సామాజిక వివక్ష అంశాలకు తక్కువ ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. అందువల్ల ఒకే లక్ష్యం కోసం పోరాడే రెండు శక్తుల మధ్య దూరం ఉంటూ వచ్చింది. ఈ ధోరణులు సరికావు, భారత దేశ పరిస్థితుల్లో సామాజిక విముక్తి, ఆర్థిక విముక్తి అనే రెండు చక్రాలపై పోరాట రథం నడవాలన్న తెలివిడి నేడు ఇరు పక్షాల్లో వస్తోంది. ఇది శుభ పరిణామం.

ఇక చివరి వాదనను ప్రస్తావించుకుంటే, అంబేద్కర్ ఏనాడూ హిందుత్వ సిద్ధాంతాన్ని సమర్థించ లేదు. పైగా తన కృషిని ప్రధానంగా హిందూ మతంలోని లోపాలపైనే ఎక్కుపెట్టాడు. హిందూ మతం సమర్ధిస్తున్న వర్ణ, కుల విభజనను తీవ్రంగా వ్యతిరేకించాడు. దళితులనూ, స్త్రీలనూ అంటరానివారుగా పరిగణించే హిందూమతాచారాలను అసహ్యించుకున్నాడు. కుల నిర్మూలన కావాలన్నాడు. దళితుల ఆలయ ప్రవేశం కోసం, అగ్రవర్ణాలతో బాటు ఒకే చెరువులో నీరుతోడుకునే హక్కుకోసం ప్రత్యక్షంగా పోరాటాలు చేశాడు. కానీ ఎంతచేసినా ఫలితం లేక చివరికి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు. కానీ కేంద్రంలో నేడు అధికారం చెలాయిస్తున్న హిందుత్వ వాదులు ఒకవైపు రిజర్వేషన్లకు తిలోదకాలిస్తూ, దేశాన్ని పాత కాలపు హిందూ మత రాజ్యంగా మార్చడానికి ప్రయత్నిస్తూనే, మరోవైపు దళితుల ఓట్లు, వారి మద్దతు కోసం అంబేద్కర్‌ను తమ వాడిగా చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే హిందూ మతానికి వ్యతిరేకంగా పుట్టిన బౌద్ధ మతాన్ని నాశనం చేయడం కోసం బుద్ధుణ్ణి దేవునిగా ఎలా మార్చివేశారో, ఇప్పుడు అంబేద్కర్‌కు కూడా విగ్రహాలు పెట్టి, అంబేద్కర్ ఆరాధనలు చేసి ఆయన ఆలోచనలను, కృషిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ అంశాలన్నిటినీ విశ్లేషిస్తూ 'మార్క్సిస్టు' మే నెల సంచికను అంబేద్కర్‌పై ప్రత్యేక సంచికగా తీసుకువస్తున్నాం. చదివి మీ అభిప్రాయాలు పంపాల్సిందిగా కోరుతున్నాం.

## ఈ సంచికలో...


1. **విజ్ఞాన వారధి జనసారథి డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్**
   మాతంగి దిలీప్‌కుమార్ ....... 2
2. **అంబేద్కర్ తిరుగుబాటు దృక్పథాన్ని పరిరక్షించుకుందాం!**
   ప్రకాశ్ కరత్ ................. 4
3. **అంబేద్కర్ ఆలోచనా విధానం- సమకాలీన అవసరం**
   బివి రాఘవులు ............... 6
4. **ప్రజాస్వామ్య లౌకికవాది న్యాయ సంరక్షకుడు**
   అశోక్ ధావలే ............... 9
5. **అస్తిత్వవాదం - కమ్యూనిస్టుల వైఖరి**
   ఎస్ వీరయ్య................. 14
6. **రిజర్వేషన్లు: మోదీ - అంబేద్కర్**
   ఆనంద్ తెల్‌తుంబ్డే ........... 17
7. **నేను కమ్యూనిస్టును కాక పోతినేమి....**
   తిప్పసముద్రం రమణ ....... 19
8. **హక్కులను హరిస్తున్న కేంద్ర ముసాయిదా కౌలుచట్టం**
   ఎ కోటిరెడ్డి.................... 20
9. **అభివృద్ధిలో వెనుకవరుసన మహిళా శ్రేయస్సు**
   అనిందితాసేన్ గుప్తా........ 25
10. **ఆర్‌యస్‌యస్ మతతత్వ ప్రణాళికను అమలు చేస్తున్న మోడి**
   ఏ.జి. నూరాని................ 29



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# అంబేద్కర్ తిరుగుబాటు దృక్పథాన్ని పరిరక్షించుకుందాం!



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**ప్రకాశ్ కరత్**

అంబేద్కర్ జీవితాన్ని, కృషిని ఆయన 125వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న దేశమంతా స్మరించుకుంది. అంబేద్కర్– కుల వ్యతిరేక పోరాటయోధుడు, దళితుల విముక్తి ప్రదాత, సంఘ సంస్కర్త, భారత రాజ్యాంగ నిర్మాత, మహిళా హక్కుల ఛాంపియన్– వంటి ఉన్నత వ్యక్తిత్వంలోని వివిధ కోణాలను ఇది ఎత్తిచూపింది. అదే సమయంలో అంబేద్కర్ వారసత్వాన్ని మతతత్వ–దురభిమాన శక్తులు అందిపుచ్చుకోవాలని, ఆపాదించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో అంబేద్కర్ తిరుగుబాటు ప్రజాతంత్ర దృక్పథాన్ని, సామాజిక విముక్తికి ఆయన ఇచ్చిన సందేశాన్ని నిజమైన ప్రజాసామ్యానికి పునాదిగా చేసుకోవాల్సిన అవసరముంది. ఎందుకంటే, మొదటిదీ, ముఖ్యమైనదీ ఆయన విగ్రహారాధనకు వ్యతిరేకి. దోపిడీ, కుల వ్యవస్థకు గుండెకాయగా ఉన్న అసమాన సామాజిక దొంతరలపై ఆయన తన పోరాటాన్ని ఎక్కుపెట్టారు. ఈ సందర్భంలో అంబేద్కర్‌ను కేవలం సంఘ సంస్కర్తగా చూపితే సరిపోదు. ఆయన సమకాలీనులు ఎందరో చేసిన విధంగా ఆయన కుల వ్యవస్థను లేదా హిందూవాదాన్ని సంస్కరించాలని అనుకోలేదు. ఆయన కులాన్ని, హిందూవాదాన్ని రెండింటినీ వ్యతిరేకించారు. 1925కు ముందే ఆయన 'మనుస్మృతి దహన దినం' నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మనుస్మృతిని బహిరంగంగా దగ్ధం చేశారు. గాంధీజీ అస్పృశ్యతా వ్యతిరేక ప్రచారాన్ని ఉన్నత కులాల ప్రయోజనాలను కాపాడే, వర్ణ వ్యవస్థను నిలబెట్టే సాధనంగా ఆయన భావించారు. కులానికి, కుల దొంతరలను నిలబెట్టిన బ్రాహ్మణవాద వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన రాజీలేని పోరాటం చేసే విధంగా చేసింది అంబేద్కర్‌లోని తిరుగుబాటు ప్రజాతంత్ర తత్వమే. ఆయన రాజకీయ, తాత్విక ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అంబేద్కర్‌ను మితవాద ప్రజాతంత్ర వాదిగా చూస్తున్నారు. ఈ వెలుగులోనే ఆయనను చూడటం సరైంది కాదు. అలాగే మరి కొందరు ఆయనను 'రాజ్యాంగ పరమైన ప్రజాతంత్ర వాది'గా ప్రశంసిస్తున్నారు. ఇలా అనడం కూడా ఆయనకు అపకారం చేయడమే అవుతుంది. అంబేద్కర్ తిరుగుబాటు సంస్కరణవాదం బూర్జువా మితవాద హద్దులను తెంచేసింది.



ప్రజలతో కలిసి కార్యక్రమాలలో పాల్గొంటున్న డా॥ బి.ఆర్. అంబేద్కర్

ఆర్థిక, సామాజిక సమానత్వం లేకపోతే రాజ్యాంగం, రాజకీయ ప్రజాస్వామ్యం నిస్సారంగా మిగిలిపోతాయని ఆయన హెచ్చరించారు. ఆయన ఆర్థిక కార్యక్రమం సంప్రదాయిక బూర్జువా సూత్రాల కంటే ఎంతో ముందుంది. దేశ ఆర్థిక వ్యవస్థ రాజ్య నియంత్రణలో ఉండాలని ఆయన చెప్పినప్పుడు దాన్ని వ్యతిరేకిస్తూ అది 'స్వేచ్ఛ'ను హరిస్తుందని కొందరు వాదించినప్పుడు "ఆ స్వేచ్ఛ ఎవరికి, ఎవరి కోసం?', అలాంటి స్వేచ్ఛ తప్పనిసరిగా కౌలు పెంచేందుకు భూస్వాములకు, పని గంటలు పెంచేందుకు, వేతనాలు తగ్గించేందుకు పెట్టుబడిదారులకేగా" అని ఆయన ప్రతిస్పందించారు.

అంబేద్కర్ మహిళల హక్కుల కోసం నికరంగా పోరాడారు. స్వాతంత్ర్యానంతరం దేశ మొదటి కేబినెట్‌లో న్యాయశాఖ మంత్రిగా మహిళలకు ఆస్తి హక్కును, వారసత్వ హక్కును ప్రసాదించే హిందూ కోడ్ బిల్లును ఆయన ప్రవేశపెట్టారు. దీనికి అంతర్గతంగా కాంగ్రెస్ పార్టీ నుంచి, హిందూ మితవాద శక్తుల నుంచి ప్రతిఘటన ఎదుర్కొన్నప్పుడు ఆ సమస్యపై రాజీ పడేకంటే పదవికి రాజీనామా చేయడానికే ఆయన ప్రాధాన్యతనిచ్చారు. ఆయన రచనల్లోంచి అసందర్భంగా కొన్ని ఎంపిక చేసిన వాక్యాలను తీసుకొని అంబేద్కర్ ఆలోచనలను, రచనలను వక్రీకరించడం ద్వారా ఆయనను సొంత చేసుకునేందుకు బిజెపి, పరివార్ కూటమి చాలా చురుగ్గా ప్రయత్నిస్తోంది. ఆయనను హిందూ సంఘ సంస్కర్తగా, తిరుగులేని ముస్లిం వ్యతిరేకిగా చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఆయన హిందూవాదాన్ని ఖండించడం, బౌద్ధ మతం స్వీకరించడాన్ని మరుగుపరచాలని చూస్తోంది.

సంఘ్‌కు ఉన్న హిందూ నాయకుల సరసన దళిత నేతగా అంబేద్కర్‌ను చేర్చాలనేదే వారి ఈ ప్రయత్నంలోని ముఖ్య ఉద్దేశం. ఇది సత్యానికి మసిపూసి మారేడుకాయ చేయడం మినహా మరొకటి కాదు. అంబేద్కర్ హిందూ మహాసభ, ఆరెస్సెస్ భావజాలాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. “హిందూ పాలన దేశంలో వాస్తవరూపం దాల్చితే అది దేశానికి గొప్ప విపత్తు అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు’ అని ఆయన రాశారు. నాగరిక సమాజానికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అత్యంత ముఖ్యమైన సూత్రాలని అంబేద్కర్ భావన. వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాలు, హిందూ శాస్త్రాలు ఈ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమైనవని ఆయన వివరించారు. దళితులను హిందూ కుల దొంతరలలో చేర్చేందుకు చేసిన ప్రయత్నాన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారు.

అది ముస్లిములకు, ఇతర మత మైనారిటీలకు వ్యతిరేకంగా ఉద్దేశించిందేనంటూ ఆయన వ్యతిరేకించారు. స్వాతంత్ర్య పోరాటంలో విముక్తిని కోరుతూ అనేక ప్రవాహాలు, సిద్ధాంతాలు ముందు కొచ్చాయి. దృక్పథం, సిద్ధాంతాల విషయంలో కమ్యూనిస్టులకు, అంబేద్కర్‌కు తేడాలున్నాయి. అయితే ఆర్థిక, సామాజిక విముక్తికి అంతర్లీనంగా ఉన్న స్వాతంత్ర్యం, సమానత్వం విష యంలో వారిద్దరికీ పెద్ద ఎత్తున ఏకీభావముంది. ఆయన సమూల విముక్తి దృష్టికోణాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి ఒక చిహ్నంగా మార్చడం నుంచి అంబేద్కర్‌ను కాపాడాల్సిన అవసరం ఉంది. కొందరు దళిత నేతలు ఆయన వారసత్వాన్ని రిజర్వేషన్లకు, కోటా రాజకీయాలకు కుదించడం సిగ్గుచేటు. అలా చేయడం వల్ల వారు పాలక పక్ష రాజకీయాలకు సహాయకారులుగా మారాల్సి వస్తోంది. ఆయన సందేశంలోని విస్తృత విముక్తి ఊపును, సార్వజనీనతలను దళిత, కుల వ్యతిరేక ఉద్యమాల్లోకి చొప్పించాలి. అలాంటి సామాజిక విముక్తి వేదిక భారతదేశంలోని వర్గ పోరాటంలో అంతర్భాగంగా ఉండాలి. భారత దేశంలోని కమ్యూనిస్టులను అంబేద్కర్‌తో కట్టిపడేసిన సాంగత్యం అదే. ప్రతీఘాత శక్తులు మతతత్వం, నయా ఉదారవాద బ్యానర్ల కింద సంఘటితమవుతున్న తరుణంలో వామపక్ష ఉద్యమం, అంబేద్కరీయుల ఉద్యమం అనే రెండు ప్రవంతులు కలిసి పయనిస్తున్నాయి. ఈ విస్తృత ఐక్యతను ముందుకు తీసుకెళ్ళాలంటే అంబే ద్కర్‌కున్న నిజమైన ప్రాధాన్యతను, వారసత్వాన్ని దొరకబుచ్చుకోవాల్సిన, సొంతం చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ❈

**❝ అయితే ఆర్థిక, సామాజిక విముక్తికి అంతర్లీనంగా ఉన్న స్వాతంత్ర్యం, సమానత్వం విష యంలో వారిద్దరికీ పెద్ద ఎత్తున ఏకీభావముంది. ఆయన సమూల విముక్తి దృష్టికోణాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి ఒక చిహ్నంగా మార్చడం నుంచి అంబేద్కర్‌ను కాపాడాల్సిన అవసరం ఉంది.❞**



పత్రికాపఠనంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్


స్వాతంత్ర్యానంతరం మొదటి క్యాబినెట్‌లో డా॥ బి.ఆర్. అంబేద్కర్

# అంబేద్కర్ ఆలోచనా విధానం సమకాలీన అవసరం

**బివి రాఘవులు**



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

ఈనాడు ప్రతి ఒక్కరూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవితం, కృషి గురించీ మాట్లాడుతున్నారు. ఇంతగా ఆసక్తి పెరగటానికి దారితీసిన కారణాలలో అంబేద్కర్ 125వ జయంతి ఒకటి కావచ్చు. ఏదియేమైనప్పటికీ అంబేద్కర్ పట్ల రాజకీయ పార్టీలు చూపుతున్న ఆసక్తికి ఇతరేతరంగా బలమైన రాజకీయ కారణాలే ఉన్నాయి. అంబేద్కర్ కృషి ప్రధానంగా స్వాతంత్ర్యం రావటానికి ముందటి కాలానికి సంబంధించినది. 1956 డిసెంబరు 6వ తేదీన ఆయన మరణించాడు. ఆ సమయానికి స్వాతంత్ర్యం సిద్ధించి కనీసం దశాబ్దమైనా కాలేదు. ఆయన ప్రధాన పాత్రధారిగా ఉన్న రాజ్యాంగ ముసాయిదాను ప్రకటించి అప్పటికింకా ఐదేళ్ళయినా కాలేదు. గత ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో తమ ప్రయోజనాలకు అనుగుణంగా అంబేద్కర్ వారసత్వాన్ని ఉపయోగించుకునేందుకై పాలక వర్గాలు ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఈనాడు మనం చూస్తున్న ముమ్మర ప్రయత్నాలు మునుపెన్నడూ జరగలేదు.

కాంగ్రెసు పార్టీ దళితుల్లోనూ, ఇతర బలహీన వర్గాల్లోనూ కోల్పోయిన మద్దతును తిరిగి సంపాదించేటందుకై అంబేద్కర్‌ను తన వాడిగా చెప్పుకునేందుకు మరోసారి ప్రయత్నిస్తున్నది. దళితులు, ఇతర బలహీన వర్గాలు దీర్ఘకాలం పాటు కాంగ్రెసు పార్టీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. కానీ వారి ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీసిన నయా ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టిన అనంతరం ఒకదాని తరువాత మరో రాష్ట్రంలో ఈ ఓటు బ్యాంకు బలహీన పడసాగింది. ఇప్పుడు తాను కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి సంపాదించేందుకై పేదల పక్షపాతినన్న ముసుగును ధరించవలసిన ఆవశ్యకతను గ్రహించి, బలహీన తరగతులను దువ్వే తన వ్యూహంలో అంబేద్కర్ ప్రాధాన్యతను పునరుద్ధరించేందుకు పాటుపడుతున్నది.

తన హిందూత్వ పథకానికి రూపం ఇవ్వటంలో తన భావజాలమూ, ఆచరణ పెద్ద ఆటంకంగా మారిన విషయాన్ని గ్రహించిన సంఘపరివార్ సైతం అంబేద్కర్ పట్ల ఆసక్తి చూపసాగింది. ఈ ఆటంకాన్ని అధిగమించేందుకు అంబేద్కర్ భావాలను సవరించి, వక్రీకరించి తన ద్వేషపూరిత భావజాలానికి ఆయనను మద్దతుదారుగా చూపేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందుకుగాను దళితులపై దాడిచేసి వారిని లోబరుచుకోవటం, అంబేద్కర్ భావాలను వక్రీకరించి తనకు అనుగుణంగా మార్చుకోవటం అనే ద్విముఖ వ్యూహాన్ని సంఘపరివార్ అనుసరిస్తున్నది. కేంద్రంలో బిజెపి అధికారాన్ని చేపట్టిన తరువాత దళితులు, ఇతర బలహీన వర్గాలపై భౌతిక దాడులు పెరిగాయి. మద్రాసు ఐఐటిలో అంబేద్కర్–పెరియార్ అధ్యయన కేంద్రం నిర్వాహకులు వేధింపులకు గురైన తీరు, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల ఆత్మహత్య దుర్ఘటన 'భారతీయ సంస్కృతి' పేరుతో 'ఆధిపత్య కుల సంస్కృతిని' రుద్దాలనే వారి ఉద్దేశ్యాలను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు బలహీన వర్గాలను కించపరుస్తూ ఇటీవల చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు మరో ఉదాహరణగా నిలుస్తాయి.

అంబేద్కర్ తన జీవిత కాలమంతటా వ్యక్తం చేసిన భావాలు హిందూత్వ శక్తుల భావాలకు పూర్తి విరుద్ధమైనవి. కులవ్యవస్థను రూపుమాపేందుకూ, కులవ్యవస్థను నిలబెట్టి ఉంచాలని చూసే హిందూ మతబోధలనూ, భావజాలాన్నీ బట్టబయలు చేసేందుకూ ఆయన తన జీవితమంతా కృషిచేశాడు. హైందవం ఉన్నంత కాలం కులవ్యవస్థ, అస్పృశ్యత ఉండి తీరతాయని, దాని ఉక్కు పిడికిలి నుంచి బయట పడినపుడు మాత్రమే దళితులు విముక్తి చెందగలరని అంబేద్కర్ గట్టిగా నమ్మాడు. ఇందువలనే ఆయన అన్ని కోణాల నుంచి ఆలోచన చేసి హిందూ మతాన్ని విడిచిపెట్టి తన అనుచరులతో కలిసి బౌద్ధాన్ని స్వీకరించాడు. ఈ కారణంగానే హిందూమత సంస్కర్తగా అంబేద్కర్‌ను చూపేందుకు చేసే ఎలాంటి ప్రయత్నమైనా ఏ ఒక్కరినీ, ప్రత్యేకించి అణగారిన తరగతుల వారిని నమ్మించలేవు.

అంబేద్కర్‌కు తామే అసలుసిసలైన వారసులమని చెప్పుకునే సంస్థల్లోనూ, బుద్ధిజీవుల్లోనూ పూర్తిగా విభిన్నమైన ధోరణి కొనసాగుతున్నది. కుల వ్యవస్థకు వ్యతిరేకంగానూ, దళితుల విముక్తి కోసమూ జరిగే పోరాటంలో చెప్పుకోదగిన పురోగతిని సాధించేటందుకై దళితులకు 'రాజకీయాధికారం' వంటి నినాదాలను ఇవ్వటంలో చోటు చేసుకుంటున్న వైఫల్యం వారిలోని కొందరిని సంశయంలోకి నెడుతున్నది. ఇలాంటి పరిస్థితి నెలకొనటంతో కొన్ని సంఘాలూ, కొంతమంది వ్యక్తులూ సామాజిక మార్పు పట్ల విశ్వాసాన్ని కోల్పోయి, నిరభ్యంతరంగా పాలక వర్గాల చెంతకు చేరుతున్నారు. ఇలా చేరినవారే దళితుల్లోని కొందరి పురోగమనం అందరి పురోగమనానికి దారితీయగలదన్న భావనను కల్పించటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ దళితులకు ఎదురవుతున్న వాస్తవాల ముందు ఇలాంటి భ్రమలు కరిగిపోతున్నాయి. సామాజిక వ్యవస్థ స్థిరత్వాన్ని నిలిపేందుకై పెట్టుబడిదారీ వ్యవస్థ ఉద్దేశపూర్వకంగానే బలహీన తరగతులకు చెందిన కొంతమంది వ్యక్తులను సామాజికంగా పై స్థాయికి తీసుకెళుతుంది. బలహీన తరగతులకు చెందిన కొంతమందిని పాలక వర్గాలలోకి తీసుకు వెళ్ళాలన్న కాంక్షే 'అధికారంలో భాగస్వామ్యం' అన్న నినాదాన్ని ఇచ్చేలా చేస్తున్నది.

మార్క్స్ చాలాకాలం క్రితమే దీనిని గుర్తించాడు. "అది (పెట్టుబడిదారి ఉత్పత్తి విధానం) అప్పటికే ఉన్న వ్యకిగత పెట్టుబడిదారులతో పాటు వారి పక్కన, వారికి

వ్యతిరేకంగా అవసరం లేనంత ఎక్కువ మంది కొత్తవారు ఈ రంగంలో తమ అదృష్టాన్ని వెతుక్కొంటూ నిరంతరం వచ్చేలా చేస్తూ ఉండటం పెట్టుబడి ఆధిపత్యాన్ని పున:శక్తివంతం చేస్తూ, దాని పునాదిని మరింత విస్తృతం చేస్తూ, సమాజంలోని దిగువ అంతస్తు నుండి నూతన శక్తులను నిరంతరం తనలో కలుపుకోవటానికి అవకాశం కల్పిస్తుంది. ఆధిపత్యం చెలాయిస్తున్న వర్గం ఆధిక్యతను ప్రదర్శిస్తున్న వర్గాల నుండి ఉత్తమమైన వ్యక్తులను తనలో చేర్చుకోవటం వలన దాని పాలన సుదృఢం, మరింత ప్రమాదకరం అవుతుంది. ( కాపిటల్ 3వ వాల్యూమ్, 735-736 పేజీలు)

నయా ఉదారవాద విధానాల విధ్వంసకర స్వభావాన్ని చూసి దళిత మేధావుల్లోని ఒక భాగం తీవ్రంగా ఆందోళన చెందుతున్నది. అంబేద్కర్ వరప్రసాదంగా చెప్తున్న రిజర్వేషన్ల వైఫల్యాన్నీ, వాటి స్వల్ప వినియోగాన్నీ వారు గమనిస్తున్నారు. అంతేకాక నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా రిజర్వేషన్లను రక్షించుకోలేమని కూడా వారు గ్రహిస్తున్నారు. కులం పునాదిపై నిలిచిన అణచివేత, అసమానతలపై చర్చను పక్కకు తప్పించేందుకై ప్రతీకారేచ్ఛతో కూడిన జాతీయవాదాన్నీ, ప్రతీఘాత దేశభక్తినీ, మరణశయ్యపై ఉన్న ఫ్యూడల్ సంస్కృతినీ ముందుకు తీసుకురావడం ద్వారా హిందూత్వ శక్తులు చేస్తున్న ప్రయత్నాల పట్ల కూడా వారు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

నయా ఉదారవాద విధానాలనూ, మతతత్వాన్నీ, తిరోగమన సంస్కృతినీ వ్యాప్తిలోకి తీసుకు రావటం ద్వారా తమ పెత్తనాన్ని రుద్దేటందుకు ప్రయత్నిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా సాగించే పోరాటంలో సహాయకారిగా ఉండే నిర్దిష్టమైన అంబేద్కర్ భావాలను గుర్తించలేనంత కాలం ప్రస్తుతం దళిత ఉద్యమంలో నెలకొన్న అసంతృప్తిని ఈ దళిత మేధావులు తొలగించలేరు.

దళిత మేధావుల్లోని ఒక భాగం మార్క్సిజంపై వ్యతిరేకతను విడువలేని అశక్తతలో కూరుకు పోయారు. దోపిడీకి గురవుతున్న వారి హక్కుల కోసం పోరాడుతున్న శక్తులతోనూ, ఉద్యమాలతోనూ కలిసి రావడానికి అయిష్టతను చూపుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకూ, కులపరమైన అసమానతలు కొనసాగటానికి మధ్య ఉన్న సంబంధాన్ని వారిలో అత్యధికులు ఇప్పటికీ గ్రహించటం లేదు. ఈ గ్రహింపు లేని పక్షంలో, తమ ప్రయోజనాలకు అనుగుణంగానూ, పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగింపుకూ

**"నయా ఉదారవాద విధానాలనూ, మతతత్వాన్నీ, తిరోగమన సంస్కృతినీ వ్యాప్తిలోకి తీసుకు రావటం ద్వారా తమ పెత్తనాన్ని రుద్దే టందుకు ప్రయత్నిస్తున్న శక్తులకు వ్యతిరేకంగా సాగించే పోరాటంలో సహాయకారిగా ఉండే నిర్దిష్టమైన అంబేద్కర్ భావాలను గుర్తించ లేనం త కాలం ప్రస్తుతం దళిత ఉద్యమంలో నెలకొన్న అసంతృప్తిని ఈ దళిత మేధావులు తొలగించలేరు."**



రాజ్యాంగ సభలో ప్రసంగిస్తున్న బి.ఆర్. అంబేద్కర్

తగినట్లుగా అంబేద్కర్ వారసత్వాన్ని వక్రీకరించేటందుకు ప్రయత్నిస్తున్న పాలక వర్గాలకు వారు తోడ్పడిన వారే అవుతారు.

ఎవరైతే అంబేద్కర్ వారసత్వాన్ని సమున్నతంగా నిలిపి ముందుకు తీసుకు పోవటానికి సిద్ధంగా ఉన్నారో, అలాంటి వారితో చేతులు కలిపే విషయమై అంబేద్కర్ పట్ల విశ్వాసం ఉన్న దళిత సంఘాలు, మేధావులు పునరాలోచన చేయాలి.

అంబేద్కర్ వారసత్వం పట్ల కమ్యూనిస్టులు కూడా మునుపటికన్నా ఎక్కువ ఆసక్తినే చూపుతున్నారు. బిజెపీ, కాంగ్రెసు పార్టీల వలె కాకుండా, కమ్యూనిస్టులు దళితుల, ఇతర బలహీన వర్గాల ప్రయోజనాల కోసం అంబేద్కర్ భావజాలంలోని మౌలిక అంశాలను ముందుకు తీసుకు వెళ్ళాలని భావిస్తున్నారు. సహజంగానే ఇది కొన్ని అర్ధవంతమైన, మరికొన్ని దురదృష్టకరమైన విమర్శలకు కారణమవుతున్నది. కులవ్యవస్థ నిర్మూలనకు పనిచేయటంలో కమ్యూనిస్టుల చిత్తశుద్ధిని పలువురు నిత్యశంకితులు ప్రశ్నిస్తున్నారు.

కులవ్యవస్థ నిర్మూలన లక్ష్యాన్ని కమ్యూనిస్టులు ఎన్నడూ విస్మరించడం లేదా అలక్ష్యం చేయడం జరగలేదు. 1928లో భగత్ సింగ్ కులవ్యవస్థకు వ్యతిరేకంగానూ, కారాగారంలో ఉన్నపుడు సోషలిజం గురించీ వ్యాసాలు రాయటం ఎంతమాత్రం యాదృచ్ఛికం కాదు. మన దేశంలో సోషలిస్టు వ్యవస్థను స్థాపించాలనుకున్న వారు కులవ్యవస్థ నిర్మూలన ఆవశ్యకతను విస్మరించలేదన్న విషయాన్ని ఇది తెలియ చేస్తుంది. కులవ్యవస్థకూ, దాని అణచివేత రూపాలకూ వ్యతిరేకంగా జరిగే పోరులో ఫూలే, అంబేద్కర్లతో పాటు కమ్యూనిస్టు పార్టీ మినహా మరే సంస్థా ముందుపీఠిన లేవని చెప్పటం ఎంతమాత్రం అతిశయోక్తి కాబోదు. ఎక్కువ మంది కమ్యూనిస్టుల రాజకీయ జీవితం కుల వ్యతిరేక పోరాటంతోనే ప్రారంభమైంది. వారి నేతృత్వంలో సాగిన గ్రామీణ రైతాంగ పోరాటాలలో కుల వివక్ష తొలగింపు ప్రధానాంశంగా ఉన్నది. కమ్యూనిస్టుల బలహీనత కుల వివక్షను గుర్తించక పోవటం లేదా దానికి వ్యతిరేకంగా పోరాడక పోవటంలోనో లేదు. కుల నిర్మూలనకూ, వర్గాల రద్దుకూ జరిగే పోరాటాల మధ్య గతితార్కిక సంబంధాన్ని అవగాహన చేసుకోలేక పోవటంలో వారి వైఫల్యం ఉన్నది. వర్గాల రద్దు దానంతటదే కుల నిర్మూలనకు దారితీయగలదన్న ఒకేఒక్క ఆలోచనను కలిగి ఉండటం జరిగింది. ఈ బలహీనత కేవలం ఒక్క కులానికి మాత్రమే పరిమితం కాలేదు. స్త్రీల సమస్యల గురించీ, సాంస్కృతిక సమస్యల గురించి కలిగివున్న అవగాహనకు కూడా ఇది వర్తిస్తుంది. దీనిని కమ్యూనిస్టులు చాలాకాలం క్రితమే గుర్తించారు. ఆ తరువాత కుల అణచివేతపై పోరాటంలో అంబేద్కర్ మౌలిక భావాలను ముందుకు తీసుకుపోవటానికి ఏమాత్రం సంశయించలేదు.

పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేయకుండా ప్రస్తుతమున్న కులవ్యవస్థను నాశనం చేయలేమనటంలో ఎలాంటి సందేహమూ లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థను రూపుమాపటానికి అవసరమైన వర్గ సమైక్యతను సాధించే క్రమానికి

> **"కుల వ్యవస్థ కేవలం శ్రమ విభజననే కాక, శ్రామికులను కూడా విభజించిందంటూ ఆయన చేసిన ప్రకటన, దోపిడీకి గురవుతున్న తరగతుల ఐక్యతను సాధించాలంటే వారిలో ఉన్న కుల దురవగాహనలను తొలగించాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తున్నాయి. కుల వ్యతిరేక చైతన్యాన్ని అడ్డుకుంటున్న అసమా నతలో ఉన్న ప్రత్యేకతలోని ఒక అంశాన్ని అంబేద్కర్ వివరిస్తాడు."**



భార్య సవితతో అంబేద్కర్

కులవ్యవస్థ కల్పించే ఆటంకాలను గుర్తించ వలసిన ఆవశ్యకత ఉన్నది.

అంబేద్కర్ యొక్క మౌలిక భావ జాలమూ, కమ్యూనిస్టుల సిద్ధాంతమూ భిన్న ధ్రువాలైనప్పటికీ, కులవ్యవస్థకు వ్యతిరేకంగానూ, దళితుల, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సాగిన పోరాటంలో అంబేద్కర్ చేసిన మహత్తర కృషిని గుర్తించటంలో కమ్యూనిస్టులు ఎన్నడూ విఫలం కాలేదు. అంబేద్కర్‌లోని ఉత్తమాంశాలను తీసుకుని ముందుకు వెళ్ళాలని, సామాజిక మార్పుకు ఉపయోగపడే భావాలను గుర్తించి వాటిని మెరుగుపెట్టాలని, ప్రస్తుత పరిస్థితులకు సరిపోని భావాలను విడిచి పెట్టాలని కమ్యూనిస్టులు భావించారు.

అంబేద్కర్ తన జీవిత కాలమంతటి లోనూ రాజ్యాంగం కొరకు రెండు నుంచి మూడు సంవత్సరాలు మాత్రమే వినియోగించాడు. దాదాపుగా ఆయన జీవితమంతా కులవ్యవస్థకు వ్యతిరేకంగానూ, బలహీన వర్గాల స్వేచ్ఛ కోసం పోరాడటంలో గడచిపోయింది. అంబేద్కర్ జీవితంలోనూ, కృషిలోనూ ఉన్న ఈ మౌలికాంశాన్ని విడిచిపెట్టటమే కాక, కులవ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన ఆయన ఆలోచన లను వెనక్కు నెట్టివేసి, ఆయనను కేవలం రాజ్యాంగ శిల్పిగా మాత్రమే నిలబెడుతున్నారు. ఆయన విషయంలో ఇది ఘోరమైన అన్యాయం.

అంబేద్కర్ జీవితం బహుముఖమైనది. ఇందులో కులవ్యవస్థ వ్యతిరేక పోరాటమూ, బలహీన వర్గాల విముక్తి కోసం ఆయన సాగించిన పోరాటం అత్యంత ప్రధానమైనవి. అంబేద్కర్ తన జీవితాన్నంతటినీ కులవ్యవస్థ అధ్యయనానికీ, దాని గురించి రాయటానికీ ఉపయోగ పెట్టాడు. కులవ్యవస్థ పనితీరు గురించి ఆయన ప్రదర్శించిన సూక్ష్మదృష్టి సమాజాన్ని మార్చాలనుకునే వారికి కులవ్యవస్థ అంతర్గత చలనాన్ని గురించి చక్కని అవగాహన యిస్తుంది.

కుల వ్యవస్థ కేవలం శ్రమ విభజననే కాక, శ్రామికులను కూడా విభజించిందంటూ ఆయన చేసిన ప్రకటన, దోపిడీకి గురవుతున్న తరగతుల ఐక్యతను సాధించాలంటే వారిలో ఉన్న కుల దురవగాహనలను తొలగించాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తున్నాయి. కుల వ్యతిరేక చైతన్యాన్ని అడ్డుకుంటున్న అసమానతలో ఉన్న ప్రత్యేకతలోని ఒక అంశాన్ని అంబేద్కర్ వివరిస్తాడు. దాన్నాయన నిచ్చెన మెట్ల అసమానతలని పేర్కొంటాడు. ప్రతి కులము తనకు పైనున్న కులం యొక్క ఆధిక్యతను ఆమోదిస్తూ, తనకన్నా దిగువస్థాయిలో ఉన్న కులంపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంది. దళితుల్లోని ఉప కులాలు సైతం ఈ నిచ్చెనమెట్ల అసమానతల నుంచి బయట పడలేదు. ఎల్లెడెలా కన్పించే యీ నిచ్చెనమెట్ల అసమానతలకు వ్యతిరేకంగా పోరాడనట్లయితే, కుల వ్యవస్థను బద్దలు చేయటం, వర్గ ఐక్యతను నిలబెట్టటం లేదా మన ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయటం సాధ్యం కాదని అంబేద్కర్ పదేపదే ఉద్ఘాటించాడు.

కులవ్యవస్థ నిలదొక్కుకుని బలపడటంలో భారతీయ గ్రామాలు నిర్వహించిన పాత్రను కూడా అంబేద్కర్ ఎత్తిచూపుతాడు. అస్పృశ్యతను శాశ్వతం చేయాలని చూసేవారి నుంచి దూరంగా వైదొలగినపుడే కుల అసమానతల నుంచి దళితులకు విముక్తి లభించగలదని ఆయన భావించాడు. కనుకనే ఆయన దళితులకు ప్రత్యేక గ్రామాలు కావాలన్నాడు. కులవ్యవస్థకు గ్రామమే కుదురుగా ఉన్నదన్న అంబేద్కర్ భావనలో నిజం లేకపోలేదు. కుల వ్యవస్థ బలం, గ్రామంలో వేర్వేరు కులాలు ఒకదాని సరసన మరొకటి ఉండటంలోకాక, ఎగువ, పెత్తందారీ కులాల చేతుల్లో భూమి కేంద్రీకృతం కావటంలో ఉంది. నిమ్న కులాలు తమ జీవనం కోసం ఆ భూమిపైనే ఆధార పడవలసి రావటంతో కులవ్యవస్థను స్థిరపరిచే శక్తి అగ్ర కులాలకు సంక్రమిస్తున్నది. పెత్తందారీ కులాల చేతుల్లో భూమి కేంద్రీకృతం కావటాన్ని బద్దలు కొట్టగలిగితే గ్రామంలోని కులవ్యవస్థ యొక్క ఆధిపత్య పునాది కూడా బద్దలవుతుంది. కుల అణచివేత తొలగింపు పోరాటానికి మార్గం ఏర్పడుతుంది.

కులవ్యవస్థను అధిగమించడంలో విద్య పాత్రను కూడా అంబేద్కర్ నొక్కి చెపుతాడు. శూద్రులకు, స్త్రీలకు, అస్పృశ్యులకు విద్యను నిరాకరించటమనేది కులవ్యవస్థ బలోపేతం కావటంలో కీలకపాత్ర వహించిందన్న విషయాన్ని ఆయన గమనించాడు. గ్రామ, కుల అసమానతల నుంచి బయటపడేందుకూ, అలానే అణచివేతను తిప్పికొట్టాలన్న చైతన్యాన్ని అణగారిన తరగతులలో రగిలించేటందుకూ అణగారిన తరగతులలో విద్యావ్యాప్తి ప్రధానమైన ఆయుధం కాగలదని ఆయన భావించాడు. బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం అంబేద్కర్ తన జీవితకాలమంతా కృషి చేయటానికి కారణం ఇదేనని చెప్పాలి.

అంబేద్కర్ వ్యక్తిత్వంలోనూ, ఆలోచనలోనూ ఉన్న సామాజిక మార్పుకు దోహదపడే అంశాలను ఈనాడు ముందుకుతెచ్చి, నిలబెట్టవలసిన అవసరం ఉన్నది. మౌలికమైన సామాజిక మార్పుల కోసం పోరాడే శక్తులకు దోహదపడే అంబేద్కర్ వారసత్వంలోని మౌలికాంశాలను నిలబెట్టి ఉంచాలి. సామాజిక మార్పు గురించి ఆలోచించే యే ఒక్కరైనా అంబేద్కర్ జీవితాన్నీ, కృషినీ విస్మరించజాలరు. ❃

# ప్రజాస్వామ్య లౌకికవాది న్యాయ సంరక్షకుడు



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

**అశోక్ ధావలే**

ఆధునిక భారతదేశంలో అత్యంత ఉన్నతమైన వ్యక్తిత్వం గలవాడు డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ అనేందుకు ఏమాత్రం సందేహించ వలసిన అవసరం లేదు. ముగ్గురు మహానుభావుల – బుద్ధుడు, కబీర్, పూలే – నుండి ఉత్తేజితుడైన అంబేద్కర్ సామాజిక, ఆర్థిక న్యాయం అందించే వారికి ఆదర్శంగా, హిందూ మతం మూలసూత్రమైన వర్ణాశ్రమ ధర్మాన్ని నికరంగా వ్యతిరేకించే ప్రతీకగా నిలిచాడు. రాజ్యాంగం ముసాయిదాను తయారు చేసే కమిటీ ఛైర్మన్‌గా, రాజ్యాంగంలో ప్రజాస్వామ్య, లౌకిక వికేంద్రీకరణ అంశాలను పొందుపర చడం, సామాజికంగా అణచివేతకు గురైన తరగతులకు అనుకూలమైన విధానాలను రూపొందించడంలోనూ ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన ఎన్నో అంశాలపై రచనలను చేసినా, కులం, అంటరానితనం, సామాజిక, ఆర్థిక, మతపరమైన విషయాలపై ఆయన రచనలు ప్రత్యేకమైనవే కాదు, హృదయాంతరాళలను కదిలించేవి కూడా. లక్షలాది మంది అనుచరులతో తన జీవితం చివరి దశలో బౌద్ధాన్ని స్వీకరించి, హిందూమతానికి పట్టిన చీడ నుండి తనను తాను శాశ్వతంగా విముక్తుడిని చేసుకున్నాడు. 2016 ఏప్రిల్ 14న ఆయన 125వ జయంతి సందర్భంగా ఆయనను గుర్తు చేసుకుంటూ ఘననివాళులర్పిస్తున్నాను.

1920–1930 సంవత్సరాలలో రైతులు, కార్మికుల కోసం, అంటరానితనానికి వ్యతిరేకంగా పెద్దపెద్ద ఉద్యమాలు నిర్మించి తన నాయకత్వాన్ని స్థిరపరచుకున్నారు డా॥ అంబేద్కర్. అందులో అతి ముఖ్యమయినవి 1927, మార్చి 20వ తేదీ రాయగడ్ జిల్లాలోని మహద్‌లో జరిగిన చౌదర్ సరస్సు సత్యాగ్రహం. దళితులకు కూడా ఈ నీరు వాడే హక్కుందనేందుకే ఈ సత్యాగ్రహం చేపట్టబడింది. తరువాత 1927, డిసెంబర్ 25న మహద్ లోనే శూద్రుల పట్ల, మహిళల పట్ల అమానవీయంగా, అన్యాయంగా ఉండే 2000 వేల సంవత్సరాల నాటి మనుస్మృతిని దహనం చేయడం జరిగింది. తరువాత 1930 మార్చి 2న నాసిక్‌లోని కలరామ్ మందిరంలోకి దళితులను అనుమతించాలంటూ సత్యాగ్రహం ప్రారంభించి ఐదేళ్ళ వరకు కొనసాగింది. 1938 తొలి దినాలలో ముంబయిలో భూస్వామ్య వ్యవస్థలోని 'కోతీ' విధానానికి (రైతులను కట్టు బానిసలుగా చేసే విధానం) వ్యతిరేకంగా పెద్ద ప్రదర్శనను నిర్వహించి, కోతీ విధానాన్ని రద్దుచేసే బిల్లును ప్రవేశ పెట్టారు. 1937 సెప్టెంబరు 17న బొంబాయి విధానసభలో 'కోతీ' విధానానికి వ్యతిరేకంగా 'మహర్‌వతన్' బిల్లును ప్రవేశ పెట్టారు. 1938 నవంబరు 7న తన లేబర్‌పార్టీతో పాటు కమ్యూనిస్టులను కలుపుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక, వ్యాపార వివాదాల చట్టా (నల్లచట్టం) నికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికులతో సమ్మె నిర్వహించారు.

అంబేద్కర్ తో పాటు మహద్ పోరాటంలో చురుకుగా పాల్గొన్న ఆర్.బి.మోరే, కోతీ పోరాటంలో పాల్గొన్న షామ్‌రావ్ పరులేకర్‌లు తదనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారన్న విషయాన్ని మనం ఇక్కడ గుర్తించాలి. ఆర్.బి.మోరే సిపిఐ(ఎమ్) రాష్ట్రకమిటి సభ్యుడై 1965 ఏప్రిల్ 14న 'జీవన్ మార్గ్' అనే పార్టీ పత్రికను స్థాపించారు. షామ్‌రావ్ పరులేకర్ సిపిఐ(ఎమ్) కేంద్రకమిటీకి ఎన్నికయ్యారు. 1945 జనవరి 11–12న గోదావరి పరులేకర్‌తో కలిసి మహారాష్ట్ర రాజ్య కిసాన్ సభను స్థాపించారు.

### రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన

రాజ్యాంగ ముసాయిదా రూపకల్పనకు తన ఎంపికను గురించి మాట్లాడుతూ అంబేద్కర్ "నేను కేవలం దళితుల బాగోగులు కాపాడాలన్న కాంక్షతోనే రాజ్యాంగ సభకు వచ్చాను. ఇక్కడ ఇంత బాధ్యతాయుతమయిన పనిని నాకు అప్పగిస్తారని నేనూహించలేదు. ముసాయిదా తయారు చేసే కమిటీలోకి నన్ను తీసుకోవడం నన్నాశ్చర్యానికి గురిచేసింది. ఇక ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా నన్ను ఎన్నుకోవడం అంటే నా ఆశ్చర్యానికి అంతేలేదు" అన్నారు. అతనితో పాటు పని చేసిన వారందరి అంచనా ప్రకారం రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ అద్భుతమయిన ప్రతిభ కనపరిచారు.

నిజానికి భారత రాజ్యాంగం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం యొక్క ఫలితం. ఇది ఈ పోరాటాన్ని నడిపించిన వర్గ సిద్ధాంతాలను కూడా ప్రతిబింబిస్తుంది. రాజ్యాంగ సభలో 82 శాతం సభ్యులు కాంగ్రెస్ వారే కావడం ఆశ్చర్యాన్ని కలిగించదు. ఈ సభలోని నలుగురు ప్రముఖులు, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయి పటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా ఆజాద్ కాంగ్రెస్‌లోని ముఖ్య నాయకులు. నెహ్రూ, ఆజాద్ కేంద్రం నుండి వామపక్షం వైపు మొగ్గు ఉన్నవారైతే పటేల్, ప్రసాద్ మితవాదం వైపు మొగ్గున్న వారు. అంబేద్కర్ ఖచ్చితంగా వామపక్షం వైపు మొగ్గున్న వ్యక్తి.

రాజ్యాంగంలో పొందుపరచబడిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, పౌరుల ఓటు హక్కు, లౌకికతత్వం, ఫెడరలిజం, అధికార వికేంద్రీకరణ మొదలైన ప్రాథమిక హక్కులు శతాబ్దకాల స్వాతంత్ర్య పోరాటం, దేశ విభజన సమయంలో జరిగిన మారణకాండ ఫలితం. అంతేకాదు పశ్చిమ దేశాలలోని ప్రజాస్వామ్య విధానాల ఫలితం కూడా. రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆదేశిక సూత్రాల విభాగం కొత్తగా చేర్చబడినది. ఇది సోషలిస్టు దేశాల, ముఖ్యంగా ఐరిష్ రాజ్యాంగం (కేవలం ఇందులో మాత్రమే ఇటువంటి విభాగం ఉంది) ప్రభావంతో చేర్చబడింది. రాజ్యాంగం రూపొందించిన వారిలో ప్రముఖపాత్ర అంబేద్కర్‌దే. అయితే రాజ్యాంగంలో దళితులకు, గిరిజనులకు చారిత్రకంగా జరిగిన అన్యాయాన్ని తొలగించే భాగాలలో అంబేద్కర్ పాత్ర మరింత స్పష్టంగా కనబడు

> "దళితుల ఉన్నత చదువులకు సంబంధించిన, విధాన సభలలో దళిత ప్రాతినిధ్య హక్కులకు సంబంధించి, స్థానిక సంస్థలలో, పరిపాలనలో, సేవారంగాలకు సంబంధించిన అంశాలు చేర్చ బడ్డాయి."



మహద్ చెరువునీటి సాధన ఉద్యమం

తుంది. అంటరానితనానికి, వివక్షకు వ్యతిరేకంగా చేసిన చట్టాలు, చదువులో, ఉద్యోగాలలో, రాజకీయ వ్యవస్థలో రిజర్వేషన్లు సాధ్యమయ్యాయంటే అందుకు అంబేద్కర్ కృషే కారణం.

**అంబేద్కర్ సమూల ఆర్థిక సంస్కరణలు**

అంబేద్కర్ చేసిన సామాజిక సంస్కరణలు అందరికీ తెలిసినవే. అందరూ మెచ్చుకునేవే. ఆయన వ్రాసిన కుల నిర్మూలన, ఆయన చేసిన ఉద్యమాలు, ఆయన గడిపిన జీవితం అందుకు సజీవ సాక్ష్యాలు. అయితే స్వార్థపరులే కాక ఆయన అనుయాయులు కూడా యుక్తంగా పక్కకు పెట్టేసినవి ఆయన సమూల ఆర్థిక సంస్కరణలు. ఈ ముఖ్యమైన విషయం పట్ల అంతటా తెలియని నిశ్శబ్దం అలముకొని ఉన్నది.

1946, డిసెంబర్ 9వ తేదీ రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిష్ఠాత్మకమైన విశేష తీర్మానాలను ప్రవేశపెట్టిన వెంటనే అంబేద్కర్ ఇలా అన్నారు. "ఇక్కడ న్యాయ, ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలకు సంబంధించిన కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఈ తీర్మానాల వెనుక వాస్తవికత, నిజాయితీ ఉంటే (ఈ తీర్మానాలను ప్రవేశపెట్టిన వ్యక్తి వ్యక్తిత్వం పట్ల నాకు అటువంటి సందేహాలు కలగడం లేదు) రాజ్యం, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని వాస్తవంగా సమకూర్చేందుకు ఇందులో కొన్ని నిబంధనలు పొందుపరిచి ఉండేవారని నేను అనుకుంటున్నాను. ఆ రకంగా చూసినప్పుడు ఈ తీర్మానంలో స్పష్టంగా రాజ్యం సామాజిక, ఆర్థిక న్యాయం చేస్తుందని, పరిశ్రమలను, భూమిని జాతీయం చేస్తుందని, అందుకు సంబంధించిన నిబంధనలకు తీర్మానంలో చోటుంటుందని ఆశించాను. కాని సోషలిస్టు ఆర్థికవ్యవస్థ కాని ఈ వ్యవస్థలో భవిష్యత్తులో ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం చేయడం ప్రభుత్వానికి ఎలా సాధ్యపడుతుందో నాకు అర్థం కావడం లేదు."

1947, మార్చి 15న అంబేద్కర్ ఇంకా ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా ఎన్నిక కాక ముందు, 'రాజ్యం–మైనారిటీలు' అనే అంశంపై దళితుల రక్షణకై ఒక చారిత్రాత్మక మెమోరాండాన్ని రాజ్యాంగసభకు సమర్పించారు. అదొక ప్రభావశీలమైన పత్రం. అందులో దళితులకు న్యాయపరంగా ఎలా రక్షణ కల్పించాలి... వారిని వివక్షత నుండి సామాజిక, పాలనా పరమైన దాష్టీకాలనుండి ఎలా కాపాడాలి... సామాజిక వెలినుండి ఎలా రక్షించాలి వగైరా అంశాలన్నీ విపులంగా వివరించారు. అందులో దళితుల ఉన్నత చదువులకు సంబంధించిన, విధాన సభలలో దళిత ప్రాతినిధ్య హక్కులకు సంబంధించి, స్థానిక సంస్థలలో, పరిపాలనలో, సేవారంగాలకు సంబంధించిన అంశాలు చేర్చబడ్డాయి. అందులో పొందుపరిచిన మరో ముఖ్యమైన అంశం, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాల కోసం, ముఖ్యంగా మైనారిటీ ప్రజల ప్రయోజనాల కోసం నిధులు కేటాయించాలనే అంశం. ఈ అన్ని అంశాలు సుఖదేవ్ థోరట్, నరేంద్రకుమార్ ఎడిట్ చేసిన బి.ఆర్. అంబేద్కర్, పెర్‌స్పెక్టివ్స్ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజన్ పోలసీస్ అనే పుస్తకంలో లభ్యమవుతాయి.

**భూమి, పరిశ్రమలు జాతీయం చేయాలని పిలుపు**

'రాష్ట్రాలు–మైనారిటీలు' లో ఆర్థిక దోపిడీకి గురికాకుండా రక్షించే భాగం అత్యంత కీలకమైనది. అత్యంత కీలకమైన ఈ విభాగం కాస్త మార్చబడడం ఆ సంస్థ స్వభావరీత్యా చూసినప్పుడు ఆశ్చర్యం కలిగించదు. అందులో అంబేద్కర్ ఇలా వ్రాశారు.

"యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా రాజ్యాంగంలోని చట్టం ఈ క్రింది విధంగా ప్రకటిస్తున్నది.

1. కీలకమైన పరిశ్రమలుగాని, కీలకంగా ప్రకటించబడిన పరిశ్రమలుగాని ప్రభుత్వమే నడుపుతుంది. ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి.
2. కీలకం కాని పరిశ్రమలు అయినప్పటికీ మూల పరిశ్రమలయితే ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. ప్రభుత్వమే నడుపుతుంది. లేదా ప్రభుత్వమే కార్పొరేషన్లను ఏర్పరచి వాటి ద్వారా నడిపిస్తుంది.
3. ఇన్సూరెన్స్ ప్రభుత్వ ఆధీనంలో మాత్రమే ఉంటుంది.
4. వ్యవసాయం ప్రభుత్వ ఆధీనంలోని పరిశ్రమ...
5. ప్రయివేటు వ్యక్తుల ఆధీనంలోని పరిశ్రమలను, ఇన్సూరెన్స్‌ను, వారికి కొంత జీవన భృతినిచ్చి వ్యవసాయ భూమిని ప్రభుత్వం వశం చేసుకుంటుంది. వ్యవసాయ పరిశ్రమను ఈ క్రింది విధంగా నిర్మించాలి.
6. ఎ) వశపరచుకున్న భూమిని కొన్ని ప్రామాణిక భాగాలుగా విభజించాలి. వాటిని గ్రామాలలోని కౌలుదారులకు పంటలు పండించేందుకు ఈ క్రింది నిబంధనలకు అనుగుణంగా ఇవ్వాలి. రైతులు పొలాన్ని సహకార పద్ధతిలో దున్నుకోవాలి.

బి) ప్రభుత్వం జారీచేసిన నిబంధనలకు, నిర్దేశాలకు అనుగుణంగా రైతులు భూమిని దున్నాలి.

సి) భూమిపై చెల్లించాల్సిన చెల్లింపులు అన్నీ చెల్లించిన తరువాత మిగిలిన పంట ను రైతులు నిర్ణీత పద్ధతిలో పంచుకోవాలి.

1) భూమిని కౌలుకిచ్చేటప్పుడు కులాన్నిగాని, తెగనుగాని పరిగణనలోకి తీసుకోకూడదు. భూస్వామి, కౌలుదారుడు, భూమిలేని కూలి అని తేడాలుండకూడదు.

2) సహకార వ్యవసాయానికయ్యే నీరు, పని ముట్లు, ఎరువులు, పశువులను ప్రభుత్వమే అందించాలి.

7) ఈ విధానాన్ని వీలయినంత త్వరగా అమలు చేయాలి. ఎట్టి పరిస్థితులలోనూ అమలు పది సంవత్సరాలకు మించకూడదు.

**సోషలిజంకై ప్రతిపాదన...**

ఈ డాక్యుమెంటుకు వివరణను ఇస్తూ తయారుచేసిన అనుబంధంలో అంబేద్కర్ మరింత స్పష్టంగా తన అభిప్రాయాలను తెలిపారు. ''ఈ క్లాజులో ప్రతిపాదించినది ఏమంటే ప్రభుత్వం ఆధీనంలో వ్యవసాయం ఉంటుంది. వ్యవసాయం సహకార పద్ధతిలో జరుగుతుంది. పారిశ్రామిక రంగం మార్చబడిన రాష్ట్ర సోషలిస్టు తరహాలో ఉంటుంది. వ్యవసాయానికిగాని, పరిశ్రమలకుగాని పెట్టుబడిని సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రభుత్వం పెట్టుబడిని సమకూర్చకపోతే వ్యవసాయమయినా, పరిశ్రమలైనా మంచి ఫలితాలను ఇవ్వవు. పారిశ్రామికంగా త్వరితగతిని అభివృద్ధి చెందటానికి 'రాష్ట్ర సోషలిజం' అత్యంత కీలకం. ప్రైవేటు సంస్థలు ఈ పనిని చేయలేవు. చేసినా అది యూరప్‌లోలాగా అసమానతలకు దారితీస్తుంది. ఇది భారతీయులకు హెచ్చరికగా ఉండాలి''

ఈ ప్రణాళిక ప్రతిపాదనకు రెండు పార్శ్వాలు ఉన్నాయి. 1) ఇది ముఖ్యమైన ఆర్థిక అంశాలలో 'రాష్ట్ర సోషలిజాన్ని' ప్రతిపాదిస్తున్నది. 2) ఈ ప్రణాళిక ప్రత్యేకత ఇది. 'రాష్ట్ర సోషలిజాన్ని చట్టసభల దయాదాక్షిణ్యానికి వదిలేయలేదు. ఇది రాష్ట్ర సోషలిజానికి రాజ్యాంగంలో చట్టబద్ధత కల్పించింది. అందువలన ఇది చట్టాల ద్వారానో, పరిపాలనలో భాగంగానో మార్చే వీలులేదు.

పైన చెప్పుకున్నట్టు అంబేద్కర్ ప్రతిపాదించిన ఈ ఆర్థిక సంస్కరణలేవీ రాజ్యాంగసభ ఆమోదం పొందలేదు. 1950లో ఇలస్ట్రేటెడ్ వీక్లీ ప్రముఖ రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్‌కిచ్చిన ముఖాముఖిలో అంబేద్కర్ రాజ్యాంగం తాను కలకన్నట్టు తయారు కాలేదని చెప్పుకున్నారు.

> ❝ అంబేద్కర్‌కి వర్ణ వ్యవస్థ అన్నా, దాని ఆధారంగా ఏర్పడ్డ హిందూ మతమన్నా వ్యతిరేకత ఉండేది. హిందూ మతం అంటేనే అసహ్యించుకునే వారు. ఆయన గొప్ప ప్రజాస్వామ్యవాది. అందువలన అంబేద్కర్ అన్ని రకాల మతతత్వాలనూ వ్యతిరేకించేవారు. ముఖ్యంగా హిందూ మతతత్వాన్ని ఏవగించుకొనేవారు.❞

ముఖ్యంగా రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులలో ఆస్థిహక్కుకు బదులు పని హక్కు ఉండాలని అంబేద్కర్ కోరుకున్నారు. ప్రాథమిక హక్కులలో విద్యాహక్కు, ఆరోగ్యహక్కు ఉండాలనుకున్నారు. రోజులు గడుస్తున్నకొద్దీ రాజ్యాంగంతో విసిగిపోయిన అంబేద్కర్ ఈ రాజ్యాంగాన్ని తగులబెట్టే వారిలో తాను మొదట ఉంటానన్నారు.

బి.టి. రణదివే 'కులం, వర్గం, ఆస్తి సంబంధాలు' పుస్తకంలో కాంగ్రెస్ నాయకుల కపటత్వంపై అంబేద్కర్ విరుచుకుపడినట్టుగా మరెవరూ విరుచుకుపడలేదని రాశారు. కాని కాంగ్రెస్ ఆయననే రాజ్యాంగం రూపకర్తగా కొనియాడింది. ఆ రాజ్యాంగమే ప్రజాస్వామ్యం చివరి మాటగానూ చెప్పుకుంది. ఆ రాజ్యాంగం నీడనే అస్పృశ్యుల గృహ దహనాలూ జరుగుతున్నాయి. వారి ఇళ్ళు కొల్లగొట్టబడుతున్నాయి. వారి భార్యలు మానభంగాలకు గురవుతున్నారు. హత్య చేయబడుతున్నారు. అటువంటప్పుడు అంబేద్కర్ మోసపోయాననుకోవడంలో ఆశ్చర్యమే లేదు'' అని వ్రాశారు.

**అంబేద్కర్-హిందూత్వ...**

అంబేద్కర్‌కి వర్ణ వ్యవస్థ అన్నా, దాని ఆధారంగా ఏర్పడ్డ హిందూ మతమన్నా వ్యతిరేకత ఉండేది. హిందూమతం అంటేనే అసహ్యించుకునే వారు. ఆయన గొప్ప ప్రజాస్వామ్యవాది. అందువలన అంబేద్కర్ అన్ని రకాల మతతత్వాలనూ వ్యతిరేకించేవారు. ముఖ్యంగా హిందూ మతతత్వాన్ని ఏవగించుకొనేవారు. ఆయన రచనలన్నింటా మతతత్వానికి వ్యతిరేకత, లౌకిక తత్వానికి అనుకూలతా వ్యాపించి ఉంటుంది. ఆయన జీవితకాలమంతా ఆర్ఎస్ఎస్‌కి, హిందూ మహాసభకి వ్యతిరేకంగానే నిలిచారు. స్థలాభావం వలన ఒక్క ఉటంకింపు ఇక్కడ ఇస్తాను.

అంబేద్కర్ ఇలా వ్రాశారు ''హిందూత్వ రాజకీయ సిద్ధాంతం నాజీ సిద్ధాంతంలాగే ఫాసిస్టు సిద్ధాంతం, అప్రజాస్వామికం. హిందూత్వాన్ని కనక వదిలిపెడితే అది హిందూయేతరుల, హిందూత్వాన్ని వ్యతిరేకించే వారి ఎదుగుదలకు హాని కలిగిస్తుంది. ఇది ఒక్క ముస్లింల విషయంలోనే కాదు... అణగారిన తరగతులు, బ్రాహ్మణులు కాని వారందరికి ఇదే వర్తిస్తుంది. (డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్, అస్పృశ్యత ఉద్యమం. భాగం-1, పేజీ 241 నుండి). భారతదేశ ప్రథమ న్యాయశాఖమంత్రిగా అంబేద్కర్ హిందూమత మూఢత్వానికి వ్యతిరేకంగా హిందూ కోడ్ బిల్లు విషయంలో పోరాడారు. ఈ పోరాటం మహిళల హక్కుల కోసం కూడా. ఆ బిల్లు ఆమోదం పొందక పోవడంతో 1951లో కేంద్ర కేబినేట్‌కు రాజీనామా చేశారు.

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> "అందువలన ఈ వైరుధ్యాలను వీలయినంత త్వరగా పరిష్కరించుకోవాలి. అలా కానిపక్షంలో అసమానతల బాధార్తులు ఈ వ్యవస్థనే బద్ధలు చేసి ఈసభ ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఈ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తారు అన్నారు."



న్యాయ శాఖామంత్రిగా ప్రమాణం చేస్తున్న అంబేద్కర్

**అంబేద్కర్-సామాజిక ప్రజాస్వామ్యం...**

రాజ్యాంగ నిర్మాత కాబట్టి అంబేద్కర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వాది అని అనుకోవడం కద్దు. కాని ఆయన ప్రజాస్వామ్యానికి ఇచ్చే విశ్లేషణ లోతుగా ఉంటుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నియంతృత్వం కన్నా మెరుగయినప్పటికీ అది ధనవంతులు, బలవంతుల చేతిలో కీలుబొమ్మగా ఉంటుందని ఆయన ఎరుగును. ఆయన శ్రామికుల ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామాన్ని రూపొందించారు. మరాఠీలో డా॥ ఆదినాథ్ వ్రాసిన బాబాసాహెబ్ ప్రజాస్వామ్య విప్లవతత్వం అనే పుస్తకం వచ్చే వారం జనశక్తి ప్రకాశన్ ద్వారా విడుదల కానుంది. అందులో ఈ రెండు అంశాలు విపులంగా విశ్లేషించబడ్డాయి.

1949, నవంబర్ 25న రాజ్యాంగ సభను ఉద్దేశించి చేసిన ప్రసంగం ఆయన ఆలోచనలను స్పష్టంగా తెలియజేస్తుంది. "మనం మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా మలచుకోవాలి. సామాజిక ప్రజాస్వామ్య పునాది లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనలేదు. సామాజిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? అంటే స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం జీవన సూత్రాలుగా ఉండాలి. ఇవి మూడు వేటికవే ఉండవు. అంటే ఇందులో ఏ ఒక్కదాన్ని మిగిలిన వాటినుండి వేరు చేసినా ప్రజాస్వామ్యం అంటే అర్థం లేకుండా పోతుంది.

ఆ తరువాత కాలంలో అంబేద్కర్ ఇలా చెప్పారు. "భారతదేశంలో సామాజికంగా మనం అసమానతలనే సూత్రంపైనే ఆధారపడి ఉన్నాం. కొందరు ఉచ్ఛస్థాయిలోనూ మరికొందరు నీచస్థాయిలోనూ ఉన్నారు. ఇక ఆర్థికంగా మన సమాజంలో కొందరికి ఎన్ని తరాలకూ తరగని ఐశ్వర్యం ఉంటే మరికొందరు నిష్ట దరిద్రులుగా ఉన్నారు. 1950, జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవితంలో అడుగిడబోతున్నాం. రాజకీయంగా మనకు సమానత్వం సమకూరబోతున్నది. కాని సామాజికంగా, ఆర్థికంగా అసమానతలు ఉండబోతున్నాయి. మన సామాజిక ఆర్థికవ్యవస్థ ఒక మనిషికి ఒక విలువను ఇంకా నిరాకరిస్తూనే ఉంటుంది. ఈ వైరుధ్యభరిత జీవితాలను మనం ఇంకెన్నాళ్ళు కొనసాగించాలి? ఇంకెన్నాళ్ళు సాంఘిక, ఆర్థిక సమానత్వాన్ని మనం నిరాకరించాలి? ఇది ఇలా కొనసాగినట్టయితే మన ప్రజాస్వామ్య రాజకీయాలకు సహితం ముప్పు ఏర్పడే ప్రమాదముంది. అందువలన ఈ వైరుధ్యాలను వీలయినంత త్వరగా పరిష్కరించుకోవాలి. అలా కానిపక్షంలో అసమానతల బాధార్తులు ఈ వ్యవస్థనే బద్ధలు చేసి ఈసభ ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఈ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తారు" అన్నారు.

**అంబేద్కర్ మార్క్సిజం...**

చివరిగా అంబేద్కర్‌కి మార్క్సిజానికి ఉన్న సంబంధాన్ని పరిశీలిద్దాం. అంబేద్కర్ మార్క్స్‌ను లోతుగా అధ్యయనం చేశారు. 'బుద్ధా, కార్ల్ మార్క్స్' అనే ఆయన వ్యాసంలో ఆయన ఈ ఇద్దరినీ బాగా అధ్యయనం చేసిన మీదట నాకు వారి సిద్ధాంతాలను తులనాత్మకంగా పరిశీలించాలనిపిస్తున్నది" అన్నారు. అంబేద్కర్, "కులంలో వర్గం ఇమిడి ఉన్నది" అన్నారు. 1938 ఫిబ్రవరిలో మన్‌మాడ్ రైల్వే కార్మికులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసిద్ధమైన ప్రసంగంలో "బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారీ విధానం కార్మికులకు రెండు నిజమైన శత్రువులు" అన్నారు. ఇదే ఆయన వర్గ వైఖరిని స్పష్టంగా తెలియజేస్తున్నది. మహారాష్ట్రలో మేధావి, ప్రముఖ రచయిత అయిన డా॥ రావ్‌సాహెబ్ కస్బే మూడు దశాబ్దాల క్రితమే 'అంబేద్కర్, మార్క్స్' అనే పుస్తకాన్ని రచించారు.

కమ్యూనిస్టులు ఆ కాలంలో కుల అణచివేతకు తగిన ప్రాముఖ్యతనివ్వలేదన్నది అంబేద్కర్ కమ్యూనిస్టులపై చేసిన విమర్శలలో ముఖ్యమైనది. ఈ ఆరోపణలో వాస్తవాన్ని ఒప్పుకొని తీరవలసిందే. స్వాతంత్ర్య ఉద్యమ పూర్వకాలంలో ఇద్దరూ కలిసి కార్మికవర్గ పోరాటాలను కుల అణచివేత ఉద్యమాలతో కలిపేందుకు మరింత కృషి చేసి ఉండవలసింది. అయితే తదనంతర కాలంలో కమ్యూనిస్టులు తమ తప్పును సవరించుకొని ఆర్థిక సమస్యలైన వర్గదోపిడీతో పాటుగా సామాజిక సమస్య అయిన కుల అణచివేతపై కూడా నిరంతరం పోరాడుతున్నారు. భారతదేశానికి సంబంధించినంత వరకు దోపిడీ యొక్క ఈ రెండు పార్శ్వాలను విడదీసి చూడలేం. ఈ రెండు రకాల పోరాటాలను మరింతగా విస్తరించవలసి ఉంది. వాటి ఉధృతి మరింత పెంచవలసిన అవసరం ఉంది.

'బి.ఆర్. అంబేద్కర్ అవసరమైన రచనలు' (ది ఎసెన్షియల్ రైటింగ్స్ ఆఫ్ బి.ఆర్. అంబేద్కర్)ను ఎడిట్ చేసిన వెలిరియన్ రోడ్రిగో తన ముందుమాటలో ఇలా రాశారు. "అంబే

ద్కర్ మార్క్సిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ముఖ్యంగా 1950ల తరువాత కాలంలో ఆయన ముఖ్యమైన రచనలు – బుద్ధుడు, భవిష్యత్‌లో ఆయన మతం, బుద్ధుడు ఆయన ధమ్మా, బుద్ధుడు కార్ల్ మార్క్స్' అన్నింటిలోనూ కేంద్ర బిందువు మార్క్స్. అవేకాక 1950లలో అంబేద్కర్ 'భారతదేశం – కమ్యూనిజం' అనే పుస్తకాన్ని మొదలుపెట్టారు. అయితే అది అంతగా ముందుకు సాగలేదు. మార్క్స్‌తో తాను ఏకీభవించిన అనేక అంశాలను ఆయన గుర్తించారు. అవి ఆ తత్వం సారాంశం – ప్రపంచాన్ని మార్చడం, ఒక వర్గానికి మరో వర్గానికి మధ్య వైరుధ్యం ఉంది; వ్యక్తిగత ఆస్తి బాధలకు, దోపిడీకి దారితీస్తుంది. మంచి సమాజంలో ఆస్తి సమాజంలోని అందరికి ఉమ్మడిగా చెందాలి. అయితే సోషలిజం తప్పనిసరిగా వచ్చి తీరుతుందనిగాని, చరిత్రను అర్థశాస్త్రరీత్యా నిర్వచించడంగాని, కార్మికవర్గ పేదరికంపై సిద్ధాంతాన్ని గాని, రాజ్యం క్షయించడం అన్న దాన్ని గాని, అధికారం హస్తగతం చేసుకునేందుకు హింసాత్మక వ్యూహాలు అవసరమన్నదాన్నిగాని అంబేద్కర్ అంగీకరించలేదు. స్వీయ నియంత్రణ, సమాజానికి నీతివంతమైన పునాదిని బోధించే బౌద్ధమతం సమాజానికి అవసరమైన అన్ని ప్రమాణాలను అందిస్తుందని నమ్మి, బౌద్ధానికి మార్క్సిజానికి మధ్య చర్చ నడపాలనుకున్నారు. అందువలన మిగిలిన అన్ని ప్రదేశాలలో బౌద్ధం ఉదారవాదం, ఆధునికతతో కలిస్తే మనదేశంలో అంబేద్కర్ బౌద్ధాన్ని మార్క్సిజంవైపుకు, మార్క్సిజాన్ని బౌద్ధం వైపుకు లాగాలనుకున్నారు.

గోవింద్ పన్‌సారే తన 'మతం, కులం, వర్గం, మార్పులకు నిర్దేశాలు' అనే మరాఠీ పుస్తకంలో ఒక ముఖ్యమైన, ఇదివరకెన్నడూ బహిర్గతం కాని విషయాన్ని ఉటంకించాడు. 'ఒక ముఖ్యమైన సందర్భాన్ని గుర్తించాలి. ఇది 1952కి సంబంధించినది. అంటే అంబేద్కర్ చనిపోవడానికి నాలుగు సంవత్సరాల ముందు జరిగింది. కామవీర్ దాదాసాహెబ్ గయక్‌వాడ్ (అంబేద్కర్‌కు అత్యంత సన్నిహితుడు) జీవిత చరిత్ర వాస్తు హరిభుపగారే వ్రాసిన దానిలో 1952 సార్వత్రిక ఎన్నికల తదనంతరం అంబేద్కర్ కొంత నిరాశకు గురయి గయిక్వాడ్‌కు ఉత్తరం వ్రాస్తూ "నేను ఫెడరేషన్ (దళితుల)ను వదిలి పెట్టాలనుకుంటున్నాను. అంతేకాదు... నేను పూర్తిగా రాజకీయాలనుండే వైదొలగాలని అనుకుంటున్నాను. అదంత సులభం కాదని నాకు తెలుసు. అయినప్పటికీ నా రాజకీయతత్వం ఇప్పటికిప్పుడు మన ప్రజల సంక్షేమానికి ఉపయోగపడుతుందని నేను భావించడం లేదు. నాకు తప్ప ఇంకెవరికీ మన ప్రజల దురవస్థ తెలియడం లేదు. వారికి అందవలసిన ప్రయోజనాలు అందుకునేందుకు వారింకెన్నాళ్ళు వేచి చూడాలి? నేను కమ్యూనిస్టుపార్టీలో చేరితే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చాను" అని వ్రాసినట్టు చెప్పుకున్నారు. పన్‌సారే ఇంకా ఇలా వ్రాశారు "దీని నుండి కనీసంగా గ్రహించవలసింది ఏమంటే అంబేద్కర్ తన రాజకీయ తత్వశాస్త్రం తరువాత కమ్యూనిజాన్నే నమ్మారు. కమ్యూనిజానికి ఆయన వ్యతిరేకి కాదు.

> **"తరువాత కాలంలో అంబేద్కర్ హిందూ సమాజంలోని అన్యాయాలను తప్పించుకునేందుకు బౌద్ధమతం స్వీకరించమని తన అనుయాయులకు పిలుపునిచ్చారు. అయితే మతం మారినంత మాత్రాన భూ సంబంధాలలో మార్పు లేకుండా సామాజిక సంబంధాలలో మార్పు రాదన్నది బాధాకరమైన వాస్తవం."**

ఈ వ్యాసాన్ని ముగించేముందు బి.టి. రణదివే 1982లో వ్రాసి, 'కులం, వర్గం, ఆస్తి సంబంధాలు'లో వ్రాసిన కొన్ని అభిప్రాయాలను చెప్పుకుందాం... దళితులపై ఈనాడుగాని ఇంతకుముందు కాలంలోగాని జరుగుతున్న పైశాచిక దాడులు, పాతకాలంనాటి దౌర్జన్యాలు, అన్యాయాలు స్వాతంత్ర్యం వచ్చిన మూడు దశాబ్దాల తరువాత కూడా కొనసాగుతున్నాయని తెలియజేస్తున్నాయి. అంబేద్కర్ అస్పృశ్యతపై అలుపెరుగక చివరివరకు పోరాడాడు, అగ్రకులాల కపటత్వాన్ని ఎండగట్టారు. కాంగ్రెస్‌ను తూర్పారపట్టారు. తదనంతర కాలంలో దళితులకు ప్రత్యేకంగా భూమి ఇవ్వాలనీ, కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇది నిజానికి వ్యవసాయ విప్లవం సాకారం కానిదే సాధ్యమయ్యేది కాదు. అయితే దళితులు తమ బానిసత్వం నుండి విముక్తి పొందేందుకు భూమి పంచబడాలన్న ఆలోచన సరైనది. కాని అదే సమయంలో భూమి లేని వారందరూ కలిసి పోరాడితేనే భూమిలేని వారికి భూమి వస్తుంది"

"తరువాత కాలంలో అంబేద్కర్ హిందూ సమాజంలోని అన్యాయాలను తప్పించుకునేందుకు బౌద్ధమతం స్వీకరించమని తన అనుయాయులకు పిలుపునిచ్చారు. అయితే మతం మారినంత మాత్రాన భూ సంబంధాలలో మార్పు లేకుండా సామాజిక సంబంధాలలో మార్పు రాదన్నది బాధాకరమైన వాస్తవం. సమానత్వం కోసం, ప్రేమకోసం ఎదురుచూపులు ఫలించలేదన్నది ఈ మధ్య జరిగిన దాడులతో తేటతెల్లమైంది.

"దురదృష్టకరమైన పరిస్థితి ఏమంటే అణగారిన తరగతులలోని మేధావులు కూడా సైద్ధాంతికంగా, సమానత్వ ప్రకటనలు, మరిన్ని ఉద్యోగాలు, సీట్లలో రిజర్వేషన్లు, విద్యలో కొన్ని సౌకర్యాలను దాటి చూడడం లేదు. ఈనాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలన్నది వారి చైతన్యంలో భాగం కాదు. మిగిలిన భూమిలేని వారందరితో కలిసి భూమికోసం పోరాడాలని వారు ఆలోచించడం లేదు. ఈ మేధావులంతా ముందు వెనుకగా బూర్జువా ప్రజాస్వామ్య పరిధిలోనే ప్రజాస్వామ్యాన్ని అంగీకరించి భూమి, పరిశ్రమలపై ప్రస్తుతం ఉన్న ఆస్తి సంబంధాలను ముట్టుకోకుండా సాధారణ ప్రజాస్వామ్య హక్కుల ప్రకటనలతో సంతృప్తి పడుతున్నారు.

ఈ రోజు సామ్రాజ్యవాదం అన్ని రంగాలపై తన ప్రభావం చూపుతున్నది. నూతన ఆర్థిక విధానాల అమలుతో పాలకవర్గం ఆర్థిక దోపిడీని, సామాజిక అణచివేతను పెంచుతున్నది. ఆర్.ఎస్.ఎస్., బి.జె.పి. నేతృత్వంలో బ్రాహ్మణ, హిందూత్వ శక్తులు అదుపుతప్పి ప్రవర్తిస్తూ మతతత్వ – ఫాసిస్టు పాలనను కొనసాగిస్తున్నాయి. ఇప్పుడు మార్క్సిస్టులు, అంబేద్కరిస్టులు, నిజమైన గాంధేయవాదులు అందరూ కలిసి సామాజిక, ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ పోరాటాలలో పాలుపంచుకోవలసిన అవసరాన్ని గుర్తించి సమూలమైన మార్పుకోసం పోరాడవలసిన అవసరం ఉంది.

ఇది సాధించడమే జీవి తాంతం అణగారిన ప్రజల కోసం పోరాడిన, దేశభక్తుడయిన అంబేద్కర్‌కి ఆయన 125వ జయంతి సందర్భంగా మనం అర్పించే నిజమైన నివాళి.

**(అనువాదం : కె. ఉషారాణి)**

**ఈ మాసం ప్రత్యేకం**

# అస్తిత్వవాదం కమ్యూనిస్టుల వైఖరి

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ (ఎం) కేంద్రకమిటీ సభ్యులు

అంబేద్కర్ పట్ల మార్క్సిస్టుల వైఖరి మారిందా?

అంబేద్కర్, పూలే గురించి ఇప్పటివరకు రాసింది ఇప్పుడు చెపుతున్నదానికి వ్యతిరేకంగా ఉన్నదా?

చర్చ అంబేద్కర్ గురించా? లేక కులం సమస్య గురించా?

అస్తిత్వవాదాన్ని గతంలో విమర్శించిన కమ్యూనిస్టులు ఇప్పుడు దానినే సమర్థిస్తున్నారా?

ఇలాంటి అంశాలు కొన్ని సందర్భాలలో చర్చకు వస్తున్నాయి. కమ్యూనిస్టు విమర్శకులే కాకుండా అనుకూలురు కూడా కొందరు గందరగోళానికి గురవుతున్నారు. స్పష్టత అవసరం.

అంబేద్కర్ 'కులం' సమస్యకి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. 1935లో ముంబై కాంగార్ సంఘ్ పేరుతో కార్మికసంఘం స్థాపించి అనేక పోరాటాలు చేశారు. 1938లో కమ్యూనిస్టులతో కలిసి పెద్ద సమ్మెకు నాయకత్వం వహించారు. అయినప్పటికీ, అనేక విషయాల మీద ఆయన అభిప్రాయాలు చెప్పినప్పటికీ, కొన్ని సందర్భాలలో కార్మికవర్గ పోరాటాలకు సంఘీభావం తెలిపినప్పటికీ ఆయన జీవితమంతా ప్రధానంగా కుల నిర్మూలన కృషికే ధారపోశారు. కమ్యూనిస్టులు సమాజంలో మౌలిక మార్పును కోరుకున్నారు. దోపిడీ వ్యవస్థను అంతం చేయాలని, అన్ని రకాల వివక్షలకు చరమగీతం పాడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో మార్పు సాధించడం ద్వారా, దోపిడీని అంతం చేయడం ద్వారా సామాజిక రంగంలో కూడా వివక్షను అంతం చేయడానికి మార్గం సుగమం అవుతుందని బలంగా విశ్వసించారు. భారతదేశంలో కుల వ్యవస్థ ప్రత్యేకత గురించి కారల్ మార్క్స్ కూడా గుర్తించిన విషయం తెలిసిందే. జమీందారీ, జాగీర్దారీ దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగ ఉద్యమాలకు, సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించింది కమ్యూనిస్టు పార్టీ. చారిత్రాత్మక వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఇందులో భాగమే. దేశంలో అనేక ప్రాంతాల్లో ఆదివాసీ పోరాటాలకు కూడా కమ్యూనిస్టు పార్టీ సారథ్యం వహించింది. అందుకే అణగారిన తరగతుల్లోనే కమ్యూనిస్టు ఉద్యమ పునాదులు ఏర్పడ్డాయి. కులానికి, వర్గానికి పెద్దగా తేడాలేని పరిస్థితుల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు మిళితమై పోరాటాలు సాగాయి. అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టు ఉద్యమం బలపడింది. పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరిస్తున్న మేరకు కులం నుండి వర్గం క్రమంగా వేరుపడుతున్నది. ఈ పరిణామాలను గమనించి, తదనుగుణంగా సామాజిక సమస్యలమీద ప్రత్యేక శ్రద్ధ పెట్టడంలో లోపం జరిగింది. భారతదేశంలో కమ్యూనిస్టు అగ్రనేతలు పుచ్చలపల్లి సుందరయ్య, ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, బి.టి.రణదివే, హరికిషన్‌సింగ్ సూర్జిత్ వంటివారు వివిధ రాష్ట్రాలలో అస్పృశ్యతకు, వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. కులవివక్ష, దళితులపై దాడులు, అత్యాచారాలు జరిగిన సందర్భాలలో కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగానే స్పందించి పనిచేసినప్పటికీ కులం సమస్య మీద ప్రత్యేక దృష్టి పెట్టలేదు. అటు అంబేద్కర్ గాని ఇటు కమ్యూనిస్టులు గాని తాము నమ్మిన దిశలో నిజాయితీగా కృషి చేశారు. వర్గ దోపిడీ అంతమయితే కులం సమస్యకు కూడా పరిష్కారం దొరుకుతుందనే దృష్టితోనే కమ్యూనిస్టులు చూశారు. కానీ ఆర్థిక వ్యవస్థ మారడానికి కూడా కులం సమస్య మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్న అంశం మీద ఇప్పుడు కమ్యూనిస్టులు దృష్టి సారించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ తమ ప్రయోజనాల కోసమే కుల వ్యవస్థను కాపాడుతున్నది. సామాజిక సమస్యలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వినియోగించుకోవడమే తప్ప కుల వ్యవస్థను నిర్మూలించడం పాలక వర్గాలకు ఇష్టం లేదు. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ అంతం కాకుండా కుల నిర్మూలన సాధ్యం కాదన్న కమ్యూనిస్టుల అంచనా సరైందే. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థను అంతం చేయడానికి ఆర్థిక సమస్యలతో పాటు సామాజిక రంగంలో కూడా వర్గ పోరాటం చేయాలన్నదే కమ్యూనిస్టు దృక్పథం. ఈ మధ్య కాలంలో ఈ మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) స్పష్టతనిచ్చింది. పార్టీ కార్యక్రమాన్ని తాజాపరిచిన సందర్భంలోను, విశాఖలో జరిగిన పార్టీ అఖిలభారత మహాసభలోను, కోల్‌కతాలో జరిగిన ప్లీనంలోను ఈ మేరకు దిశా నిర్దేశం చేసింది. కుల నిర్మూలన గురించి ప్రజలను చైతన్యపరచాలి. కుల వివక్ష మీద పోరాడాలి. ఇందుకు ప్రజానీకాన్ని పెద్దఎత్తున కూడగట్టాలి. ఇందుకనుగుణంగానే గత 18 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో గాని ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలో గానీ పార్టీ దృష్టి సారించింది. నిజానికి తొలి నుంచీ కమ్యూనిస్టుల పోరాట క్షేత్రం ప్రధానంగా దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులే. అందుకే ఇప్పటికీ కమ్యూనిస్టు ఉద్యమ పునాదులు ఆ తరగతుల్లోనే ఉన్నాయి. ఉద్యమ కేంద్రాలు కూడా అవే.

స్వాతంత్ర్యానంతరం బడా బూర్జువా నాయకత్వంలోని పాలకవర్గాలు దేశాన్ని పాలిస్తున్నాయి. అందువల్ల పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరిస్తున్నాయి. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో గత రెండున్నర దశాబ్దాల కాలంగా పెట్టుబడిదారీ సంబంధాల విస్తరణ ఊపందుకున్నది. గ్రామీణ వృత్తులు, వ్యవసాయ రంగంలోకి పెట్టుబడిదారీ సంబంధాలు చొచ్చుకు వస్తున్నాయి. మరోవైపు విద్య, ఉద్యోగాలలో అణగారిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్ సౌకర్యం కొంతమేరకు వీరి అభివృద్ధికి తోడ్పడింది. ఈ పరిణామం ఆయా సామాజిక తరగతులలో కూడా తరతమ స్థాయిల్లో మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి ఆవిర్భావానికి దారి తీసింది. ఈ మధ్యతరగతిలో కొత్త ఆశలు చిగురించాయి. అభివృద్ధి ఫలాలు తాము కూడా అందుకోవాలని ఆశించారు. అందుకోసం రకరకాల రూపాల్లో ప్రయత్నిస్తున్నారు. ఇది

గమనించిన పాలకవర్గాలు, ఈ మధ్య తరగతిని చేరదీసేందుకు ప్రయత్నిస్తున్నాయి. సహజంగానే, ఈ ప్రభావం కూడా మధ్యతరగతి మీద ఉన్నది. పాలకవర్గాల సహకారంతో పైకి ఎదగాలన్న ధోరణులు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పాలకవర్గాల అవకాశవాద ఎత్తుగడ లను చిత్తు చేయాలన్న సరైన వైఖరి కూడా చర్చనీయాంశమవుతున్నది. పాలకవర్గాలతో రాజీపడి రాయితీలు, పదవులు పొందాలన్న ధోరణులు కొందరిలోనూ, పాలకవర్గాల దోపిడీని, వివక్షను ప్రతిఘటించాలన్న వైఖరి మరికొందరిలోనూ వ్యక్తమవుతున్నది. పాలకవర్గాల సహకారంతో ఎదగాలనుకునే వైఖరి వల్ల కులం అంతం కావాలన్న దానికన్నా తమ కులానికి తగిన గుర్తింపు సంపాదించాలన్నదానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. నిజానికి తమ కులానికి గుర్తింపు సంపాదించాలన్న వైఖరి తాత్కాలికంగా కొంత మంది వ్యక్తులకు మేలు చేసినప్పటికీ, అంతిమంగా అణగారిన తరగతులకు ఉపయోగపడదు. కులం ఉన్న తర్వాత వివక్ష అనివార్యం. వివక్ష మీద పోరాడకుండా కులం అంతం కాదు. అంతిమంగా ఏ కులం గొప్పదన్నది కాదు సమస్య. కుల వ్యవస్థ అంతం కావడమే అంతిమ పరిష్కారం. కులం ఉన్నంత కాలం ఆధిపత్య కులాలు, అణగారిన కులాలన్న తేడాను పాలక వర్గాలు కాపాడుతూనే ఉంటాయి. అణగారిన తరగతులకు ఆశలు చూపుతూ పబ్బం గడుపుకుంటూనే ఉంటాయి. పేదలకు సంక్షేమ పథకాలు ఆశ చూపి ఓటు బ్యాంకుగా కాపాడుకుంటూ ఉంటాయి. ఆయా సామాజిక తరగతుల్లోని ఉన్నత మధ్యతరగతిలో కొందరికి కాంట్రాక్టులు, పదవులు ఆశ చూపి ఆ సామాజిక తరగతిని గుప్పిట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

> **“ సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా వేగంగా విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంబంధాలు సామాజిక రంగాన్ని కూడా ప్రభావితం చేసాయి. దీన్ని గమనించి కులం, ఇతర సామాజిక సమస్యల మీద తగిన శ్రద్ధ పెట్టడంలో కమ్యూనిస్టు ఉద్యమం వెనకబడ్డది. ”**



అణగారిన ప్రజల సామాజిక వర్గ పోరాటాలు

దళితులు, గిరిజనులు కొందరు కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులైతే, వారిపట్ల కమ్యూనిస్టుల వైఖరి ఎట్లా ఉండాలన్నది కూడా చర్చనీయాంశంగా ఉన్నది. ఈ విషయంలో కమ్యూనిస్టు పార్టీకి స్పష్టత ఉంది. గందరగోళానికి తావు లేదు. పార్టీ కార్యక్రమంలోనే తగిన దిశానిర్దేశం చేసింది. పెట్టుబడిదారీ సంబంధాలు విస్తరించటమంటే ఆ మేరకు ఫ్యూడల్ సంబంధాలు బలహీనపడటమే. అందుకే అణగారిన తరగతుల నుండి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలన్న డిమాండు, కాంట్రాక్టులు చేసుకునే అవకాశం ఇవ్వాలన్న కోరిక ప్రజాస్వామిక నినాదమే. అంతేకాదు, విప్లవ సాధన కోసం ప్రజా ఉద్యమం ఉచ్ఛస్థాయికి చేరిన దశలో చిన్న చిన్న పెట్టుబడిదారులను, కాంట్రాక్టర్లను కార్మికవర్గం కలుపుకుపోతుంది. అదే సమయంలో మరొక స్పష్టత కూడా ఉండాలి. పెట్టుబడిదారులైన తర్వాత వారు అగ్రవర్ణానికి చెందినవారా, వెనకబడిన తరగతులా లేక దళితులా అన్నదాంతో నిమిత్తం లేకుండానే, కార్మికవర్గ శ్రమ దోపిడీ వారి సహజ లక్షణమవుతుంది. వారికింద పనిచేసే కార్మికులు దళితులు, వెనుకబడిన తరగుతులకు చెందిన వారైనప్పటికీ పెట్టుబడిదారులుగా వారి శ్రమను కూడా దోచుకోవటం సహజం. అనుభవంలో కూడా చూస్తున్నాము. ఇక్కడ యాజమాన్యానికి కార్మికులకు మధ్య ఘర్షణ వచ్చినప్పుడు కమ్యూనిస్టులు కార్మికులవైపే నిలబడతారు. అదే సరైంది.

అంబేద్కర్ కృషిని గానీ, కమ్యూనిస్టు ఉద్యమం కృషిని గానీ స్థూలంగా పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా అర్ధమవుతుంది. అంబేద్కర్ ప్రధానంగా కుల నిర్మూలన మీదనే దృష్టి పెట్టారు. వర్గ పోరాటానికి ప్రాధాన్యత నివ్వలేదు. స్వాతంత్ర్యానంతర కాలంలో దళిత సంఘాలు కూడా ఇదే వైఖరి ప్రదర్శించాయి. అయినప్పటికీ కుల వ్యవస్థ అంతం కాలేదు. కుల వివక్ష కూడా రూపాలు మారుతున్నాయే కానీ అంతం కాలేదు. కమ్యూనిస్టులు ఆర్థికరంగంలో వర్గపోరాటానికే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. దీంతోపాటు కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలికల వల్ల అంతర్గత సమస్యల మీదనే దృష్టి కేంద్రీకరించారు. తర్వాత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పునరుద్ధరణపైన దృష్టి సారించవలసి వచ్చింది. సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా వేగంగా విస్తరిస్తున్న పెట్టుబడిదారీ సంబంధాలు సామాజిక రంగాన్ని కూడా ప్రభావితం చేసాయి. దీన్ని గమనించి కులం, ఇతర సామాజిక సమస్యల మీద తగిన శ్రద్ధ పెట్టడంలో కమ్యూనిస్టు ఉద్యమం వెనకబడ్డది. గత రెండున్నర దశాబ్దాలుగా దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం కొంత బలహీనపడింది. ఇందుకు అనేక కారణాల్లో సామాజిక రంగంలో తగిన శ్రద్ధ పెట్టకపోవడం కూడా ఒకటి. ఫలితంగా దోపిడీ వ్యవస్థ అంతమూ కాలేదు, కుల వివక్షా పోలేదు. అందుకే కమ్యూనిస్టు ఉద్యమం వైఖరి ఇప్పుడు మారింది. భారతదేశ ప్రత్యేక పరిస్థితుల్లో కులం, సామాజిక సమస్యలపైన స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతున్నది. ఆర్థిక, సామాజిక రంగాల్లో వర్గ పోరాటం అవసరమని ధృఢంగా

“ కమ్యూనిస్టులతో కలిసి పనిచేయవలసిన ప్రాధా న్యతను కూడా కొందరు గుర్తిస్తున్నారు. సామాజిక సమస్య లతో పాటు ఆర్థిక రంగంలో కూడా పోరాటం కొనసాగిం చాలన్న దిశలో అడుగులు పడుతున్నాయి. అందుకే కమ్యూ నిస్టులు, అంబేద్కర్‌వాదులు కలిసి పనిచేసేందుకు కూడా అవకాశాలు పెరిగాయి. ఇది మంచి మార్పు. ”

భావిస్తున్నది. దళిత తదితర సామాజిక సంస్థ లలో కూడా కొందరి ఆలోచన మారుతున్నది. కమ్యూనిస్టులతో కలిసి పనిచేయవలసిన ప్రాధా న్యతను కూడా కొందరు గుర్తిస్తున్నారు. సామాజిక సమస్యలతో పాటు ఆర్థిక రంగంలో కూడా పోరాటం కొనసాగించాలన్న దిశలో అడుగులు పడుతున్నాయి. అందుకే కమ్యూనిస్టులు, అంబేద్కర్‌వాదులు కలిసి పనిచేసేందుకు కూడా అవకాశాలు పెరిగాయి. ఇది మంచి మార్పు.

అస్తిత్వ వాదం పట్ల కమ్యూనిస్టులకు మొద టి నుండీ స్పష్టత ఉన్నది. గతంలోనైనా వర్తమా నంలోనైనా ఒకటే అర్థం. ఇది గుర్తింపుకు ప్రాధా న్యతనిస్తుంది. గుర్తింపుకు ప్రాధాన్యతనివ్వడం వల్లనే కుల నిర్మూలన నినాదం బలహీనపడు తుంది. వివక్షమీద పోరాటం కంటే పాలకవర్గాల సహాయం కోసం ప్రయత్నించటం మీదనే ఎక్కువగా దృష్టి పెడుతోంది. కుల వివక్షను గుర్తిస్తూనే అణగారిన తరగతుల సమస్యలను నినదిస్తూనే పాలక వర్గాలతో పోరాటానికి బదులు సావాసానికి దారులు వెతుక్కుంటోంది. అందుకే కుల వివక్ష వ్యతిరేక పోరాటం, అణగారిన తరగతుల విముక్తి కోసం సాగే ఉద్యమం పట్ల ఆయా తరగతుల నుండి అభివృద్ధి చెందిన మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గాల వైఖరి ఎట్లా ఉ ంటుందన్నది ఒక సవాలుగానే ముందు కొచ్చింది. వీరిలో రాజకీయంగా చురుకైనవారు పాలకవర్గాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీలతో ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ సంబంధాలు కలిగిఉన్నారు. అందుకే ఇది మధ్యతరగతికి పరీక్షా సమయం. అణగారిన తరగతుల జన సమూహాన్ని చూపించి, అందరి సమస్యను విస్మరించి కొందరు లాభపడే ప్రయత్నం రూపంలో అస్తిత్వవాదం బయట పడుతోంది. వర్గ పోరాటాన్ని తిరస్కరించటం, కుల వివక్షమీద పోరాటాన్ని విస్మరించటం రూపంలో కూడా ఇది వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా, తమ న్యాయమైన ప్రజాస్వామిక సమస్యలపైన ఏ మేరకు పోరాడినా... ఆర్థిక, సామాజిక సమస్యల మీద ఏ మేరకు కదిలినా... పోరాడుతున్నవారు ఎవరనేదానితో నిమిత్తం లేకుండా, ఆ ఉద్యమంతో భుజం కలపాలన్నదే కమ్యూనిస్టుల వైఖరి. సైద్ధాంతిక స్పష్టతతోనే ఈ వైఖరి తీసుకున్నది.

అణగారిన తరగతులలో మధ్య తరగతి తగు మోతాదులో అభివృద్ధి చెందిన నేపథ్యం లోనే ఆత్మ గౌరవ సమస్య ముందుకొచ్చింది. నిజమే. ఆత్మగౌరవ సమస్యకు ప్రాధాన్యత పెరిగింది. అటు గ్రామీణ ప్రాంతాలలో గానీ, పట్టణ ప్రాంతాలలో గానీ విద్యావంతులైన యువతీ యువకుల్లో పెరిగిన నూతన చైతన్యం ఫలితమిది. అగ్రవర్ణ పెత్తందారీ ధోరణితో అణగారిన తరగతులను అవమానించడాన్ని వీరింకేమాత్రం అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఈ ప్రతిఘటను సహించలేకనే కొంత కాలంగా అగ్రవర్ణ పెత్తందారులు రెచ్చిపోతు న్నారు. దళితుల మీద దాడులు పెరుగుతు న్నాయి. ఈ దాడులను ప్రతిఘటించే క్రమంలో వివక్షకు వ్యతిరేకంగా అణగారిన తరగతులను, మరోవైపు కులమత భేదాలతో నిమిత్తం లేకుండా ప్రజాతంత్రవాదులను సమీకరించాలి. దళితులు, గిరిజనులు ఒంటరి కాకుండా చూడాలి. ఈ కృషిలో కార్మికవర్గం ముందుండాలి. కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలవాలి. గ్రామీణ ప్రాంతాల్లోనైనా, పట్టణాల్లోనైనా కులవివక్షకు వ్యతిరేకంగా స్పందించడంలోనే మధ్యతరగతి ఆత్మగౌరవం నిలబడుతుంది. కులవ్యవస్థను కాపాడే పాలకవర్గాలను ఎండగట్టగలిగినప్పుడే మధ్యతరగతి ఆత్మగౌరవానికి అర్థం ఉంటుంది. అణగారిన తరగతుల్లోని మధ్యతరగతి వర్గానికి ఆర్థిక సమస్యలు ప్రధానం కాదని, ఆత్మగౌరవం ప్రధాన సమస్యగా ముందుకొచ్చిందని కొందరి అంచనా. ఇది నిజమైతే గొప్ప పరిణామాలకే దారి తీస్తుంది. తమ వ్యక్తిగత ఆర్థిక ప్రయోజ నాలను పక్కన పెట్టి నిరుపేద దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల ప్రయోజనాల కోసం నిలబడతారు. అందులోనే తమ ఆత్మ గౌరవం ఇమిడిఉన్నదని భావిస్తారు. పేదరికంలో మగ్గుతు న్న, పెత్తందార్ల అణచివేతకు బలవుతున్న, అగ్ర కుల దురహంకారపు అవ మానాలకు గురవు తున్న, అత్యధిక సంఖ్యలో ఉన్న అణగారిన తరగ తుల కోసం వీరు నిలబ డితే అది త్యాగం అవు తుంది. ఇప్పుడు జరగవల సింది కూడా అదే.

❄

పాఠకుల అభిప్రాయాలు

# జె.ఎన్.యు.పై వ్యాసం అందరూ చదవాలి

జె.ఎన్.యు.పై ఆరోపణలు వాస్తవాలు వ్యాసం అందరూ తప్పక చదవాలి. దేశవ్యాపితంగా చర్చ జరుగుతున్న జె.ఎన్.యు. సంఘటన పూర్వాపరాలు 'జీ న్యూస్' ఛానల్ అవాస్తవాలను జోడించి ప్రసారం చేయడం, ముసుగులు ధరించిన కొంతమంది వ్యక్తులు **'భారత్ తేరే తుక్‌డే హోంగే ఇన్‌షా అల్లా, జంగ్ చలేగీ, భారత్ కీ బర్‌బాదీ తక్'** అని నినాదాలు ఇవ్వడం నిర్వాహకులు ఆ నినాదాలు ఆపు చేయమని చెప్పడం జరిగింది. కానీ ఈ విషయాలు బయటకు రాలేదు సరికదా వక్రీకరించబడినాయి. అంతేకాక జాతి వ్యతిరేక నినాదాలు చేశారని కన్నయ్యకుమార్‌తో పాటు ఐదుగురు విద్యార్థులపై 'దేశద్రోహం' కేసు ఐపిసి 124ఎ బనాయించారు. ఈ సెక్షన్ కూడా చర్చనీయాంశమైంది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నదని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు. అసలు ఏది 'దేశద్రోహ నేరమో' విశదీకరించవలసి ఉంది. కాశ్మీర్ ప్రజలు నిత్యం పారా మిలిటరీ పహారాలో జీవిస్తున్నారు. అక్కడి ప్రజలు జరుపుతున్న పోరాటం గురించి తెలుసుకోవాలి. కాశ్మీర్ ఒక దేశం. దానికి ప్రధానమంత్రి ఉండేవారు. దానిని మన దేశంలో విలీనం చేసుకున్నాం. కాశ్మీర్ చరిత్ర చదివితే అనేక విషయాలు వెలుగులోనికి వస్తాయి. కన్నయ్యకుమార్ తదితరులపై పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయాలి.

– **తంపాల శ్రీరామమూర్తి**, గాజువాక.

**ఈ మాసం ప్రత్యేకం**

# రిజర్వేషన్లు: మోదీ-అంబేద్కర్

**ఆనంద్ తెల్‌తుంబ్డే**



రచయిత దళిత మానవ హక్కుల ఉద్యమ నాయకులు

నేను విగ్రహారాధకుణ్ణి కాదు..
విగ్రహ విధ్వంసకుణ్ణి

*– బీ ఆర్ అంబేద్కర్*

విజ్ఞాన భవన్లో మార్చి 22వ తేదీన అంబేద్కర్ స్మారక ఉపన్యాసమిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ పలు ఆసక్తికర విషయాలు ప్రస్తావించారు. వాటిల్లో రెండు ముఖ్య విషయాలు పాలక వర్గాల ప్రతినిధిగా, అంబేద్కర్ స్ఫూర్తిని ఉల్లంఘించినవానిగా ఆయన్ని పట్టి చూపుతాయి. మొదటి అంశం మోడీ తనను అంబేద్కర్ భక్తునిగా చెప్పుకోవడం. రెండవది రిజర్వేషన్ల అంశం. అంబేద్కర్ మళ్లీ జన్మించి దళితులు, ఆదివాసీలకు రిజర్వేషన్లు తొలగించాలని డిమాండ్ చేసినా తాను వాటిని కొనసాగించి తీరుతానని ప్రధాని చెప్పుకొచ్చారు. బాబాసాహెబ్ మీద ప్రేమ ఒలకబోయడం దళితుల్ని భారతీయ జనతాపార్టీ వైపు ఆకర్షింపచేయడం కోసమేనన్నది సుస్పష్టం.

**అంబేద్కర్ పట్ల ప్రేమకు కారణాలు**

దళితుల్ని ఆకట్టుకోవడమనేది సంఘపరివార్ కుట్రలో ప్రధానభాగం. భారత ప్రజల్ని హిందువులుగా ఇతర మతస్తుల్నీ కమ్యూనిస్టుల్నీ కలిపి వారికి వ్యతిరేకులుగా సంఘ పరివార్ చూపిస్తున్నది. ఈ ఎత్తుగడను దెబ్బతీయగల శక్తి దళితులకున్నది. అందుకు చారిత్రక, సామాజిక, సైద్ధాంతిక, సాంస్కృతిక కారణాలున్నాయి. తాము కూడా హిందువుల్లో భాగమేనని చెప్పుకోవడానికి దళితులు ఇప్పుడు ఇష్టపడటం లేదు.

1909లో వలస పాలకులు భారత రాజకీయాల్ని మత ప్రాతిపదికన విభజించేందుకు ప్రయత్నించారు. మార్లే మింటో సంస్కరణపై జరిగిన చర్చల సందర్భంగా దళితులు, ఆదివాసీలు హిందూమతంలో భాగం కాదంటూ కాంగ్రెస్‌కు ముస్లింలీగ్ సవాల్ విసిరింది. అప్పటికి దళితుల్ని కూడా మనుషులుగా చూడటం వంటి ప్రాథమిక అంశాలపైనే దృష్టి పెట్టిన దళిత ఉద్యమం.. రాజకీయంగా తనను తాను వ్యక్తం చేసుకోగల స్థాయికి చేరుకోలేదు. 1919 మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల సందర్భంగా ముస్లింలీగ్‌తో కాంగ్రెస్ లక్నో ఒడంబడిక కుదుర్చుకున్నప్పుడు దళితుల హక్కుల అంశాన్ని గమనంలోకి తీసుకోవడం తప్పనిసరి అయ్యింది. హిందువులు దళితుల్ని రాజకీయంగా పరిగణనలోకి తీసుకోవడం చరిత్రలో ఇదే తొలిసారి) గాంధీజీ అహ్మదాబాద్‌లో మాట్లాడుతూ అంటరానితనాన్ని పాపంగా ప్రస్తావించడం ద్వారా దళితుల పట్ల ఆప్యాయత కనబరిచారు.

బొంబాయి ప్రావిన్స్‌లో (1916) దళితుల మద్దతుకోసం కాంగ్రెస్ నాలుగు సభలు నిర్వహించింది. 1927 మహద్ చెరువు సత్యాగ్రహం అనంతరం హిందువుల తీరు పట్ల నిరాశకు గురైన అంబేద్కర్ దళితుల స్వతంత్ర రాజకీయ అస్తిత్వం కోసం కృషి ప్రారంభించారు. హిందూమతం, హిందువులపై తీవ్ర దాడి కొనసాగించారు. తాను చనిపోవడానికి రెండు నెలల ముందు హిందూమతాన్ని త్యజించి బౌద్ధం స్వీకరించారు. ఈ చర్య దళితుల మత, సాంస్కృతిక అస్తిత్వానికి సరికొత్త భాష్యం చెప్పింది. భారత్‌ను హిందూ రాష్ట్రగా తీర్చిదిద్దాలన్న సంఘ్‌పరివార్ లక్ష్యానికి ఈ చారిత్రకాంశమే గండి కొట్టనున్నది. సంఘ పరివార్ దృష్టిలో హిందూరాష్ట్ర స్థాపన అంటే అగ్రవర్ణ బ్రాహ్మణ ఆధిపత్యవాదమే. ఒకే ప్రజ ఒకే జాతి ఒకే నేతఅన్న నినాదంతో ముందుకెళ్లిన నాజీయిజమే.

ఈ గత చరిత్ర సంఘపరివార్ ఎత్తుగడకు పెద్ద అడ్డంకిగా తయారైంది. అంబేద్కర్‌ను కాషాయీకరిస్తే తప్ప ఈ సమస్యను సంఘ్ అధిగమించలేదు. అంబేద్కర్ మీద హఠాత్తుగా వచ్చి పడిన ప్రేమకు కారణమిదే. దళిత ఉద్యమ సైద్ధాంతిక బలహీనతలు, నాయకత్వ దివాళాకోరుతనం, తమ స్వార్థమే చూసుకునే దళిత మధ్యతరగతి, హిందూ దేవతల స్థానంలో అంబేద్కర్‌ను కొలిచే దళిత ప్రజల ధోరణి అసాధ్యమనుకున్న సంఘపరివార్ ప్రణాళికను సుసాధ్యం చేయవచ్చనే స్థితిని తీసుకొచ్చాయి. ఆర్‌ఎస్‌ఎస్ సంఘచాలక్ బాబా సాహెబ్ దేవరస్ హయాంలో చాప కింద నీరులా తొలుత దళితుల్ని ఆకట్టుకునే ప్రణాళికలు ప్రారంభమయ్యాయి. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన సేవాభారతి సంస్థ దళితుల కోసం పని మొదలెట్టింది. అగ్రవర్ణాల వలే సామాజిక గుర్తింపు కోరుకునే మధ్యతరగతి దళితుల్ని దరి చేర్చుకునేందుకు 'సమరసతా మంచ్' ప్రారంభమైంది. సంఘ్ ప్రాతఃస్మరణీయుల్లో అంబేద్కర్‌కు స్థానం లభించింది. సంఘ్ పవిత్రంగా భావించే అంశాలన్నింటిపైనా తీవ్రదాడులు చేసిన అంబేద్కర్ అంటే అప్పటివరకూ ఆర్‌ఎస్‌ఎస్‌కు అమిత విద్వేషం. హఠాత్తుగా అంబేద్కర్ హెడ్గేవార్‌కు మిత్రుడని ప్రచారం ప్రారంభించారు. బాబా సాహెబ్‌కు ఆర్‌ఎస్‌ఎస్ అంటే ఇష్టమని, ముస్లింలూ కమ్యూనిస్టులూ అంటే ద్వేషమని, ఘర్‌వాపసికి ఆయన అనుకూలుడని, జాతీయ పతాకం స్థానంలో కాషాయి జెండా కోరుకున్నారని ఇలా గోబెల్స్ తరహా ప్రచారం కొనసాగించారు.

వీటిని గిమ్మిక్కులుగా కొందరు కొట్టి వేయవచ్చు. కానీ పూర్తిగా విస్మరించలేం. ఎందుకంటే సంఘ్‌పరివార్ ఈ ప్రయత్నాలు దళిత నాయకుల్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు విజయవంతంగా దోహదపడ్డాయి. గత కొన్ని ఎన్నికల్లో ఇతర పార్టీల కన్నా బీజేపీకి ఎక్కువ రిజర్వ్‌డ్ స్థానాలు లభించడమే ఇందుకు నిదర్శనం. ఇదొక్కటే కాదు. దళితుల్ని పురోగామి నుంచి తిరోగామి దృక్పథం వైపు మళ్లించడంలో సంఘ్ విజయాలు సాధిస్తోంది. మైనార్టీల వ్యతిరేక వైఖరి దృష్ట్యా తమ హిందూ రాష్ట్ర సాధనకు 30 శాతం ఓటర్లయిన దళితుల మద్దతు బీజేపీకి అవసరం. అందుకే ప్రగతిశీల భావాలు గల రోహిత్ వేముల వంటి వారిని అడ్డు తప్పించాలి. ఆదివాసీలపై మావోయిస్టులనే ముద్ర వేయడం లాటిదే ఇది. పురోగామి శక్తుల్ని వేరు చేసి దళితుల్ని మితవాదులుగా మార్చి తమ గుప్పిట్లోకి రప్పించుకోవడం సంఘ్ పరివార్‌కు అత్యవసరమన్నమాట!

**భక్తిని తిరస్కరించిన అంబేద్కర్**

అంబేద్కర్ వ్యక్తి ఆరాధనను

> “నా కృషి, గుణగణాలకు మీరు అతి విశేషణాలతో కీర్తించారు. నాయకుని ఆరాధించే మనస్తత్వాన్ని మొగ్గలోనే తుం చేయాలి. ఒక వ్యక్తిని మీరు ఆరాధించడమంటే మీ కర్తవ్యాన్ని విస్మరించి పూర్తిగా అతనిపై ఆధారపడే భావన పెంపొందించుకో వడమే అవుతుంది. ఈ రుగ్మతకు బానిసలైతే కాల్వ ప్రవాహంలో కొట్టుకుపోయే దుంగల్లా తయారవు తారు జాగ్రత్త' అంటూ హెచ్చరించారు.”

తిరస్కరించేవారని మోదీ గ్రహించాలి. హీరోగా ఆరాధించడాన్ని ఆయన వ్యతిరేకించేవారు. స్వతంత్ర వ్యక్తిత్వం, సృజనాత్మకత, ప్రశ్నించే తత్వాన్ని ఈ ధోరణి చంపేస్తుంది. అందువల్లనే రాజకీయ జీవితంలో ఏనాడూ అంబేద్కర్ వ్యక్తి ఆరాధనను అనుమతించలేదు. బాబాసాహెబ్ జీవిత చరిత్రకారుడు ధనంజయ్ కీర్ ఇలా రాశారు :

1933 మార్చిలో బొంబాయిలో తనకు జరిగిన అభినందన సభలో అంబేద్కర్ మాట్లాడారు. “నా కృషి, గుణగణాలకు మీరు అతి విశేషణాలతో కీర్తించారు. నాయకుని ఆరాధించే మనస్తత్వాన్ని మొగ్గలోనే తుం చేయాలి. ఒక వ్యక్తిని మీరు ఆరాధించడమంటే మీ కర్తవ్యాన్ని విస్మరించి పూర్తిగా అతనిపై ఆధారపడే భావన పెంపొందించుకోవడమే అవుతుంది. ఈ రుగ్మతకు బానిసలైతే కాల్వ ప్రవాహంలో కొట్టుకుపోయే దుంగల్లా తయారవు తారు జాగ్రత్త' అంటూ హెచ్చరించారు.

1943లో మహదేవ్ గోవింద రణడే 101వ జయంతి సభలో కూడా వ్యక్తి ఆరాధనను ఎందుకు తిరస్కరిస్తున్నదీ అంబేద్కర్ వివరించారు. 1956లో అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించారు. నాగపూర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనేకులు అంబేద్కర్ పాదాలపై పడి సమస్కరించసాగారు. ఈ తరహా బానిసధోరణి తనకు నచ్చదంటూ చేతికర్రతో ఒకని తలపై మందలింపుగా మోదారు. నేడాయన సజీవంగా ఉంటే మోడీని కూడా అలాగే మోదేవారు. పొగడ్తలు కట్టిపెట్టి రాజ్యాంగం దళితులకు కల్పించిన రక్షణను కట్టుదిట్టంగా అమలు చేయమనేవారు.

మోదీ ఒక పక్క దళితుల అభివృద్ధి నిధులకు కోత విధిస్తున్నారు. మరోవైపు ప్రగతిశీల దళిత విద్యార్థుల చైతన్యాన్ని చిదిమేస్తు న్నారు. రోహిత్ వేముల 'హత్య' ఇందుకు ఉదాహరణ. రోహిత్‌కు న్యాయం జరగాలని ఉద్యమించిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విద్యార్థులపై ఖాకీల క్రౌర్యం పురోగామి దళిత విద్యార్థుల ప్రజాతంత్ర హక్కులపైమోడీ ప్రభుత్వ దమన నీతికి ప్రత్యక్ష తార్కాణం.

వ్యక్తి ఆరాధనను అంబేద్కర్ తిరస్కరించారు. దురదృష్టవశాత్తు పాలకవర్గాల వలలో అంబేద్కర్ అనుయాయులుగా చెప్పుకుం టున్న వారూ చిక్కుకున్నారు.) అంబేద్కర్‌కు బిరుదులు, పొగడ్తలు, భారీ స్మారకాల నిర్మాణం వంటి కుతంత్రాలకు దళితులూ లొంగి పోయా రు. తన పేరిటగానీ, ఇతర రాజకీయ నాయకుల పేరిటగానీ స్మారక భవనాల నిర్మాణాన్ని బాబా సాహెబ్ తిరస్కరించేవారు. సామాన్య ప్రజలు కనీస అవసరాలు తీరక అవస్థ పడుతుంటే చనిపోయిన వారికోసం ఇలా కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగపర్చడాన్ని ప్రశ్నించే వారు. కాంగ్రెస్ కన్నా తమ ప్రభుత్వమే అంబేద్కర్ ను ఘనంగా గౌరవించినట్లు బీజేపీ సర్కారు గప్పాలు కొట్టుకుంటోంది. దీన్ని ఖండించాల్సిన దళితులు అందుకు భిన్నంగా భారతీయ జనతాపార్టీ వలలో చిక్కుకోవడం శోచనీయం.

దళితులకు రిజర్వేషన్లు మోడీ ప్రస్తావించిన రెండో అంశం. స్వయంగా అంబే ద్కర్ మళ్లీ జన్మించి వీటిని రద్దు చేయమని కోరినా తాను రిజర్వేషన్లు కొనసాగిస్తానని మోడీ అన్నారు. రిజర్వేషన్లు దళితుల భావోద్వేగాలతో ముడివడివున్నాయి. అందువల్లనే వీటి మంచిచెడ్డలపై ఎవ్వరూ నిష్పక్షపాత విశ్లేషణకు పూనుకోవడం లేదు. మోడీ వంటి పాలక వర్గీయులకు కావలసిందిదే.

తొలుత రాజకీయంగా, ఆ తర్వాత విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలుకు అంబేద్కర్ పూర్తి కారకులు. దళితుల చట్టసభలకు ఎన్నికైతే వారి ప్రయోజనాలు నెరవేరుతాయనేది అంబేద్కర్ ఆకాంక్ష. ప్రత్యేక నియోజకవర్గాల పద్ధతిని అమలు చేయాలని అంబేద్కర్ తొలుత కోరారు. దీని వల్ల నిజమైన దళిత ప్రతినిధి ఎన్నికవుతాడని ఆయన భావన. గాంధీ తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ (1930 32) లో అంబేద్కర్ దీన్ని సాధించారు. నిరవధిక నిరాహారదీక్ష ద్వారా బెదిరించి అంబేద్కర్‌ను గాంధీజీ లొంగదీసుకున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అంబేద్కర్ ఉమ్మడి నియోజకవర్గాల విధానాన్ని అంగీకరించారు. ఇదే పూనా (1932)ఒప్పందంగా పేరొందింది.

ప్రత్యేక నియోజకవర్గాల విధాన ముంటే స్వంత వ్యక్తిత్వం గల దళితులు ప్రతిని ధులుగా ఎన్నికయ్యేవారు. ఉమ్మడి నియోజక వర్గాలలో దళితేతర మెజార్టీ ప్రజల ఆమోదం పొందగలవారే గెలవగలుగుతారు. కన్షీరాం మాటల్లో 'చెంచా'లన్నమాట! స్వతంత్ర భారత దేశంలో స్వయంగా అంబేద్కర్ ఒక్కసారి కూడా గెలవలేకపోవడమే ఇందుకు సాక్ష్యం. అతి సాధారణ అభ్యర్థి చేతిలో సైతం ఆయన ఓటమి చెందారు.

అంబేద్కర్‌కు ఈ తరహా రిజర్వేషన్ల విధానం నచ్చలేదు. రాజ్యాంగంలో వీటిని పొందుపర్చినప్పుడు విధానమార్పు ఏమీ చేయలేకపోయారు. పదేళ్ల వరకూ వర్తించే కాలవ్యవధి మాత్రం పెట్టగలిగారు. పాలకవర్గా లకు ఈ తరహా రిజర్వేషన్ విధానం లాభదాయ కంగా ఉంది. దశాబ్ది కాలవ్యవధి ముగియగానే రిజర్వేషన్ల విధానాన్ని పొడిగించడం ప్రారంభిం చారు. ఈపద్ధతి స్వతంత్ర దళిత ఉద్యమాన్ని నాశనం చేసింది. తద్వారా దళితుల ప్రయోజ నాలకు భంగకరంగా మారింది. బ్రోకర్లను దళిత నాయకుల్ని చేసింది.

విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటా విధానం 1943లో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఉన్నప్పుడు అంబేద్కర్ చొరవతోనే ప్రారంభమైంది. తొలుత రిజర్వేషన్లు లాభదాయ కంగానే ఉన్నాయి. దీని వల్లనే ఒక స్థాయిలో దళిత మధ్యతరగతి ఆవిర్భవించగలిగింది. ఆ తర్వాత నుంచి రిజర్వేషన్ల పరిమితులు, దుష్ప్ర భావాలు బయటపడసాగాయి. కులవ్యవస్థను యధాతథంగా కొనసాగించి భారత ప్రజల్ని సుదీర్ఘ కాలం చీల్చి ఉంచడానికి రిజర్వేషన్లు పాలకవర్గాలకు మంచి పావులా ఉపయోగ పడ్డాయి.

సామాజిక న్యాయ అంశాన్ని రాజ్యాంగ రచనా సమయంలో విభిన్నంగా తరచి చూసి ఉండాల్సింది. రిజర్వేషన్ల విధానం కులవ్యవస్థను కాపాడటమే కాకుండా మరింత స్థిరీకరించేలా చేసింది. వలసపాలకుల హయాం లో కోటా విధానంగా రిజర్వేషన్లను ప్రవేశపెట్టి

(మిగతా 34వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# నేను కమ్యూనిస్టును... కాక పోతినే

## బాబా సాహెబ్ అంబేడ్కర్ చివరి ఆలోచనలు...


రచయిత ప్రజాశక్తి ఫొటోగ్రాఫర్

**తిప్పసముద్రం రమణ**

అంబేడ్కర్ బౌద్ధమత స్వీకారం అనంతరం తను అనుకున్న లక్ష్యాలను చేరుకొలేకు న్నానని తన అనుచరుడైన గైక్వాడ్‌తో కమ్యూనిస్టు పార్టీలో చేరే అవకాశం ఉందని తెలిపారని. ఇటీవల ఆర్.ఎస్.ఎస్ గుండాల చేతిలో హత్య కు గురైన గోవిందపన్సారే ఈ సంగతి రాశారు.

బాబాసాహెబ్ అంబేడ్కర్ నూటఇరవై ఐదవ జయంతి ఉత్సవాలు ఆయన విశ్వరూప సాక్షాత్కారంలా గోచరిస్తున్నాయి. తన పదకొండో ఏటనే వివక్షపై సుదీర్ఘ పోరాటం ప్రారంభించిన ఈ మహనీయుని విగ్రహాలను ప్రతిష్టించడానికి ఇప్పుడు అధికారంలో వున్న పాలక పార్టీలు పోటీపడ్తున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ తొలి సారిగా అంబేడ్కర్ పుట్టిన స్థలమైన మౌను సంద ర్శించి మంచిపని చేశారు. కానీ ఇక్కడే ఒక కిటుకు ఉంది. సందర్శించి జాతీయమీడియాలో బాగా ప్రచారం చేస్తూనే బహుజనులు హక్కులను ఎలా కాలరాయాలా అని చూస్తున్నారు.

కాంగ్రెసు అంబేడ్కర్‌ను మరుగుపర్చిందని ఆరోపిస్తూ ఆయన వారసత్వమంతా తమ ప్రభుత్వానిదేనని చెప్పుకున్నారు. అసలు ఆయనకు ఒకస్థానం కల్పించింది. తామేనన్నట్టు కాంగ్రెసు పార్టీ ప్రకటించుకుంది. వర్గ పోరాటా లతో పాటు సామాజిక రంగంలోనూ సమర శీలత పెంచుకునే దిశగా అడుగులేస్తున్న కమ్యూనిస్టులు అంబేడ్కర్ భావాల సమగ్ర చిత్రం ఇచ్చే ప్రయత్నం చేశారు. సహజంగానే దళిత బహుజనవాద సంస్థలూ, సంఘాలూ స్వచ్ఛంద సంస్థలూ సంస్కరణ వాదులూ తమ నిరంతర స్ఫూర్తిని మరోసారి తలుచు కోవడానికి ముందు కొచ్చాయి. ఇంతమందితో కలవడం అంబేడ్క రుండు అనిపించుకుంటున్న ఈ మహనీయుని మహిత సందేశమేమిటి? మన కాలంలో దాని మహత్తర ప్రాధాన్యత ఏమిటి?

చరిత్ర ఒక పాఠ్యపుస్తకమైతే దానికి టీకా టిప్పణి కూడా చరిత్రే. మండల్ వర్సెస్ కమండల్ అన్నవారు, భీమ్ వర్సెస్‌రామ్ అంటూ రథయాత్రులు నిర్వహించినవారు ఇప్పుడు అధికారంలో ఉన్నారు. కేంద్రంలో ఈప్రభుత్వం వచ్చాక తొలి కదలిక చెన్నైలోని అంబేడ్కర్ పెరియార్ స్టడీ సర్కిల్‌ను అడ్డుకోవడంతోనే మొదలైంది. అంబేడ్కర్‌తో పెనవేసుకున్న హైద్రాబాదులోని క్యాంపస్‌లో రోహిత్‌వేముల ఆత్మార్పణతో ఆగ్రహాగ్ని ఢిల్లిలోని జేఎన్‌యూలో కన్నయ్య కుమార్ అనే విద్యార్థి నాయకుని విలక్షణ ప్రసంగాల్లో దేశమంతా ప్రతిధ్వని స్తుంది. అంబేడ్కర్ పేరిట జరిపిన ప్రత్యేక రాజ్యాంగ సభ ప్రారంభోపన్యాసంలోనే అన్నీ వేదాల్లో ఉన్నాయని ప్రకటించిన హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాటలు ఇటీవలి జ్ఞాపకమే. రాజ్యాంగం 1949 నవంబరు 18న ఆమోదం పొందితే ఆ మరుసటి రోజునే ఆర్గనైజర్ పత్రిక విశ్వవినుతమైన మనువు మార్గం దాంట్లో కాస్తయినా చోటు పొందలేదని నిరసించిన సంగతి మరింత పాత ముచ్చట. చాయ్‌వాలాగా ఉండి ప్రధాని కావడం గొప్ప విషయమే గాని ఆ తర్వాత గాయ్‌వాలాగా మారడంతోనే గాయాలు మళ్లీ సలపడం మొదలైందన్నది సమకాలీన సత్యం.

ఇంతకన్నా దారుణమైన నిజాలు చెప్పుకో వచ్చు. ఇప్పటికీ మానవ మలాన్ని శుద్ధిచేసి మోసుకుపోయే వారిసంఖ్య ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నది భారత్‌లో. వారు ఏదో బతుకు దెరువు కోసం గాక గొప్ప సామాజిక కర్తవ్యంగా ఆపని చేస్తున్నారని గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీనే వ్యాఖ్యానించారు. (కర్మయోగ- మోడీ ఉపన్యాసాల సంకలనం, 2007) 'వారు ఈ పనిచేయాలన్నది దేవుడి ఆదేశం. ఇదో ఆధ్యాత్మిక చర్యగా శతాబ్దాలుగా కొనసాగుతున్నది. వారి పూర్వీకులు మరేపని లేకనే ఇది చేసి ఉంటారని వూహించడం కష్టం... అని కూడా సెలవిచ్చారు. హర్యానాలో దళితు లను చంపినప్పుడు ప్రతి కుక్క చావుకూ సంతా పం తెలపనవసరం లేదన్న మాజీ సైన్యాధిపతి మంత్రివర్గంలో కొనసాగుతూనే ఉన్నాడు. మాటలు, చేతలకు హస్తిమశకాంతరం అన్న వాస్తవాన్ని గుర్తించడాని కివి చాలు. కాంగ్రెసు హయాంలో ఆయన ఔన్నత్యం మరుగున పడిందని మోదీ ఆరోపించారు.

నిజమే. నెహ్రూ గాంధీ భజనలో భగత్‌సింగ్‌లూ నేతాజీలు కమ్యూనిస్టు యోధులు ఇంకా ఎందరో సామాజికసేవకులూ తెరమరుగైన మాట నిజమే. కానీ అందుకు ప్రతి వ్యూహంగా మోదీ ప్రభుత్వం సర్దార్‌పటేల్‌ను, నేతాజీని చూపించి నెహ్రూ లౌకిక భావాలపై దాడి చేయడం తిరోగమనమే తప్ప పురోగమనం కాదు. లౌకికతత్వం అన్నమాటను అక్రమంగా రాజ్యాంగంలో జొప్పించారని హోంమంత్రి తిట్టిపోస్తుంటే అంబేడ్కర్ ఆలోచనా ధారకు న్యాయం జరిగినట్టా? లౌకికతత్వం గాక హిందు త్వాన్ని ఆయన కలలోనైనా ఆదరిస్తారా?

కాంగ్రెసు నాయకులు సరే దళితులు బడుగు బలహీన వర్గాల మంత్ర జపంతోనే దశాబ్దాల తరబడి పాలన సాగించారు. ఇటీవల ఆక్స్‌ఫర్డ్ జరిపిన విస్తృత అధ్యయనంలో దేశం లోనే దళితులలో పేదరికం అవిద్య 60 శాతం పైగా ఉన్నట్టు తేలింది. కాంగ్రెసు, తెలుగుదేశం ఇంకా ఆయారాష్ట్రాల్లోని గత పాలకులు కాకుంటే దీనికి ఎవరు భాధ్యత వహించాలి? ఫ్యూడల్ కులాధిపత్య శక్తుల పెత్తనాలకు వారే చిరునా మాగా ఉన్నది వాస్తవం కాదా? ఇందిరాగాంధీ హయాంలో గొర్రెలు, బర్రెలు, భూపంపిణీ, బ్యాంకు రుణాలు అంటూ వారిని ఆకట్టుకున్న

(మిగతా 34వ పేజీలో)

# హక్కులను హరిస్తున్న కేంద్ర ముసాయిదా కౌలుచట్టం


రచయిత మార్క్సిస్టు బాధ్యులు

ఎ కోటిరెడ్డి

కేంద్ర ప్రభుత్వం దేశ, విదేశీ పెట్టుబడి దారులకు భూములను కటబెట్టటం కోసం అత్యంత ఆతృతగా ఉన్నది. ఇందుకు ప్రజల నుండి వ్యతిరేకత రాకుండా ఉండటం కోసం దేశంలో వ్యవసాయాభివృద్ధిని పెంచటం కోసం ఆందోళన చెందుతున్నట్లు నటిస్తున్నారు. పెట్టుబడిదారులకు భూములను అప్పగించ టంలో ఆలస్యాన్ని నివారిం చేందుకు, వారు అడిగి అడగగానే భూములివ్వటం కోసం బిజెపి నాయకత్వంలో యన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2013లో యుపిఎ ప్రభుత్వం ఆమోదించిన భూ సేకరణ చట్టాన్ని సవరించటానికి పూనుకున్నది. రాజ్య సభలో తగినంత బలం లేకపోవటంతో వరుసగా మూడుసార్లు ఆర్డినెన్సును జారీచేసింది. కేంద్రం తీసుకొస్తున్న రైతాంగ వ్యతిరేక సవరణలను నిరసిస్తూ పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపక్షాల ఆందోళన, దేశవ్యాపితంగా వామపక్షాలు, రైతు సంఘాలు, ప్రజల పోరాటాలు పెరగటంతో 2013 భూ సేకరణ చట్టానికి సవరణ ప్రయత్నాలను తాత్కాలికంగా పక్కన పెట్టి, ప్రత్యామ్నాయ మార్గాలను వెతకటం ప్రారంభించారు. అందులో భాగంగా ప్రస్తుతం ముసాయిదా కౌలుదారి చట్టాన్ని రంగంలోకి తీసుకొచ్చారు. వివిధ రాష్ట్రాలలోని కౌలుదారీ చట్టాలలో ఉన్న అభ్యుదయకరమైన, కౌలుదారులకు రక్షణ కల్పించే నిబంధనలను రద్దుచేసే అంశాలతో ముసాయిదాను రూపొందించి, ఈ చట్టాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని కేంద్రం ఆదేశిస్తున్నది. వాస్తవంగా వ్యవసాయం, కౌలు చట్టాలు రాష్ట్రాల పరిధిలోనివి. తమ రాష్ట్రాలకు అవసరమైన విధంగా చట్టాలను రూపొందించుకొనే హక్కు రాష్ట్రాలకు ఉన్నది. చట్టంలో ప్రత్యక్షంగా చెప్పకపోయినా కౌలు పేరుతో పారిశ్రామికవేత్తలకు భూములనప్పగించటం, రైతాంగ ఉద్యమాలు, కౌలుదారులు, వ్యవసాయ కార్మికుల పోరాటాల ఫలితంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 1960, 70 దశాబ్దాలలో కౌలుదారులకు అనుకూలమైన అభ్యుదయ అంశాలతో తీసుకొచ్చిన కౌలుదారీ చట్టాలను రద్దు చేయటం లక్ష్యంగా ప్రస్తుతం కేంద్రం రూపొందిం చిన ముసాయిదా చట్టం ఉన్నది.

నూతన కౌలుదారీ చట్టాన్ని రూపొందించటం కోసం వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సిఎసిపి) మాజి ఛైర్మన్ డాక్టర్ టి హక్ ఛైర్మన్‌గా గత సంవత్సరం సెప్టెంబరులో కమిటీని నియ మించారు. కమిటి వివిధ రాష్ట్రాలలో పర్యటించి, ముసాయిదా కౌలుదారీ చట్టాన్ని రూపొందించింది. వ్యవసాయ రంగంలోని పరిస్థితిని గురించి కమిటి ఈ విధంగా విశ్లేషణ చేసింది. "దేశంలో పెరుగు తున్న జనాభాకు అనుగుణంగా ఆహారధాన్యాలు, వ్యవసాయోత్పత్తులు పెరగకపోవటం ఆందోళన కలిగిస్తున్నది. వ్యవసాయ యోగ్యమైన భూములను సమర్థవంతంగా వినియోగించుకోవటమే దీనికి పరిష్కారం. చాలాచోట్ల భూ యజమానులకు వ్యవసాయంపై ఆసక్తి లేదని, వ్యవసాయంపై ఆసక్తి ఉన్న వారికి భూమి లభించటం లేదని, ఈ సమస్యను పరిష్కరించటానికి దేశవ్యాపితంగా కౌలుదారీ చట్టాన్ని అమలు చేయాలి" అని చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో 2011లో తీసుకొచ్చిన కౌలుదారీ చట్టాన్ని నమూనాగా తీసుకొని, కొద్దిపాటి మార్పులతో ముసాయిదా చట్టాన్ని రూపొందించామని కమిటి చెప్పింది. ముసాయిదా చట్టంలో చేసిన అనేక ప్రతిపాదనలలో కొత్తదనం ఏమీలేదు. కౌలు ఎంత అనేది భూ యజమాని, కౌలుదారు కలిసి నిర్ణయించుకోవాలని, కౌలు ఒప్పందాన్ని రిజిస్ట్రేషన్ చేయించాలా, లేదా అనేది కూడా వారిరువురూ కలిసి నిర్ణయించుకోవాలని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో మౌఖిక ఒప్పందాలు కూడా చెల్లుతాయని చెప్పింది. వీటన్నింటి వలన కౌలుదారులకు బ్యాంకు రుణాలు లభిస్తాయని, పంటల బీమాను కౌలురైతులే పొందుతారని, ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సందర్భాలలో ప్రభుత్వ సాయాన్ని వారే పొందుతారని చెప్పింది.

ఆంధ్రరాష్ట్ర కౌలుదారీ చట్టం 2011ను ప్రాతిపదికగా తీసుకొని ఈ ముసాయిదా చట్టానికి రూపకల్పన చేశామని చెబుతున్నారు కాబట్టి రాష్ట్రంలో కౌలుదారీ చట్టం అమలు జరిగిన అను భవాలను దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తే ఈ చట్టంలోని లొసుగులేమిటో అర్థం అవుతాయి. రాష్ట్ర చట్టంలో కౌలురైతు పేరును నమోదు చేయాలంటే భూ యజమాని అంగీకారంతో నిమిత్తం లేదు. అయినా కౌలురైతుల పేర్లు నమోదు చేయటానికి భూ యజమానులు అంగీకరించటం లేదు కాబట్టి అధికారులు కౌలురైతుల పేర్లు నమోదు చేయలేదు. చట్టప్రకారం గ్రామసభ జరిపి, గ్రామసభలో కౌలుదారులుగా నిర్ధారించబడిన వారిని కౌలు రైతులుగా నమోదు చేయాలి. కాని స్థానిక రెవిన్యూ అధికారులు గ్రామసభలో కౌలుదారులుగా నిర్ధారించబడిన వారిని రికార్డులలో నమోదు చేయకుండా, దూరాన ఉన్న భూ యజమానులతో కూడా ఫోన్‌లో మాట్లాడి, వారు వద్దని చెబితే కౌలురైతుల పేర్లు నమోదు చేయకుండా ఆపివేశారు. కౌలురైతులు తమపేర్లు నమోదు చేయించు కుంటామని అడిగిన చోట్ల భూ యజమానులు వారిని తొలగించి, కౌలుదారుగా పేరు నమోదు చేయించుకోబోమనే షరతు విధించి, కొత్తవారికి భూములను కౌలుకిచ్చారు. ప్రస్తుత కేంద్ర ప్రతిపాదిత ముసాయిదా చట్టంలో కౌలురైతు పేరు నమోదు చేయటానికి కౌలురైతు, భూ

యజమాని ఇరువురూ అంగీకరించాలని చెప్పారు. కౌలురైతు తన పేరు నమోదు చేయించుకోవటానికి ఎపుడూ సంసిద్ధంగానే ఉంటాడు. అందుకు అంగీకరిం చనిది భూ యజమానులే. తనపేరు కౌలుదారుగా నమోదు చేయించాలని కౌలురైతు, వద్దని భూ యజమాని చెపితే ఏం జరుగుతుంది? భూ యజ మానిని ధిక్కరించి, కౌలురైతు పేరును అధికారులు నమోదు చేయరనేది ఆంధ్రప్రదేశ్ అనుభవం. ఇద్దరి అంగీకారంతో కౌలురైతు పేరు నమోదు చేయాలని చెప్పినా యజమాని వ్యతిరేకిస్తాడు కాబట్టి కౌలురైతు పేరు నమోదు చేయటం జరగదు. అయితే భూ యజమానికి నష్టం లేకుండా, కౌలురైతు ఎన్ని సంవత్సరాలు అదేభూమిపై కౌలుదారుగా ఉన్నా, అతనికి ఏ విధమైన హక్కులు సంక్రమించకుండా, పంటకాలం పూర్తికాగానే కౌలురైతును బయటికి పంపేలా చట్టంలో సవరణలు తీసుకొస్తున్నాం కాబట్టి కౌలురైతు పేరు నమోదు చేయటానికి భూ యజమాని అంగీకరి స్తాడని ముసాయిదా చట్టం రూపొందించిన వారు చెబుతున్నారు. 20011లో ఆంధ్రరాష్ట్రంలో రూపొందించిన కౌలుదారీ చట్టంలో కూడా కౌలురైతుకు ఎటువంటి హక్కులూ సంక్రమించ కుండా, ఎన్ని సంవత్సరాలు కౌలుకు చేసినా భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా కౌలురైతును బయటికి పంపేలా నిబంధనలను పొందుపరిచారు. అయినా కౌలురైతుల పేర్లు నమోదు చేయటానికి భూ యజమానులు అంగీకరించలేదు. కాబట్టి ఇపుడు కేంద్రం ప్రతిపాదిస్తున్న చట్టానికి అనుగుణంగా కౌలురైతుల పేర్లను నమోదు చేయటానికి భూ యజమానులు అంగీకరిస్తారని భావించటానికి ఆస్కారం లేదు. కొన్నిచోట్ల మౌఖిక ఒప్పందాలు కూడా చట్టబద్ధ ఒప్పందాలుగా పరిగణించబడతాయని చెప్పేదా నికి ఏ మాత్రం విలువ ఉండదు. అందువలన కేంద్రం ప్రతిపాదిస్తున్న ముసాయిదా కౌలుదారీ చట్టంలో చెప్పినట్లుగా దేశంలోని ఏ ప్రాంతంలోనూ కౌలురైతులను నమోదు చేయటం సాధ్యంకాదు. ఆంధ్రరాష్ట్ర కౌలురైతుల చట్టం 2011ను నమూనాగా తీసుకొని ముసాయిదాను రూపొందించినట్లు చెప్పిన కమిటి ఆ చట్టం అమలులో వచ్చిన అనుభవాలను పరిగణనలోకి తీసుకోవపోవటం శోచనీయం. కమిటి నామకా ఆంధ్రప్రదేశ్ కౌలు దారీ చట్టాన్ని గురించి ప్రస్తావించి, అనుభవాలను వదిలివేసింది.

**“ కొన్నిచోట్ల మౌఖిక ఒప్పందాలు కూడా చట్టబద్ధ ఒప్పందాలుగా పరిగణించబడతాయని చెప్పేదా నికి ఏ మాత్రం విలువ ఉండదు. అందువలన కేంద్రం ప్రతిపాదిస్తున్న ముసాయిదా కౌలుదారీ చట్టంలో చెప్పినట్లుగా దేశంలోని ఏ ప్రాంతంలోనూ కౌలురైతులను నమోదు చేయటం సాధ్యంకాదు.”**



**అన్నదాతల ఆత్మహత్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ విజయవాడలో దీక్షలు చేస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు**

కౌలురైతులుగా నమోదైన వారందరికీ బ్యాంకు రుణాలు, బీమా, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో పరిహారం అందుతుందని చెప్పారు. ఇవి కూడా అమలు జరిగే అవకాశం లేదు. ఆంధ్రరాష్ట్రంలో కౌలురైతులుగా నమోదైన వారికి కూడా బ్యాంకులు రుణాలివ్వటానికి అంగీకరించలేదు. భూమిపై యాజమాన్యం లేని కౌలురైతులకు రుణాలిస్తే రుణం తీర్చే గ్యారంటీ ఏమిటనేది బ్యాంకుల వాదనగా ఉన్నది. దిగువస్థాయి అధికారులు ఆ మాట బహిరంగంగా చెప్పకుండా భూ యజమాని అంగీకరిస్తేనే రుణం ఇస్తామని చెబుతున్నారు. కౌలురైతులకు ఇచ్చిన రుణాలలో ఎక్కువ భాగం జాయింటు లయబిలిటి గ్రూపుల ద్వారా ఇచ్చారు మినహా నమోదైన కౌలురైతులకు ఇచ్చిన గుర్తింపు కార్డుల ఆధారంగా ఇవ్వలేదు. బ్యాంకు అధికారులు చేస్తున్న వాదనలకు బ్యాంకులకు యజమానిగా ఉన్న కేంద్ర ప్రభుతం సమాధానం చెప్పాలి. వ్యవసాయం సంక్షోభంలో ఉన్న స్థితిలో మార్కెట్ ఒడిదుడుకులు, ప్రకృతి వైపరీత్యాలు రైతాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరిస్థితులలో కౌలురైతుల తరఫున ప్రభుత్వం హామి ఇచ్చి రుణాలు ఇప్పించాలి. కాని మంత్రులు, అధికార పార్టి నాయకులు కౌలురైతులకు ఎందుకు రుణాలివ్వలేదని బ్యాంకు అధికారులను బహిరంగంగా ప్రశ్నిస్తూ, అంతర్గత సమావేశాల్లో ఏ హామిలేకుండా ఎందుకు రుణాలిస్తున్నారని బ్యాంకర్లను నిలదీస్తుంటే వారేమి చేయగలరు? గత యుపిఏ ప్రభుత్వం కౌలురైతుల పట్ల సానుకూలంగా వ్యవహరించలేదు. ఇపుడు సరళీకరణ విధానాలను మరింత వేగంగా అమలు జరపటానికి ఉరకలు వేస్తున్న బిజెపి ప్రభుత్వం కౌలురైతులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆశించటం భ్రమే అవుతుంది. కేంద్ర ప్రతిపాదిత చట్టంలో కూడా కౌలురైతులకు రుణాలు ఇప్పించే గ్యారంటీ లేదు. పంటల బీమా పథకం అమలు జరగాలంటే వ్యవసాయం కోసం బ్యాంకు రుణం తీసుకొని ఉండాలి. కౌలురైతులకు బ్యాంకులు వ్యవసాయ రుణాలను ఇవ్వకపోతే బీమా పథకం అమలు జరగదు. ఆచరణలో ఇది కూడా పెద్ద ఫార్సుగా ఉన్నది. గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతం లో వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలతో పాటు సంవత్సరమంతా బోర్లద్వారా నీటి సరఫరా ఉ

> “కౌలుదారీ విధానమే పూర్తిగా దోపిడీపై ఆధార పడినది. సంవత్సరం పొడవునా కౌలురైతు కుటుంబం శ్రమచేసి పండించిన పంటను భూ యజమాని దోచుకెళ్ళటమే కౌలుదారి విధాన సారాంశం. కౌలురైతు కుటుంబం చేసిన శ్రమకూడా దక్కకుండా పోయేలా ఈనాడు గ్రామాలలో కౌలు ఒప్పందాలు జరుగు తున్నాయి.”

ండటంతో పసుపు, అరటి, చెరకు, కూరగాయలు, తదితర మెట్ట పంటలు పండుతాయి. అధిక వర్షాలు, తుఫాన్ల బారినపడి రైతులు పంటలు నష్టపోతుంటారు. గత 25 సంవత్సరాలలో ఒక్కసారి కూడా పంటల బీమా పథకం కింద రైతులకు నష్టపరిహారం రాలేదు. ప్రకృతి వైపరీ త్యాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చే రాయితీలు కూడా కౌలురైతుగా నమోదై ఉంటేనే దక్కుతాయి. కేంద్ర ముసాయిదా చట్టంలో ఆర్ఓఆర్‌లో సాగు దారుగా కౌలురైతు పేరు నమోదు కాదని చెప్పారు. మనరాష్ట్రంలో ఆర్ఓఆర్‌ను 1బిగా మార్పు చేశారు. కౌలురైతు పేరు 1బిలో నమోదు కాకుండా ప్రకృతి వైపరీత్యాల పరిహారం అందే అవకాశం ఉండదు. ఇటువంటి నిబంధనను ముసాయిదా చట్టంలో పెట్టి కౌలురైతుకు పరిహారం అందిస్తామని చెప్పటం కౌలురైతును వంచించటమే అవుతుంది.

పంచాయితీ రాజ్ చట్టం, ప్రజాస్వామ్య వ్యవస్థ తో కౌలురైతులు, పేదలు ఆర్థికంగా శక్తివంతులుగా మారారని, కౌలురేట్లపై బేరసారాలు చేసి దోపిడీకి గురికాకుండా చూసుకోగలరని చెప్పారు. కౌలు రైతులు, పేదలు, భూస్వాములు, ధనికులతో సమానశక్తి కలిగిన వారిగా మారారని, కౌలుదారీ విధానంలో దోపిడీ ఉండదని చెప్పేలా ఈ విశ్లేషణ ఉన్నది. ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో అమలు జరిపిన విధానాల వలన వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, పేద, మధ్యతరగతి రైతులు శక్తివంతులు కాలేదు. ఇందుకు భిన్నంగా ఈ తరగతులు బలహీనపడి భూస్వాములు, ధనికులు శక్తివంతులుగా మారారు. గ్రామీణ జీవితం వీరి అదుపాజ్ఞల లోకి పోయింది. గతం కన్నా ఎక్కువగా పేదలు, రైతాంగం వీరిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సక్రమంగా బేరాలు చేసి, ఒప్పందం చేసుకొంటే కౌలు దోపిడి ఉండదని చెప్పారు. కౌలుదారీ విధానమే పూర్తిగా దోపిడీపై ఆధార పడినది. సంవత్సరం పొడవునా కౌలురైతు కుటుంబం శ్రమచేసి పండించిన పంటను భూ యజమాని దోచుకెళ్ళటమే కౌలుదారి విధాన సారాంశం. కౌలురైతు కుటుంబం చేసిన శ్రమకూడా దక్కకుండా పోయేలా ఈనాడు గ్రామాలలో కౌలు ఒప్పందాలు జరుగు తున్నాయి. కౌలు ఒప్పందాలలో భూ యజమాని చెప్పినదే అంతిమ నిర్ణయం అవుతున్నది. అటువంటి కౌలుదారి విధానంలో దోపిడిని పరిమితం చేయటానికి గతంలో పశ్చిమ బెంగాల్‌లోని వామపక్ష ప్రభుత్వం నిర్దిష్టంగా కౌలును నిర్ణయిస్తూ చట్టాలు చేసింది. మరికొన్ని రాష్ట్రాలలో కూడా ఇటువంటి చట్టాలు ఉన్నాయి. ఆ విధంగా చట్టబద్ధంగా కౌలు దోపిడీపై పరిమితు లను విధించటానికి కూడా కమిటి పూనుకోలేదు. గ్రామీణ ప్రాంతంలో యధేచ్ఛగా జరుగుతున్న కౌలుదోపిడీ వలన అపారమైన సంపద వ్యవసాయ ఉత్పత్తిలో ప్రత్యక్షంగా పాల్గొనని వారికి చేరు తున్నది. కమిటి అంచనా ప్రకారమే దేశంలో కౌలుదారీ కుటుంబాలు కోటి నలభై లక్షలున్నాయి. వాస్తవంలో ఇంతకు రెట్టింపుకు పైగా ఉంటాయి. ఈ కుటుంబాలన్నీ ఉత్పత్తి చేసిన సంపద ఇతరుల వద్దకు చేరటంతో వీరు కొనుగోలు శక్తిని కోల్పో తున్నారు. ఇది పారిశ్రామికాభివృద్ధిపైనా, గ్రామీణ ప్రాంతంలో ప్రజాస్వామిక శక్తుల అభివృద్ధిపైనా ప్రభావం చూపుతున్నది.

జిడిపిలో 14 శాతం వ్యవసాయ రంగం నుండి వస్తుండగా మొత్తం శ్రామికుల్లో 49 శాతం, గ్రామీణ శ్రామికుల్లో 64 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని, అందువలననే గ్రామీణ ప్రాంతంలో తలసరి ఆదాయం తక్కువగా ఉన్నదని, దరిద్రం ఎక్కువగా ఉన్నదని కమిటి చెప్పింది. ఈ పరిస్థితి మారాలంటే వ్యవసాయ రంగం నుండి వ్యవసాయేతర రంగాలకు శ్రామికు లను మార్చాలని చెప్పింది. సరైన ప్రణాళిక, ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా వ్యవసాయ రంగం నుండి ఇతర రంగాలకు శ్రామికులను తరలించటం సాధ్యం కాదు. ప్రస్తుతం వ్యవసాయ రంగం నుండి వ్యవసాయేతర రంగాలలో ఉపాధిని వెతుక్కుంటూ వెళు తున్నవారు అత్యంత నికృష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలకు కార్మిక హక్కులను పరిరక్షించాలనే దృక్పథం లేకపోవటం వలన పట్టణాలలోని రియల్ ఎస్టేట్ రంగం, ఇతరంగా పనులు చేస్తున్న వారిలో ఎక్కువ మంది గ్రామాలలో కన్నా నికృష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలలో పనిచేస్తున్న వారు కూడా దుర్భర పరిస్థితులను అనుభవిస్తు న్నారు. పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంటే నూతన పరిశ్రమల నిర్మాణం, పెద్దసంఖ్యలో నూతన కార్మికుల అవసరం పెరుగుతుంటే ఎవరూ చెప్పకుండానే గ్రామీణ శ్రామికులు పట్టణాలకు వలసలు పోతారు. ఆ విధమైన పారిశ్రామికాభివృద్ధిని సాధించటానికి శ్రామికుల కొనుగోలు శక్తిని హరిస్తున్న కౌలుదోపిడి కూడా ఆటంకంగా ఉన్నది. కమిటి చేసిన ప్రతిపాదనలు ఈ ఆటంకాన్ని తొలగించే విధంగా కాకుండా దానిని మరింత పెంచేలా ఉన్నాయి. వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నవారి ఆదా యాలను పెంచాలని చెబుతున్న కమిటి అందుకు నిర్దిష్టంగా సూచనలు చేయలేదు. అయినా కేంద్రం, వివిధ రాష్ట్రాలు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే బహుళజాతి, కార్పొరేట్ సంస్థలను వ్యవసాయ రంగంలోకి తీసుకురావటం ద్వారా ఆదాయాన్ని పెంచాలనే ధోరణి కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే యఫ్‌పిఓల పేరుతో వ్యవసాయ రంగంలోకి బహుళజాతి, కార్పొరేట్ కంపెనీల ప్రవేశానికి ద్వారాలు తెరిచింది. కేంద్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి, కార్పొరేట్ కంపెనీలను ప్రవేశపెట్టటానికి ప్రయత్నం చేస్తున్నది. వీరి ప్రవేశం వలన భూమి రైతుల చేతుల్లో నుండి బహుళజాతి, కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి మారుతుంది. వ్యవసాయంలోకి యంత్రాల ప్రవేశం పెరుగుతుంది. అపుడు వ్యవ సాయాదాయం పెరిగినా రైతులకు, కూలీలకు దక్కదు. గ్రామీణ జీవితంలో దారిద్ర్యం మరింత పెరుగుతుంది.

కమిటి చెప్పినట్లుగా భూములను సమర్ధ వంతంగా వినియోగించుకోలేకపోవటానికి కారణమెవరు? ప్రభుత్వాలే ఇందుకు బాధ్యత వహించాలి. మనదేశంలో సాగుకు యోగ్యమైన భూమి 15,73,50,000 హెక్టార్లు ఉన్నది. ప్రపంచంలో అమెరికా తర్వాత అత్యధికంగా

> ❝ హ్రస్వదృష్టితో తీసుకున్న ఈ చర్యలు గ్రామీణ ప్రాంతంలో దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక పరిణామాలకు దారితీశాయి. గ్రామీణ దారిద్ర్యాన్ని నిర్మూలించటానికి, కులపరమైన అసమానతలను అంతం చేయటానికి ఉన్న అవకాశాలను వమ్ము చేశాయి. ❞

సాగుభూమి ఉన్నదేశం మనది. అయినా ఉత్పాదకతలో వెనుకబడి ఉన్నాం. చైనాలో మనకన్నా తక్కువ సాగుభూమి ఉన్నది. అయినా ధాన్యం, గోధుమలు మనకన్నా 40 శాతం అదనంగా పండిస్తున్నారు. పండ్లు మూడురెట్లు ఎక్కువ పండిస్తున్నారు. ఉత్పాదకత రీత్యాచూస్తే మనం హెక్టారుకు 2.4 టన్నుల ధాన్యాన్ని పండిస్తుండగా చైనా 4.7 టన్నులు, బ్రెజిల్ 3.6 టన్నుల చొప్పున పండిస్తున్నాయి. ధాన్యం దిగుబడిలో 47 దేశాలలో మనదేశం 27వ స్థానంలో ఉన్నది. గోధుమ ఉత్పత్తిలో హెక్టారుకు 3.15 టన్నులతో 41 దేశాలలో 19వ స్థానంలో ఉన్నది.

వ్యవసాయోత్పత్తిని పెంచటం, భూములను సక్రమంగా వినియోగించుకోవటాన్ని గురించి ఇప్పటి వరకు పాలించిన ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టలేదు. దేశంలో వ్యవసాయోత్పత్తి పెరగక పోవటానికి భూసంస్కరణలు అమలు జరపక పోవటం ప్రధాన కారణం. భూసంస్కరణలు అమలు జరిగి, దున్నేవాని చేతికి భూమి వస్తే రైతులు తమ స్వంతభూమిలో ఉత్సాహంతో పనిచేసి, ఉత్పత్తిని పెంచటానికి పూనుకొనేవారు. పశ్చిమ బెంగాల్‌లో 1977లో వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సంస్కరణలను, కౌలుదారి చట్టాలను అమలు చేయటం వలన ఉత్పత్తి వేగంగా పెరిగి, ధాన్యం, బంగాళా దుంప లను పండించటంలో దేశంలో మొదటి స్థానంలోకి చేరింది. బెంగాల్‌లో వలెనే దేశంలో చట్టాలకను గుణంగానే భూసంస్కరణలను, కౌలుదారీ చట్టాలను అమలు చేసినా వ్యవసాయ రంగంలో ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు ఆటంకంగా ఉన్న ఫ్యూడల్ సంకెళ్ళు కొంతమేరకైనా బద్దలయి, వ్యవసా యోత్పత్తి పెరిగేది. దేశ ప్రజానీకానికి అవసరమైన ఆహారధాన్యాల ఉత్పత్తిని పెంచటానికి, పారిశ్రామిక రంగానికి అవసరమైన ముడి సరుకులను ఉత్పత్తి చేయటానికి ఈ చర్యలు దోహదం చేసేవి. ఆహారధాన్యాలు, వ్యవసాయోత్పత్తులను పెంచటా నికి దోహదంచేసే శక్తులపై ఆధారపడటం కాకుం డా, భూస్వాములు, ధనిక రైతులపై ప్రభుత్వం ఆధారపడింది. ఫలితంగా వ్యవసాయ ఉత్పాదకత కుంటుబడి, ఉత్పత్తి నత్తనడకతో సాగుతున్నది. హ్రస్వదృష్టితో తీసుకున్న ఈ చర్యలు గ్రామీణ ప్రాంతంలో దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక పరిణా మాలకు దారితీశాయి. గ్రామీణ దారిద్ర్యాన్ని నిర్మూలించటానికి, కులపరమైన అసమానతలను అంతం చేయటానికి ఉన్న అవకాశాలను వమ్ము చేశాయి. గ్రామీణ ప్రాంతంలో అభివృద్ధి నిరోధక శక్తులు మరింత బలపడటానికి అవకాశాలను కల్పించాయి.

వ్యవసాయోత్పత్తిని పెంచటంలో భూమి తర్వా త విత్తనాలు, సాగునీరు, ఎరువులు, పురుగు మందులు ప్రధానపాత్ర వహిస్తాయి. వ్యవసా యోత్పత్తి పెంపుదలలో 20 నుండి 25 శాతం వరకు విత్తనాల ప్రభావం ఉంటుంది. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించటానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు అత్యంత పరిమితంగా ఉన్నాయి. హరిత విప్లవకాలంలో విత్తన పరిశోధన లపై కొంతమేరకు దృష్టి పెట్టినా, సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత ప్రభుత్వపాత్ర పరిమితమైంది. విత్తన పరిశోధన, అభివృద్ధిలో బహుళజాతి, ప్రైవేటు సంస్థలకు పెద్దపీట వేసింది. ప్రభుత్వ రంగంలో వరి విత్తనాలపై పరిశోధనలు జరుగుతున్నా 25 సంవత్సరాల క్రితం వచ్చిన బిపిటి అంతటి ఉత్పాదకతను పెంచే విత్తనాలు ఆ తర్వాత రాలేదు. క్రమంగా వరి విత్తన పరిశోధనలు కూడా ప్రైవేటు సంస్థల చేతుల్లోకి పోతున్నాయి. పత్తి, మిర్చి, మొక్కజొన్న, జొన్న, తదితర పంటల విత్తనాలలో బహుళజాతి, ప్రైవేటు సంస్థలు పెత్తనం చేస్తున్నాయి. వారికి లాభాలు సంపాదించటంపై ఉన్న ఆసక్తి నాణ్యమైన విత్తనా లను అభివృద్ధి చేయటంలో ఉండదు. వాణిజ్య పంటల దిగుబడిలో గణనీయమైన మార్పులను తెచ్చే విత్తనాలను గత రెండు దశాబ్దాలలో ప్రైవేటు సంస్థలు కూడా రూపొందించలేదు. నీటిపారుదల విషయంలో కూడా ప్రభుత్వాలు క్షమించరాని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. దేశంలో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని, సాగుభూమి అంతటికీ నీటిని సరఫరా చేయటానికి తగిన ప్రణాళికలు రూపొందించలేదు. ప్రణాళికా బద్ధంగా నిర్మించటానికి పూనుకున్న సాగునీటి ప్రాజెక్టులు కూడా ప్రభుత్వాల ఉదాసీనతతో నిర్ణీతకాలం


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

> **" గతంలో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో పాలించిన, ప్రస్తుతం త్రిపురలో పాలిస్తున్న వామపక్ష, వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వాలు చట్టాల ఆధారంగా సాగుభూమిని పంచటం, కౌలురైతులకు హక్కులను కల్పించటం చేశాయి. ఇపుడు చట్టంలో అభ్యుదయకరమైన అంశాలను తొలగిస్తే అటువంటి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది"**



**గుంటూరుజిల్లా లాంలో వ్యవసాయ యూనివర్శిటీ శంకుస్థాపన సందర్భంగా తరలి వచ్చిన ప్రముఖులు**

దాటి ఏళ్ళూపూళ్ళూ గడిచినా పూర్తికా లేదు. ఫలితంగా 2009 నాటికి 35.12 శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సదుపాయం ఉన్నది. జీవనదుల్లోని నీటిని సక్రమంగా వినియో గించుకోలేక పోవటంతో అధికవర్షాలు పడినపుడు వరదలు వచ్చి పంటలను, ఊళ్ళను ముంపుకు గురిచేసి అపారనష్టాన్ని కలిగిస్తూ వృధాగా సముద్రంలో కలిసిపోతుండగా, మరోవైపు సాగునీరందక పంటలు దెబ్బతింటు న్నాయి. కరువులు విలయతాండవం చేస్తున్నా యి. ఎరువుల ధరలు విపరీతంగా పెరగటం తో రైతాంగం కాంప్లెక్స్ ఎరువులు కొనలేక యూరియాను విస్తారంగా వినియోగం చటంతో భూసారం దెబ్బతింటున్నది. బహుళ జాతి సంస్థలు తమ దేశాలలో నిషేధించిన పురుగు మందులను మనదేశంలో అమ్ముతూ వ్యవసా యోత్పత్తుల నాణ్యతను, ప్రజల ఆరోగ్యా న్ని, పర్యావరణాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఈ విధంగా వ్యవసాయోత్పత్తి పెరగకపోవటంలో ప్రధాన బాధ్యత ప్రభుత్వాలే వహించాల్సి ఉంది.

ప్రభుత్వాలు అనుసరించిన ఈ విధమైన వ్యవసాయ విధానాలు పారిశ్రామికాభివృద్ధి అవకాశాలను కుదించాయి. ప్రభుత్వం భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి, వ్యవసాయ కార్మికులు, కౌలు, పేద, మధ్య తరగతి రైతులకు భూములను పంచకపోవటంతో గ్రామీణ ప్రాంతంలో విస్తా రంగా ఉన్న ప్రజల కొనుగోలు శక్తి పెరగలేదు. ఫలితంగా మార్కెట్ విస్తరణకు, పారిశ్రామికాభి వృద్ధికి పరిమితులు ఏర్పడ్డాయి. ఇది మొత్తంగా దేశీయ మార్కెట్ కుదించుకు పోవటానికి దారి తీసింది. ప్రస్తుతం కమిటి చేసిన ప్రతిపాదనలు గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిని, పారిశ్రామికా భివృద్ధిని మరింతగా దెబ్బతీస్తాయి. ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియాను గురించి తీవ్రంగా ప్రచారం చేస్తున్నది. విస్తారమైన గ్రామీణ ప్రాంతంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా మేక్ ఇన్ ఇండియా జయప్రదం కావటం అసంభవం.

కేంద్రంలోనూ, అనేక రాష్ట్రాలలో అధికా రంలో ఉన్న ప్రభుత్వాలు పారిశ్రామికీకరణ పేరుతో రైతుల నుండి బలవంతంగా భూములను లాక్కొని బహుళజాతి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టటం కోసం ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవటం లేదు. పారిశ్రామికీకరణ జరుగుతుందనే గ్యారంటి కూడా లేదు. పరిశ్రమలు రాకుండానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంకును ఏర్పాటు చేస్తానని ప్రకటించింది. కేంద్రం 2013 భూసేకరణ చట్టానికి తీసుకురావటానికి ప్రయ త్నించిన సవరణలలో రైల్వే లైన్‌లు, ప్రధాన రోడ్లకు కిలోమీటరు దూరం వరకు భూములను స్వాధీనంచేసుకుంటా మని ప్రకటించింది. ఇవి పారిశ్రామి కీకరణకు దోహదం చేయవు. ఈ విధంగా భూమిని తీసుకోవటం వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతానికి పెనుశాపంగా పరిణమిస్తుంది.

జాతీయోద్యమ కాలంలోనూ, అనంతరం అభ్యుదయకరమైన కౌలుదారి చట్టాల కోసం దశాబ్దాల పాటు జరిగిన రైతాంగ ఉద్యమాల వలన ప్రభుత్వాలు భూ సంస్కరణల చట్టాలను, కౌలుదారీ చట్టాలను తీసుకొచ్చాయి. గతంలో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో పాలించిన, ప్రస్తుతం త్రిపురలో పాలిస్తున్న వామపక్ష, వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వాలు చట్టాల ఆధారంగా సాగుభూమిని పంచటం, కౌలురైతులకు హక్కులను కల్పించటం చేశాయి. ఇపుడు చట్టంలో అభ్యుదయకరమైన అంశాలను తొలగిస్తే అటువంటి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. కేంద్రం, రాష్ట్రాలలో గతంలో పాలించిన ప్రభుత్వాలు ఈ చట్టాలను అమలు చేయక పోయినా వాటిని రద్దుచేయటానికి సాహసించ లేదు. ఈనాటి బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలో వలేనే వ్యవసాయరంగంలో కూడా ప్రతీఘాతుక దాడిని కొనసాగిస్తున్నది. ఈదాడిని తిప్పికొట్టి, ఇప్పటి వరకు సాధించిన విజయాలను కాపాడుకోవటంపైనే గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, పేద, మధ్యతరగతి రైతుల జీవితాలు మెరుగుపడటం ఆధారపడి ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో సామాజిక, అభ్యుదయ ఉద్యమాలు ఎంత వేగంగా ముందుకు పోతాయనే అంశం కూడా దీనిపైనే ఆధారపడి ఉంటుంది. ❋

# అభివృద్ధిలో వెనుకవరుసన మహిళా శ్రేయస్సు

అనిందితాసేన్ గుప్తా



రచయిత హుగ్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్

ఆదాయం, ప్రాపంచిక సంపద రెండూ అవసరాలే అయినప్పటికీ ప్రజల శ్రేయస్సుకు, సంక్షేమానికి ఇవి మాత్రమే సరిపోవు. మరీ ముఖ్యంగా అభివృద్ధి తక్కువగా ఉన్న ప్రాంతాలలో, అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో, వ్యక్తిగత స్థానాలలోనూ, బాహ్య పరిస్థితుల వైపు మొగ్గు చూపడంలోనూ, లభిస్తున్న వనరులను వినియోగించుకోవడంలోనూ తేడాలుంటాయి.

ఆలోచనా శక్తి, మానవ వికాసం వైపు అభివృద్ధి, వస్తు ఉత్పత్తి, సేవలలో ముందంజ, మానవ అభివృద్ధికి తప్పనిసరని అమర్త్యసేన్ అంగీకరిస్తారు. మానవ వికాసం పట్ల సేన్ ఆలోచన, వాదన ప్రకారం సంపద అంటే భౌతికంగా మానవులు సంపాదించేది కాక అంతకు మించినది. మంచి జీవితాన్ని ఆస్వాదించడానికి అవకాశాలు కలుగజేసేది తప్ప కనీస అవసరాల కోసం సంపదను సమకూర్చుకోవడం కాదు. ఏ వ్యక్తైనా (స్త్రీ లేదా పురుషుడు) తనకెటువంటి జీవితం కావాలో నిర్ణయించుకొని, దానిని సాధించుకోవడంలో స్వేచ్ఛ ఉండాలి తప్ప, నిత్యావసరాలను సమకూర్చుకోవడం అభివృద్ధి అవ్వదు.

శ్రేయస్సు, సౌఖ్యం, సంక్షేమం అనేవి భిన్నపార్శ్వాలు కలిగిన భావనలు. విభిన్నమైన అంశాలు ఇందులో ఇమిడి ఉంటాయి. ఆర్థికావసరాలయిన ఆదాయం, సంపద, వినియోగం మొదలగునవి జీవనస్థాయిని కొలవటానికి మొరటు పద్ధతులు. మనిషి నాణ్యంగా జీవించడానికి నిజంగా ఏం కావాలో అవేవీ పైన పేర్కొన్నవి ఇవ్వలేవు. ఒకే రకమైన ఆదాయం, సంపద మానవులకు ఒకేస్థాయి గల జీవితాన్ని ఇవ్వలేవు. అంటే నాణ్యమైన జీవితాన్ని అనుభవించడానికి ప్రాపంచిక విషయాలకన్నా భిన్నమైనవి ఉంటాయి. ఆరోగ్యం, సమతుల ఆహారం, విద్య, సామాజిక సంబంధాలు, సాధికారత మొదలగునవి ప్రామాణికమైన జీవితాన్నివ్వడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. ప్రస్తుత అధ్యయనమంతా ఈ కోణంలోనే సాగుతుంది.

వ్యక్తి తన ఆకాంక్షల కనుగుణంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోవడంలోనూ, చేపట్టిన కార్యక్రమాల వలన, పెరిగిన జీవన ప్రమాణాలను బట్టి ఒక వ్యక్తియొక్క శ్రేయస్సు ఆధారపడి ఉంటుంది. దీనినే "పనితీరు" అంటాము. సామర్థ్యంతో పాటు ప్రపంచంతో ఉన్న సంబంధ బాంధవ్యాలు, చేసే పనులు మొదలగునవన్నీ ఇందులోనే నిబిడీకృతమై ఉంటాయి. ఏ వ్యక్తికైనా లభించే అవకాశాల కనుగుణంగా సామర్థ్యాలు వృద్ధి చెందుతూ, మంచి నాణ్యత గల జీవితాన్నిస్తాయి. అవకాశాల కనుగుణంగా సామర్థ్యాలు వృద్ధి చెందితే, ఆ వ్యక్తికి లభించే స్వేచ్ఛను బట్టి పనితీరు అభివృద్ధి చెందుతుంది. స్థలం, వ్యక్తిత్వ లక్షణాలకు కూడా సంబంధితమై ఉంటాయి. ఉదా:- ఆరోగ్యం, లింగం, ఆర్థిక, సాంఘిక స్థితిగతులు, ఆ వ్యక్తి ఉన్న వ్యవస్థ, లభించే వనరులను ఉపయోగించుకోవడం, వయస్సు, కుటుంబంలో హోదా, సమిష్టి కుటుంబమా? వ్యష్టి కుటుంబమా? కులమూ, మతమూ, గ్రామీణ నేపథ్యమా; పట్టణ నేపథ్యమా? వ్యవసాయ వాతావరణం మొదలగు అంశాలు ప్రభావితం చేస్తాయి.

అభివృద్ధి దిశగా సేన్ యొక్క దృష్టికోణం సాంప్రదాయక స్థూల జాతీయోత్పత్తికి భిన్నంగా ఉంటుంది. వ్యక్తి శ్రేయస్సును జిడిపి దిశలోగాక, సామాజిక, ఆర్థిక సూచికల ఆధారంగా లెక్కించడానికి ప్రయత్నాలు జరిగాయి. 1990లో అంతర్జాతీయ స్థాయిలోని ఉత్థాన పతనాల కనుగుణంగా మానవాభివృద్ధి సూచికలను తీర్చిదిద్దడం జరిగింది. హెచ్‌డిఐ, యుఎన్‌డిపిలపై వచ్చిన విమర్శలను సేకరించి, 1997లో హెచ్‌డిఐ స్థానంలో హెచ్‌పిఐ, అనగా మానవ పేదరిక సూచికను నిర్మించి అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ, పారిశ్రామిక దేశాలలోనూ ఉపయోగించడం జరిగింది. సిద్ధాంతపరమైన పునాదులను నిర్మించడానికి అంతర్జాతీయంగా జీవన విధానాలను పోల్చి చూడటానికి ఉపయోగించే కీలక అంశాలు జీవన ప్రమాణాలు, నాణ్యమైన జీవితం.

హెచ్‌డిఐ ఆధారిత ర్యాంకులు మానవ శ్రేయస్సు సూచికలయినప్పటికీ, స్థూల జాతీయోత్పత్తి ఆధారిత ర్యాంకులకు దూరమే. జాతీయ, అంతర్జాతీయ అభివృద్ధికి మార్గదర్శకాలు మాత్రమే. ఈ సూచికలు పనితీరుని లెక్కించడానికి, సిద్ధాంత రచనలకు ఉపయోగపడతాయి. ఉదా:- ప్రజల ఆరోగ్యం, విద్య కోసం ఖర్చుపెట్టే జిడిపి శాతం, ఒక్కో ప్రాంతంలోని డాక్టర్లు, ఫిజిషియన్లు, వయస్సు ప్రాతిపదికగా జనాభా లెక్కలు, ప్రాథమిక విద్య కోసం నమోదు చేయబడిన విద్యార్థులు, ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తి, బాల కార్మికుల సంఖ్య, వయోజన విద్య నభ్యసించిన పెద్దలు మొదలగునవి. పై స్థాయిలో పాలసీలను తయారు చేయడానికి ఈ లెక్కలన్నీ తప్పనిసరిగా అవసరం.

ఈ విధానంలో వ్యక్తుల శ్రేయస్సు పట్ల అంతర్గత దృష్టి చాలా తక్కువగా ఉంటుంది. స్థూల విధానంలో వేసే లెక్కల వలన వ్యక్తుల శ్రేయస్సును లెక్కించడంలో అసమానతలుంటాయి. అందువలన వ్యక్తి ఆధారిత గణాంకాలే అభివృద్ధి సాధక అధ్యయనాలవుతాయి.

1990 దశకం రెండవ అర్ధభాగంలో ఇటలీ, చిలీ వంటి దేశాలలో వ్యక్తుల శ్రేయస్సును గణనలోకి తీసుకోవడానికి వ్యక్తి ఆధారిత గణాంకాలను తీయవలసిన అవసరం

"మజుందార్ చేపట్టిన అధ్యయనంలో భారతదేశం లోని స్త్రీ, పురుషుల శ్రేయస్సు ఏయే ప్రధానాంశాలపై ఆధారపడి ఉన్నదో చర్చిం చింది. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని పనితీరుని సరిపోల్చుతూ అధ్యయనం సాగింది. 2005-2006 మధ్యకాలంలో జరిగిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆధారంగా లెక్కించ బడింది."



ఉత్తరాఖండ్ కొండప్రాంతాల్లో వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటున్న మహిళలు

ఏర్పడింది. మజుందార్ 2007వ సంవత్సరంలో భారత దేశంలో ఓ అధ్యయనం చేపట్టాడు. మార్టినెట్టి సూచించిన పట్టికల ఆధారంగా "భారతీయ స్త్రీల శ్రేయస్సు"పై నివేదిక తయారు చేశారు. భారతీయ మహిళలు సాధించిన విజయాల ఆధారంగా ప్రధానంగా మజుందార్ విశ్లేషణ కొనసాగింది. స్త్రీలు, పురుషులు సాధించిన విజయాలను సరిపోల్చుతూ అధ్యయనం సాగగా, మత ప్రాతిపదికన, సాంఘిక హోదాల ఆధా రంగా సైతం ఈ అధ్యయనం సాగింది. భారత దేశంలో కేవలం కొన్ని అధ్యయనాలు మాత్రమే శాస్త్రీయ అవగాహనతో జరగడం విషాదకర మైన విషయం.

మజుందార్ చేపట్టిన అధ్యయనంలో భారతదేశంలోని స్త్రీ, పురుషుల శ్రేయస్సు ఏయే ప్రధానాంశాలపై ఆధారపడి ఉన్నదో చర్చిం చింది. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని పనితీరు ని సరిపోల్చుతూ అధ్యయనం సాగింది. 2005-2006 మధ్యకాలంలో జరిగిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆధారంగా లెక్కించ బడింది. క్షేత్రస్థాయిలోని మానవ హక్కులను పరిరక్షిస్తూ, వారి పనితీరును సమీక్షిస్తూ సూచిక లు తయారు చేయబడ్డాయి.

ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక స్పృహ, స్వయం నిర్ణయాధికారం, గృహహింస నుండి స్వీయ రక్షణ పొందగలగడం, ఈ ఆరు అంశాల ఆధారంగా స్త్రీల యొక్క పనితీరును గణనలోకి తీసుకోవడం జరిగింది. మగవారి విషయంలో ఆరోగ్యం, చదువు, ఉపాధి, సామా జిక స్పృహ, స్వీయ నిర్ణయాధికారం, స్వేచ్ఛను పరిగణనలోకి తీసుకున్నారు.

భారతదేశంలో 28 రాష్ట్రాలలోని స్త్రీ పురుషుల శ్రేయస్సుపై సేకరించిన గణాంకాల సరాసరిని లెక్కించి, వాటి ఆధారంగా ర్యాంకులి వ్వడం జరిగింది. 2005-06లో సేకరించిన రాష్ట్రాల స్థూల ఉత్పత్తికి కూడా ర్యాంకులివ్వడం జరిగింది. ఎన్ఎస్‌డిపి మరియు స్త్రీ, పురుషుల శ్రేయో సూచికలను సరిపోలుస్తూ, ర్యాంకులివ్వ డం జరిగింది.

**శ్రేయో సూచికలను లెక్కించడం విధానం, గణాంకాలు...**

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వారు 2005-06లో నిర్వహిం చిన యూనిట్ ఆధారిత గణాంకాలను ఈ అధ్యయనాలలో పరిగణనలోకి తీసుకోవటం జరిగింది. దేశంలోని 28 రాష్ట్రాల నుంచి 1,94,106 మంది వ్యక్తులను శాంపిల్ కోసం తీసుకోవడం జరిగింది. ఇందులో 62 శాతం మహిళలు కాగా, 38 శాతం పురుషులు. మహిళలపై జరిపిన శాంపిల్ సర్వేలో కుటుంబ నేపథ్యం, పెంపకం, పునరుత్పత్తి స్వభావం, ఆసక్తి, వివాహం, సహచరిత్వం, గర్భనిరోధక సాధనాల వాడకంపై అవగాహన, వ్యక్తిగత ఆరోగ్యం విషయంలో అనుసరించే శుభ్రత, వైద్య సిబ్బందితో పరిచయాలు, ప్రసవానికి ముందు, తర్వాత తీసుకునే జాగ్రత్తలు, వైద్య సిబ్బందిని ఉపయోగించుకొనే తీరు, సామాన్య ఆరోగ్యం, బాలల వ్యాధి నిరోధక శక్తిపై జ్ఞానం, బిడ్డల సంరక్షణ, ఆరోగ్యం, పాలిచ్చే విధానం, మహిళల, బిడ్డల పోషకాహారం పట్ల అవగాహన, బాలల కోసం ఉన్న సౌకర్యాల పట్ల జ్ఞానం, భర్తయొక్క హింసాత్మక ప్రవృత్తి, లైంగిక జీవితం, హెచ్ఐవి - ఎయిడ్స్ మొదలగు సుఖ వ్యాధులను పరిగణనలోకి తీసుకున్నారు. పురుషుల విషయంలో కుటుంబ నేపథ్యం, పునరుత్పత్తి పట్ల ఆలోచన, గర్భనిరోధక పద్ధతులను ఉ పయోగించే విధానం, ఆరోగ్యం విషయంలో ఆసక్తి, లైంగిక జీవితం, ఆరోగ్యం, పోషకాహారం, స్త్రీ పురుష వ్యత్యాసాల పట్ల ఆలోచనా విధానం లెక్కించడం జరిగింది. స్త్రీ, పురుషుల శ్రేయో సూచికలను తయారు చేయడంలోనూ, గణాం కాల సేకరణ సమయంలోనూ, ప్రజల ప్రాథమిక హక్కులు, పౌర హక్కులను ఉల్లంఘించకుండా శ్రద్ధ తీసుకోవడం జరిగింది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ ఆధారంగా స్త్రీ పురుషుల పనితీరును లెక్కించడానికి ఆరు సూచికలను ఎంపిక చేయడం వాటి ఆధారంగా మహిళల నుండి, పురుషుల నుండి వేరుగా శాంపిల్స్ సేకరించి పనితీరుని గణించడం జరిగింది.

**పురుషుల కొరకు...**

ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక స్పృహ, స్వయం ప్రతిపత్తి, స్వేచ్ఛ అంశాలను పరిగణనలోకి తీసుకొని పురుషుల పనితీరుని గమనించడం జరిగింది. ఎన్ఎఫ్‌హెచ్‌సి గణాం కాల ఆధారంగా, ఆరు సూచికలను తయారు చేసి, పనితీరుని లెక్కించారు. 1) పోషకాహార లోపం, రక్తహీనత, ట్యూబర్ క్యూలోసిస్, ఆస్మా, డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలు లేకుంటే వారు ఆరోగ్యవంతులు. 2) ప్రాథమిక విద్యాభ్యాసం

చేసినా విద్యవంతుడే. 3) ఏ విధమైన జీవనోపాధి ఉన్నా అతని ఉపాధి గలవాడే! 4) దినపత్రికలు చదవడం, రేడియో వినడం, టెలివిజన్ చూడడం అలవాటుంటే అతనికి సామాజిక చైతన్యం, స్పృహ ఉన్నట్లే 5) స్వీయ నిర్ణయాధికారం, స్వయం ప్రతిపత్తిని కలిగి ఉండటాన్ని ఎన్ఎఫ్ హెచ్ఎస్ ఈ క్రింది విషయాలను పరిగణనలోకి తీసుకొని లెక్కించింది. తన ఆదాయాన్ని అతను తనకోసం ఖర్చు చేసుకొనే తీరు, గృహావసరాలకు కావల్సిన పెద్ద వస్తువులు, నిత్యావసరాలు, ఆరోగ్యం కోసం తనమీద పెట్టుకునే ఖర్చు, ఇవన్నీ తన భార్యతో సమానంగా హక్కు కలిగి ఉంటే అతను స్వయం ప్రతిపత్తి కల వ్యక్తి. భార్య సంపాదనపై అతను తీసుకునే నిర్ణయాల ఆధారంగా సైతం విషయ సేకరణ జరిగింది. భార్య ఆదాయం, ఆమెకు నచ్చిన విధంగా ఖర్చు చేసుకోనివ్వడం, లేదా ఇరువురూ కలిసి ఎలా ఖర్చు చేయాలో నిర్ణయించుకోవడం ఆధారంగా అతను స్వేచ్ఛా ప్రియుడా? కాదా అని లెక్కించడం జరిగింది. భార్య సంపాదనపై హక్కు తనదేనని, ఖర్చుచేసే విషయంలో నిర్ణయం అతనిదే అయితే అతను స్వేచ్ఛను గౌరవించని వ్యక్తిగా పరిగణించారు.

**మహిళల కొరకు...**

ఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక చైతన్యం, స్వయం ప్రతిపత్తి, గృహహింసకు లోనవ్వకుండా క్షేమంగా ఉండటం, మొదలగు ఆరు అంశాల ఆధారంగా మహిళల పనితీరుని లెక్కించారు. ఎన్ఎఫ్హెచ్ఎస్ సేకరించిన గణాంకాల ఆధారంగా ఆ సూచికలను పయోగించి గణించడం జరిగింది. 1) రక్తహీనత, ట్యూబర్ క్యులోసిస్, ఆస్మా, డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలు లేకుండా ఆరోగ్యవంతురాలైన మహిళ 2) ప్రాథమిక విద్య కలిగియున్నా విద్యావంతురాలే. 3) ఏ విధమైన జీవనోపాధి కలిగియున్నా ఉపాధి కలిగి ఉన్నట్లే. ఇంటిపనికి ఏ విధమైన ఆదాయం లభించదు కనుక గృహిణులు ఇంట్లో చేసే పనిని ఉపాధిగా లెక్కించలేదు. 4) దినపత్రికల పఠనం, టెలివిజన్ చూడటం, రేడియో వినడమన్న మూడు లక్షణాలుంటే ఆమె చైతన్యవంతమైన మహిళే! 5) నిర్ణయాధికారం విషయానికొచ్చేసరికి తన ఆదాయాన్ని ఆమె తనకై ఖర్చుపెట్టుకునే తీరు, గృహోపకరణాల ఖరీదు, నిత్యావసరాల కొనుగోలు, తన ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టుకునే విషయాలలో ఆమె సొంతంగా నిర్ణయం చేసుకోగలగడం లేదా తన భర్తతో సమానంగా నిర్ణయాలలో పాల్గొనడం జరిగితే ఆవిడకు స్వయం ప్రతిపత్తి, స్వయం నిర్ణయాధికారం ఉన్నట్లు. 6) గృహహింసకు సంబంధించి ఎన్ఎఫ్హెచ్ఎస్ వివిధ అంశాలను సేకరించింది. ఎ) భర్త ఎప్పు డయినా తోసినా, విదిలించినా, ఆమెపై ఏదయి నా విసిరినా, చెంపదెబ్బ కొట్టినా, ముష్టిఘాతం విసిరినా, కొట్టినా, ఈడ్చినా, అగ్నితో కాల్చె య్యాలని ప్రయత్నించినా, తుపాకీతో బెదిరిం చినా, చంపేయాలని చూసినా, భార్య ఇష్టం లేకుండా లైంగికంగా అనుభవించినా, లైంగిక చేష్టలు చేసినా, వేధించినా, చేతిని మెలిత్రిప్పినా, జుట్టులాగినా, బి)తల్లిగానీ, సవతి తల్లిగానీ, తండ్రిగానీ, సవతి తండ్రిగానీ, కొడుకు లేదా కూతురు, సహోదరి లేదా సోదరుడు, బంధువులు సి) అత్తగారు, మామగారు లేదా అత్తింటికి సంబంధించిన ఆడబడుచు, మరిది, బావ, వదిన లు చేసినా ఆమె గృహహింసకు గురవుతున్నట్లే.

> “స్త్రీపై ఎవరు ఎలాంటి హింసకు పాల్పడి నా ఆమె గృహహింస బాధితురాలే. పైన పేర్కొన్న అంశాలకు లోనవ్వని మహిళ గృహహింసకు లోనవ్వనట్లే... కనీసం ఒక్క ప్రశ్నకైనా ఆమె సమాధానం “నిజం లేదా అవును” అని వస్తే ఆమెను గృహహింస బాధితురాలిగానే పరిగణిం చడం జరిగింది.”

స్త్రీపై ఎవరు ఎలాంటి హింసకు పాల్పడి నా ఆమె గృహహింస బాధితురాలే. పైన పేర్కొన్న అంశాలకు లోనవ్వని మహిళ గృహహింసకు లోనవ్వనట్లే... కనీసం ఒక్క ప్రశ్నకైనా ఆమె సమాధానం “నిజం లేదా అవును” అని వస్తే ఆమెను గృహహింస బాధితురాలిగానే పరిగణించడం జరిగింది.

**శ్రేయస్సు సంపద ఆధారిత ర్యాంకులు...**

28 రాష్ట్రాల మహిళలు, పురుషుల నుంచే సేకరించిన శాంపిల్ సర్వే ఆధారంగా శ్రేయో సూచికలను నిర్మించడం జరిగింది. స్త్రీ, పురుషుల సరాసరి శ్రేయస్సును ముందు రాష్ట్రాల వారీగా లెక్కించి ర్యాంకులివ్వడం జరిగింది. 2005-06 సం॥లో ఇచ్చిన ర్యాంకుల ఆధారంగా స్పష్టమయ్యే అంశాలేమనగా శ్రేయస్సు విషయంలో అన్ని రాష్ట్రాలలోనూ ఆడవారు, మగవారికన్నా దిగువస్థాయిలోనే ఉన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలైన ఢిల్లీ, గుజరాత్, హర్యానా, కేరళ, రాజస్థాన్లలోనే కాక, ఆర్థికంగా వెనుకబడిన బీహార్, మణిపూర్, మధ్యప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్, రాజకీయంగా ఛిద్రమైన జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాల లోనూ ఇదే పరిస్థితి. హిమాచల్ప్రదేశ్, మేఘాలయ, మహారాష్ట్ర, పంజాబ్, సిక్కిం, తమిళ నాడు, త్రిపుర, ఉత్తరాంచల్ (ప్రస్తుతం ఉత్తరాఖండ్), పశ్చిమ బెంగాల్లలో వ్యత్యాసం కాస్త తక్కువగా ఉంది. సమగ్రంగా సరిపోల్చి పరిశీలించినప్పుడు పురుషుల శ్రేయోసూచిక స్త్రీల శ్రేయోసూచిక కన్నా ఉన్నతంగా ఉంది. అంతర్గతంగా ఉన్న భేదాలను పరిశీలించడానికి వ్యక్తుల శ్రేయో సూచికను రాష్ట్రాల వారీగానూ, అంతర్రాష్ట్రాల మధ్య పోల్చి చూడటం జరిగింది. మహిళల కో ఎఫిషియెంట్ వేరియేషన్తో పోల్చినప్పుడు పురుషుల కో ఎఫిషిమెంట్ వేరియేషన్ తక్కువగా ఉంది. మహిళల శ్రేయస్సు అత్యంత దారుణంగా ఉన్న రాష్ట్రాలలో, మహిళల కో ఎఫిషియెంట్ వేరియేషన్ అధికంగా ఉంది. సమగ్రంగా పరిశీలించినప్పుడు రాష్ట్రాభివృద్ధితో సంబంధం లేకుండా పురుషుల శ్రేయో సూచిక ఉన్నతంగా ఉండగా, స్త్రీల విషయంలో తద్భిన్నంగా వ్యత్యాసం అధికంగా ఉంది.

పనితీరు ఆధార శ్రేయస్సుని, ఆదాయ ఆధార శ్రేయస్సు మధ్య సంబంధాన్ని పరిశీలించే క్రమంలో ఆయా ప్రాంతాల స్త్రీ, పురుషుల నుండి సేకరించిన గణాంకాల ఆధారంగా రాష్ట్రాలకు ర్యాంకు ఇవ్వబడింది. ప్రతి రాష్ట్రం లోనూ స్త్రీ, పురుషుల శ్రేయోసూచికల సరాసరి ఆధారంగా ర్యాంకు ఇవ్వడం జరిగింది. 2005-06 కాలంలో 28 రాష్ట్రాలలోని తలసరి ఆదాయం ఎన్ఎస్డిపి లెక్కించిన ఆధారంగా సైతం గణించబడింది.

ఫలితాల ఆధారంగా గమనించిన అంశం శ్రేయస్సు విషయంలో పురుషుల కన్నా మహిళలు వెనుకబడి ఉన్నారు. సంపాదన ఆధారిత లెక్కలలో సైతం పురుషులే ముందున్నారు. మహిళల సంపాదన వారి శ్రేయస్సుపై

❝గృహంలో ఆధిపత్యం భార్యదైనా, భర్తదైనా శ్రేయస్సు విషయంలో మహిళల కన్నా పురుషులే ముందున్నారన్నది ఈ అధ్యయనం సూచించే మరో ముఖ్యమైన అంశం. కుల, మత, ప్రాంతాల కతీతంగా భారతీయ కుటుంబాల్లోని పురుషులు చదువు, ఆహారం మొదలగు అన్ని అంశాలలోనూ మహిళల కన్నా ఉన్నతస్థానాన్ని అనుభవిస్తున్నారు.❞

సానుకూల ప్రభావం చూపుతున్నది.

వయస్సు పెరుగుతున్న కొద్దీ పురుషుల శ్రేయస్సు అధికమౌతుండగా, స్త్రీల విషయంలో తిరోగమన దిశలో ఉంది. స్త్రీ ఆధిపత్యమున్న గృహాలలో పురుషుల శ్రేయస్సు, పురుషుల ఆధిక్యత ఉన్న కుటుంబాల్లో స్త్రీల శ్రేయస్సు తక్కువగా ఉన్నాయి. ఎవరి ఆధిక్యత ఉంటే ఆ వ్యక్తుల శ్రేయస్సు ముందంజలో ఉంది.

కుటుంబం ఎంత పెద్దగా ఉంటే ఆ కుటుంబాల పురుషుల శ్రేయస్సు అంత అధికంగా ఉంది, కానీ స్త్రీల విషయంలో వెనుకంజ వేసింది. మిగతా మతాల్లోని పురుషుల కన్నా హిందూ పురుషులు శ్రేయస్సు విషయంలో ముందంజలో ఉన్నారు. కానీ స్త్రీల పరిస్థితి మాత్రం మిగిలిన మతస్తుల కన్నా భిన్నంగా లేదు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగల పురుషుల కన్నా అగ్రవర్ణాల పురుషుల శ్రేయస్సు అధికంగానే ఉంది. స్త్రీల విషయంలో అన్ని కులాల వారూ ఒకే స్థాయిలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల స్త్రీ, పురుషుల శ్రేయస్సుకన్నా పట్టణ ప్రాంతాల స్త్రీ పురుషుల శ్రేయస్సు పై స్థాయిలోనే ఉంది. గ్రామీణ ప్రాంతాల పురుషుల కన్నా, స్త్రీలు బాగా దిగువ స్థాయిలో ఉన్నారు.

పీఠభూమి ప్రాంతాల పురుషుల కన్నా ఉత్తర ప్రాంతంలోని కొండ ప్రాంతాల పురుషుల శ్రేయస్సు తక్కువగా ఉంది. కానీ స్త్రీల విషయంలో పీఠభూమి ప్రాంతాల కన్నా ఉత్తర ప్రాంతాలలోని కొండ ప్రాంతాలే ముందున్నాయి. గంగా పరీవాహక ప్రాంతాల పురుషుల శ్రేయస్సు, ఉత్తర ప్రాంతాల పురుషుల కన్నా పై స్థాయిలో నుండగా, స్త్రీల విషయంలో ఉత్తర ప్రాంతాల వారే ముందున్నారు. గంగా పరీవాహక ప్రాంతాల స్త్రీలు వెనుకంజలో ఉన్నారు. ఎడారి ప్రాంత స్త్రీ, పురుషుల శ్రేయస్సు ఉత్తర ప్రాంత కొండ ప్రాంతాల వారికన్నా హీనస్థితిలో ఉన్నాయి. స్త్రీల పరిస్థితి ఎడారి ప్రాంతాలలో పురుషుల కన్నా దిగువ స్థాయిలోనే ఉంది.

**6) ఉపసంహారము...**

భారతదేశంలోని 28 రాష్ట్రాలలోని స్త్రీ, పురుషుల మధ్య ఉన్న వ్యత్యాసాలను, 2005-06లో జరిగిన 3వ జాతీయ కుటుంబ సంక్షేమ సర్వే ఆధారంగా పరిశీలించి, విశ్లేషించడం జరిగింది. స్త్రీ, పురుషుల శ్రేయస్సుకు ఆదాయం కన్నా మిగిలిన అంశాల ప్రభావమే అధికంగా ఉందని పరిశీలనలో తేలింది. ఈ అధ్యయనం ఆధారంగా రాష్ట్రాలకు ర్యాంకులివ్వడం జరిగింది. స్త్రీ, పురుషుల శ్రేయస్సు విషయంలో సైతం ఆదాయం ఆధారిత శ్రేయస్సును గణించి, ర్యాంకులివ్వడం జరిగింది. ఒక్క రాష్ట్రంలో మాత్రమే స్త్రీ, పురుషుల శ్రేయస్సుకు మధ్య అత్యంత అల్పమైన తేడాను గమనించాం. పురుషుల శ్రేయస్సు సంపాదన ఆధారంగా ఉన్నత స్థానంలో ఉండగా, స్త్రీల విషయంలో సంపాదన ప్రభావం లేదు. మిగిలిన అంశాలే ప్రాధాన్యత వహించాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో స్త్రీల శ్రేయస్సుకు, సంపాదనకు ఏమాత్రం సంబంధం లేదు.

గ్రామీణ భారతమైనా, పట్టణ ప్రాంతమైనా శ్రేయస్సు విషయంలో పురుషుల కన్నా స్త్రీలు వెనుకబడే ఉన్నారు. స్త్రీ, పురుష భేదాల కతీతంగా అధిక ఆదాయం భారత ప్రజల శ్రేయస్సుని ప్రభావితం చేస్తున్నది. మిగిలిన అంశాలు మాత్రం సంఘర్షిస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు వృద్ధాప్యం పురుషులకు కుటుంబంలోనూ, సమాజంలోనూ అధిక ప్రాధాన్యత, గౌరవాన్నిస్తుండగా, స్త్రీలు ఇంటి పనులు చేయలేక పోవడం, కుటుంబ సభ్యులను ఆధారంగా చేసుకోలేకపోవడం వలన వారిపై గౌరవాన్ని, జాలిని తగ్గిస్తున్నాయి. దీనివలన మహిళల శ్రేయస్సు హీనస్థాయికి దిగజారుతున్నది.

గృహంలో ఆధిపత్యం భార్యదైనా, భర్తదైనా శ్రేయస్సు విషయంలో మహిళల కన్నా పురుషులే ముందున్నారన్నది ఈ అధ్యయనం సూచించే మరో ముఖ్యమైన అంశం. కుల, మత, ప్రాంతాల కతీతంగా భారతీయ కుటుంబాల్లోని పురుషులు చదువు, ఆహారం మొదలగు అన్ని అంశాలలోనూ మహిళల కన్నా ఉన్నతస్థానాన్ని అనుభవిస్తున్నారు. పురుషాధిక్య కుటుంబాలలోని వివాహిత మహిళలు మిగిలిన స్త్రీల కన్నా అత్యంత తక్కువస్థాయిని అనుభవిస్తున్నారు. వరకట్న చావులు, భార్యను శారీరకంగా హింసించడం, తరచూ కొట్టడం, చదువు మధ్యలో ఆపేయడం, బాలికల భ్రూణ హత్యలు మొదలగునవి భారతీయ సమాజంలో అత్యంత సహజ చిత్రాలు.

కుటుంబం ఎంత పెద్దగా ఉంటే ఆ కుటుంబంలోని పురుషుల శ్రేయస్సు కూడా అంతే ఎక్కువగా ఉన్నదనేది ఈ అధ్యయనం గమనించిన మరో అంశం. ఆదాయం ఆధారంగా గాక, అన్ని రకాల సౌకర్యాలను పురుషులు సమిష్టి కుటుంబాలలో అనుభవిస్తున్నారు. దురదృష్టకరమైన విషయమేమిటంటే, సమిష్టి కుటుంబ భారం మహిళలపై అధికంగా పడటమే గాక, వారి శ్రేయస్సును సైతం అదే దిశలో ప్రభావితం చేస్తున్నది. మిగిలిన మతాలకన్నా, మైనారిటీల కన్నా హిందూ మతంలోని పురుషులు ఉన్నతంగా ఉండగా, మతాలకతీతంగా మహిళలందరూ వెనుకబడే ఉన్నారు. మహిళల శ్రేయస్సు విషయంలో కులం, మతం, ప్రాంతాలేవీ భిన్నంగా లేవు.

స్త్రీ, పురుషులు శ్రేయస్సు విషయంలో పట్టణాలు ముందుండగా, గ్రామీణ ప్రాంతాల వారు వెనుకబడి ఉండటం మరో ప్రధానాంశం. అభివృద్ధి రాహిత్యం, మౌలిక వసతుల లేమి, అవిద్య, స్వేచ్ఛా రాహిత్యం, మూఢ నమ్మకాలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక అసమానత్వం, సామాజిక, రాజకీయ ఆధిపత్యం గ్రామీణ ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. పురుషుల శ్రేయస్సు ఆయా ప్రాంతాల ఆధారంగా ఉచ్ఛస్థితిలోనే ఉందని ఈ అధ్యయనం సుస్పష్టంగా ప్రకటిస్తున్నది. ఎడారి ప్రాంతంలోని వాతావరణ అననుకూల పరిస్థితుల వలన కాస్త వెనుకంజలో ఉండగా, మహిళలు మాత్రం ఉత్తర ప్రాంత కొండల్లో కాస్త మెరుగ్గా ఉన్నా, దేశమంతా ఒకటే స్థితి.

కొండ ప్రాంతంలోని మహిళలు కష్టజీవులు, స్వయం సమృద్ధి కలవారు, ఆరోగ్యవంతులు, స్వీయ నిర్ణయాధికారం కలవారు కావడమే దీనికి ప్రధాన కారణమని మేమందరం భావిస్తున్నాం. ❋

# ఆర్‌యస్‌యస్ మతతత్వ ప్రణాళికను అమలు చేస్తున్న మోడి

ఎ.జి. నూరాని


రచయిత విశ్రాంత న్యాయమూర్తి

**2014,** మే 26న ప్రధానమంత్రిగా నరేంద్ర దామోదర్ దాస్ మోడీ అధికారం చేపట్టిన ఏడాదిన్నర తరువాత భారత ప్రజలు ఆయన గుణాలను తెలుసుకోవడం ప్రారంభించారు. జవహర్‌లాల్ నెహ్రూ కూర్చున్న కుర్చీమీద కూర్చోవడానికి తాను అనర్హుడనని మోడీ తనంతట తాను ఋజువు చేసుకున్నాడు. నెహ్రూ దేశాన్ని ఐక్యం చేసే పనిచేస్తే, మోడీ విభజన చేసే పనిలో ఉన్నాడు. ఆయన ప్రధానమంత్రి కావడానికి ముందే, ధైర్యంగా తాను సాధించ దలచుకున్న లక్ష్యం ఏమిటో వివరంగా అందరికీ చూపించాడు. అది భయంకరమైన నమూనాగా ఉంది. "హిందువులు, ఆ జాతి ప్రజలందరూ ఒకటి. కేవలం హిందువుల అభివృద్ధి ద్వారా మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుంది. హిందువుల ఐక్యత ద్వారానే దేశం బలపడుతుంది" అని మంగుళూరులో ఆర్ఎస్ఎస్‌చే నిర్వహించబడిన హిందూ సమాజోత్సవ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ముఖ్య అధిపతి మోహన్ భగవత్ సమక్షంలో చెప్పాడు. ఆర్ఎస్ఎస్ యొక్క ఒక సాధారణ స్వయం సేవకుడు (తనగురించి) దేశంలో గుజరాత్‌ను మొట్టమొదటి స్థానంలో నిలిపేందుకు కష్టపడి పనిచేశాడు అని చెప్పుకున్నాడు. అంతేకాక "తన జీవితం మొత్తాన్ని హిందూ సమాజం కోసం వినియోగిస్తానని కూడా చెప్పారు. (ఆర్గనైజర్, ఫిబ్రవరి 11, 2007)

నిశ్చయమైన తన విజయ పరంపర తరువాత రాయిటర్స్ యొక్క ఒక ఇంటర్వ్యూలో మోడీని ఇలా అడిగారు. "అయితే మీరు 2002లో సరిగ్గా వ్యవహరించారని అనుకుంటున్నారా? (కార్యక్రమంలో). దానికి ఆయన "సంపూర్ణంగా" అని జవాబిచ్చారు. "నిజంగా మోడీ ఎవరు– హిందూ జాతీయవాద నాయకుడా లేక వాణిజ్య ముఖ్యమంత్రా?" అని ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు అని అడిగినప్పుడు, మోడీ గొప్పగా ఇలా వివరించారు. "నేను ఒక దేశభక్తుడిని, జాతీయవాదిని, నేను హిందువుగా పుట్టాను అని చెప్పుకోవడంలో ఎటువంటి తప్పు లేనట్లే, నేను పుట్టుకతోనే హిందువును కాబట్టి మీరు నన్ను హిందూ జాతీయవాది అనవచ్చు అని ఆయన అన్నారు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, జులై 13, 2013)

మోడీ పట్ల ఆపద్బాంధవుడుగా (భగవంతుడుగా) ఆశలు పెట్టుకున్నవాళ్ళు, ధారాళంగా ఆయన చేసిన వాగ్దానాల జాడల గురించి కొంచెం కొంచెం తెలుసుకుంటున్నారు. ఆయన వాగ్దానం చేసిన 'మంచిరోజులు' మోసపూరితమైన ఎండమావులు (మిధ్య)గా మారాయి. చెడ్డ దినాలు' మతపరమైన ప్రకటనలు, నేరపూరిత ఆరోపణల ద్వారా మనపైన పెద్దఎత్తున దాడులకు పురికొల్పుతున్నాయి". సంస్కరించే పేరుతో సాంస్కృతిక, విద్యాసంస్థలను ఒక పథకం ప్రకారం మూసివేస్తున్నారు. దేశ ముఖ్య కార్యనిర్వహణాధికారి చేత ఎటువంటి ఆరోపణలు లేకుండా హత్యలు, విచారణ లేకుండా చంపడాలు చేయబడుతున్నాయి. ఈ సంఘటనల పట్ల ఉద్దేశ్యపూర్వకంగా ఆయన కొనసాగిస్తున్న మౌనాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని జాగ్రత్తలు అవసరం.

**అమెరికా ప్రతినిధి మదింపు**

ఒక జాతియొక్క ప్రధానమంత్రిని ఖచ్చితంగా మదింపు చేయడం చాలా ముఖ్యమైన విషయం. గుజరాత్‌లో తన కాలంలో జరిగిన అనేక విషయాల పట్ల మోడీలో కించిత్తు కూడా మార్పులేదు. తన పర్యవేక్షణలో అమలు చేయబడిన అత్యంత భయంకరమైన కార్యక్రమంలో నష్టపోయిన బాధితులకు పునరావాసం కల్పించకుండా అతి నీచమైన, అతి క్రూరమైన ప్రవర్తనను ఇప్పటికీ కలిగి ఉన్నాడు. ఒక దశాబ్దకాలం క్రితమే అత్యంత మోసపూరితమైన రాజనీతిజ్ఞుడుగా ఆయనను మదింపు చేయడం జరిగింది. "మోడీ అవినీతి రహిత వ్యక్తిగా తనకు తాను ముద్ర వేసుకోవడంలో సఫలీకృతుడయ్యాడు. సమర్థవంతమైన పాలకుడుగా, రాజ్యంలో ఒక దృఢమైన వాణిజ్య సంస్కృతికి అవకాశం కల్పించేందుకు సహకరించే వ్యక్తిగా, అర్థంలేని మాటలు మాట్లాడని వాడిగా, మెజారిటీ హిందువుల ప్రయోజనాలను కాపాడే చట్టబద్ధమైన రాజనీతిజ్ఞుడుగా కీర్తింపబడ్డాడు. భారతీయ జనతాపార్టీలో మోడీ వెనుకనున్న నాయకులు ఆయన తనకున్న ఈ రకమైన గొప్ప గుణాల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లను సానుకూలంగా మార్చుకోగలడని నాయకత్వాన్ని ఒప్పించే ప్రయత్నాలు చేశారు. ఆయన యొక్క ఇతర లక్షణాలను అభినందించే విధంగా వారు ఒక పర్యాయం చేస్తే, 2002లో మోడీ పాత్ర గురించి ఓటర్లు మరచిపోవడం, వదిలివేయడం చేస్తారని కొంతమంది ఆశ, నమ్మకం.

"మోడీ బహిరంగ దర్శనాలలో ఆకర్షణీయంగా, సంతోషపరుచునట్టి వ్యక్తిగా కనిపిస్తాడు. ఏది ఏమైనా, అన్ని రకాల లెక్కల ప్రకారం అతనొక ప్రత్యేకమైన కుత్సిత మనోభావంగల, కొద్దిమంది సలహాదారుల గ్రూపు తోడ్పాటుతో పరిపాలన సాగిస్తూ నమ్మదగని వ్యక్తిగా ఉన్నాడు. ముఖ్యమంత్రి, అతని మంత్రివర్గం, పార్టీ మధ్య జరిగే ఘర్షణ తగ్గించే సాధనంగా అతనికున్న ఆంతరంగిక శ్రేణి పనిచేస్తుంది. మొత్తం మీద ఆయన పాలన అందరినీ కలుపుకొని, అందరి సమ్మతి, ఏకీభావాన్ని తీసుకొని పాలించడం కంటే భయపెట్టి, బెదిరించి, బలవంతంగా సమ్మతింపచేసి, చివరికి పార్టీ ఉన్నతస్థాయి అధికారులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకునే విధంగా క్రూరంగా ఉంది"

ముంబాయిలో అమెరికా ప్రతినిధి, రచయిత అయిన మైఖేల్ ఓవెన్ రూపొందించిన 2850 మాటల నిడివిగల కేబుల్ 2006, నవంబర్ 12న న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం నుండి పంపబడింది. దానిని పంపే ముందు రాయబారి, అతని యొక్క

> **"న్యూఢిల్లీలో బ్రిటన్ యొక్క మొదటి హై కమిషన్ కార్యదర్శి అయిన పీటర్ హోలండ్ నాయకత్వంలోని బృందం తయారు చేసిన నివేదిక ప్రకారం గుజరాత్ మారణకాండ "రాష్ట్ర ప్రభుత్వం యొక్క మద్దతుతో ఒక పథకం ప్రకారం జరిగింది. హిందూ ప్రాంతాల నుంచి ముస్లిములను తొలగించడం లక్ష్యంగా జరిగింది"**



**2002 గుజరాత్‌లో పెచ్చరిల్లిన హిందూత్వ మూకల మారణకాండ**

అనుచరుల చేత జాగ్రత్తగా, లోతుగా పరిశీలింప బడినట్లు తెలుస్తున్నది. సురేష్ నంబత్ ఆఫ్టీ ఎత్తిచూపినట్లుగా రాజకీయాలలో ఎం.ఎ. సిద్ధాంతాల లాగా ఆ సుదీర్ఘమైన వివరణ చక్కగా తయారు చేయబడింది" 2005లో మోడీ యొక్క బి1-బి2 వీసాలపై విధించిన నిషేధాన్ని త్వరలో ఎత్తివేస్తారని ఓవెన్ చెప్పాడు. అమెరికా నేరస్తుడిగా ముద్రవేస్తుందన్న భయంతో "ఆ విషయంలో అవకాశవాదాన్ని ప్రదర్శించి జాతీయ వేదిక మీదకు మారేవిధంగా చేశాడు. గుజరాత్‌లో మానవహక్కులు, మతపరమైన స్వేచ్ఛపై ఒక స్పష్టమైన సమాచారం" మోడీతో ముఖాముఖి అమెరికాకు ఇచ్చేటట్లు చేసింది. ఆ సమాచారం వీకీలీక్స్ చేత బహిరంగపరచబడి మార్చి 22, 2011న హిందూ దినపత్రికలో ప్రచురించబడిన దానిలో ఒక భాగంగా ఉంది.

ఆ కేబుల్ మూలంగా లభించిన బలమైన వార్త త్వరలోనే వ్రాయబడింది. మోడీ ప్రధాన మంత్రి అయిన తరువాత, ఆయన కలను సాకారం చేసుకొనే విధంగా, జాతీయస్థాయిలో గుజరాత్ మోడల్ ఖచ్చితమైన ప్రతిని అమలు చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రివర్గ వ్యవస్థను పునాదితో సహా నాశనం చేసే పనిని ఆయన ప్రారంభించారు. మంత్రుల పరిధిని కుదించి, ఎంపిక చేసిన ఉన్నతాధికారులను ఉన్నతస్థితిలో ఉంచాడు. బిజెపి అధ్యక్షుడుగా అమిత్‌షా నియమింపబడ్డాడు. దీనితో పార్టీపైన పట్టు సంపూర్ణమైంది. గుజరాత్‌లో లాగా పోటీదారులు ద్వారపాలకులుగా చేయబడ్డారు.

ఏది ఏమైనా, గుజరాత్‌కు సంబంధించిన గుణపాఠాన్ని నేర్చుకోవడానికి మోడీ తిరస్కరిస్తున్నాడు. 2002 కార్యక్రమంలో మోడీ యొక్క పాత్రను ఈ ప్రపంచం మరచిపోవడంగానీ లేదా వదిలివేయడం (క్షమించడం) కానీ, లేదా రెండూ కానీ చేయలేదు అనే విషయాన్ని గత నెలలో లండన్‌లో జరిగిన ప్రదర్శనల ద్వారా మోడీకి ఆచరణాత్మకంగా చూపించారు. (వివరాలకు జులై 25, 2014లో ఫ్రంట్‌లైన్‌లో "మోడీ బాధ్యుడు" అనే రచయిత యొక్క వ్యాసంలో చూడవచ్చు) న్యూఢిల్లీలో బ్రిటన్ యొక్క మొదటి హై కమిషన్ కార్యదర్శి అయిన పీటర్ హోలండ్ నాయకత్వంలోని బృందం తయారు చేసిన నివేదిక ప్రకారం గుజరాత్ మారణకాండ "రాష్ట్ర ప్రభుత్వం యొక్క మద్దతుతో ఒక పథకం ప్రకారం జరిగింది. హిందూ ప్రాంతాల నుంచి ముస్లిములను తొలగించడం లక్ష్యంగా జరిగింది" మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు హిందూ, ముస్లింల మధ్య 'సఖ్యత' సాధ్యంకాదు అని కూడా చెప్పింది. ఇక్కడ రెండు లక్ష్యాలు పూర్తి చేయబడినాయి. పునరావాసానికి సంబంధించిన విలువైన పని అక్కడ లేదు. మతహింస, బలవంతపు వలస, రాజ్యం గురించి "2002 నుంచి గుజరాత్" (కేంబ్రిడ్జి యూనివర్శిటీ ప్రచురణ 2015)లో డా॥ సంజీవని బాడిగర్ లోక్ హుండీ చెప్పింది. తరువాత వచ్చే చెడ్డ ఫలితాల మీద ఆమె కేంద్రీకరించింది. ఐరోపా యూనియన్ యొక్క ముసాయిదా నివేదిక తలబొప్పి కట్టించింది. "గుజరాత్‌లో మానవ సంహారం ఒక రకమైన జాతి వివక్ష" అని చెప్పింది.

ఆ కార్యక్రమం జరిగిన కేవలం ఆరు నెలల తరువాత, 2002 సెప్టెంబర్ 9న బేచర్జీ వద్ద మోడీ ఇలా అన్నారు. "గుజరాత్ యొక్క స్వాభిమానాన్ని (ఆత్మాభిమానాన్ని) భయపెట్టే దుర్మార్గమైన అన్ని శక్తులను నాశనం చేయడం లేదా పూర్తిగా తొలగించి వేయాలని దృఢంగా నిశ్చయించుకున్నాము. మేము హిందూవాదులమని మాకు వ్యతిరేకంగా నిందారోపణలు ఉన్నాయి. ఓ సోదరులారా! బేచర్జీ దేవి యొక్క ఆలయ అభివృద్ధి కోసం మా ప్రభుత్వం 8 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది మేము చేసిన నేరమా? నరేంద్రమోడీ భాయ్ చాలా తెలివైన వాడు, ఆయన నర్మదా నీటిని సబర్మతి నదిలోకి హిందువులకు పవిత్రమైన శ్రావణమాసంలో తెచ్చారు అని వారంటున్నారు... అప్పటి నుండి మేము ఇక్కడ ఉన్నాం. మేము సబర్మతిలోకి శ్రావణమాసంలో నీళ్ళు తెచ్చాము; మీరు అక్కడ ఉన్నప్పుడు, ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో నీళు ళ తెచ్చారు... ఏమి సోదరా... మేము పునరావాస కేంద్రాలు నడపాలా? నేను అక్కడ పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించాలా? పునరావాస కేంద్రాల్లో కుటుంబ నియంత్రణ విధాన నిర్ణయాన్ని నిర్దిష్టంగా అమలు చేయడంలో అభివృద్ధి సాధించాలని మేము కోరుకుంటున్నాము. మేము ఐదుగురం నాకు ఇరవై ఐదు మంది. (హమే పాంచ్, హమారా పంచీస్, ముస్లింల బహు బార్యత్వాన్ని ఉద్దేశించి).

"మేము కచ్ జిల్లా నుండి పరిశీలన చేశాము. వ్యాపారుల యొక్క హత్యలు స్వేచ్ఛగా జరగడానికి మేము అనుమతించము. వారి పథకాలను అమలు చేయడం ద్వారా గుజరాత్‌ను నాశనం చేసే, అమాయకులకు హాని కలిగించే కుట్రలను నేను అనుమతించను. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ జన్మించిన గడ్డను

అవమానపరిచామని ఇటలీ కుమార్తె (సోనియా గాంధీ) మాకు బహిరంగ సర్టిఫికెట్ ఇచ్చారు. ప్రజల యొక్క మనో నిశ్చలతను, ఆత్మగౌరవాన్ని మనం పెంచేటట్లయితే, అలీలు, మాలీలు, జమాలీల (ముస్లింలనుద్దేశించి) పథకం మనకు ఏ రకమైన హానినీ చేయడంలో విజయవంతం కాలేదు. ఐదుకోట్ల మంది గుజరాత్ ప్రజలు తమ యొక్క భవిష్యత్తును నిర్ణయించుకుంటారు. ఢిల్లీ బఫూన్లు వీళ్ళ భవిష్యత్తును నిర్ణయించలేరు" నరేంద్రమోడీ యొక్క అసలు స్వరూపాన్ని, మొరటైన దూషణాత్మకమైన, తీవ్రమైన మత విద్వేషాలను రెచ్చగొట్టే వాక్చాతుర్యాన్ని 2014లో, ఇటీవల బీహార్‌లో బహిరంగ పరిచారు.

గుజరాత్‌లో పునరావాస కేంద్రాలు మే 2002 అంతకంటే ముందు నుంచి మూసివేయడం ప్రారంభించారు. విమర్శకు మోడీ స్పందన ఆగ్రహం తెప్పించే విధగా ఉంటుంది. ఆయన గౌరవ యాత్ర పేరుతో ఒక రాజకీయ ప్రచారాన్ని ప్రారంభించారు. గౌరవయాత్ర రోడ్డు ప్రదర్శనలో, గ్రామస్తులనుద్దేశించి రైలులో 60 మంది రామభక్తులను సజీవంగా కాల్చివేసిన విషయాన్ని మీరు విన్నారా అని అడిగారు. తన యొక్క గొప్ప శక్తి సామర్థ్యాలు ఆ ప్రజా సమూహం మీద పనిచేసేవిధంగా తన యొక్క ప్రశ్నలకు బిగ్గరగా స్పందించాలని కోరారు:

**న.మో : మీలో ఎవరైనా ఎవరినైనా హత్య చేశారా? (పొడిచారా)**

సమూహం : లేదు...

**న.మో : మీలో ఎవరి తలనైనా తీశారా?**

సమూహం : లేదు...

**న.మో : మీలో ఎవరైనా ఏ సోదరి కూతురినైనా మానభంగం చేశారా?**

సమూహం : లేదు

**న.మో : అటువంటప్పుడు గుజరాత్‌లో గ్రామ గ్రామాన మంటలు చెలరేగుతున్నాయని, గ్రామ గ్రామానా ప్రజలు చంపబడుతున్నారని, గ్రామ గ్రామాన తలలు పగలగొట్టబడుతున్నాయని గుజరాత్ యొక్క శత్రువులు మాత్రమే చెబుతున్నారు. వారు గుజరాత్ యొక్క గౌరవానికి ఎంతో హాని కలిగిస్తున్నారు, వారందరికీ సమాధానం చెప్పడానికే నేను గౌరవయాత్రకు పూనుకున్నాను"**

ఆ యాత్రలోనే మరొక ఉపన్యాసంలో ఆయన ఇలా అన్నారు:

"నేను గౌరవయాత్రలు పూనుకోగానే, కాంగ్రెస్‌లోని నా మిత్రులు, గర్వించేదేమిటి? అని అన్నారు. ఆ ప్రశ్న నాకు గౌరవయాత్ర

> **"ఈ గ్రహంమీద ఉన్న అత్యంత ప్రమాదకరమైన రాజకీయవేత్తలలో మోడీ ఒకరు. ఏ జాతీయ నాయకుడి గురించైనా బాగా ఆలోచించండి. కామెరూన్, మెర్కెల్, ఒబామా - తమ జీవితంలో అత్యధిక భాగాన్ని మతోన్మాద, ఫాసిస్టు శక్తుల కోసం పనిచేస్తున్నారా? ప్రఖ్యాతి చెందిన ఇస్లామిక్ స్టేట్ కార్యకలా పాలతో పోల్చండి."**

యొక్క అవసరాన్ని నొక్కి వక్కాణించింది.

గుజరాత్ ప్రజలు దొమ్మీదారులు, ఆయుధాలు కలిగినవారు, హంతకులు, దోపిడీదారులని వారు అంటున్నారు. ఇది ఖచ్చితంగా గుజరాత్ యొక్క గౌరవాన్ని నాశనం చేసే ప్రయత్నం, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని బిజెపి దృఢచిత్తంతో సంకల్పించింది. గుజరాత్‌ను కించపరచడానికి ప్రజలు పదిలక్షల సార్లు ప్రయత్నం చేసి ఉండవచ్చు. కానీ నేను గుజరాత్ యొక్క వాస్తవాలను బయటకు తీసుకురావాలని ధైర్యంగా నిర్ణయించుకున్నాను".

2012 జులైలో ఒక చేయితిరిగిన ముస్లిం జర్నలిస్టుతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో, మోడీ ఇలా అడిగారు : "ఇప్పుడు క్షమాపణ చెప్పమని కోరటంలో ఉన్న ఉద్దేశ్యం ఏమిటి? ఆ రోజు జరిగిన దానికి పూర్తి బాధ్యత తీసుకున్నాను, విచారం వ్యక్తం చేశాను అలాగే, క్షమాపణ కూడా చెప్పాను. 2002 అల్లర్ల తరువాత నేను ఏమి చెప్పానో ఒకసారి సరి చూసుకోండి. గడిచిన 10 సంవత్సరాల నుండి మీరు (మీడియా) నాకు అన్యాయం చేస్తున్నారని ప్రస్తుతం రాయండి. ఇప్పుడు మీరు మోడీకి క్షమాపణ చెప్పండి"

కానీ గుజరాత్ పథకంలో మోడీ ఆయన వంది మాగధులను వారి ఆకాంక్షలకు దూరంగా ఉంచలేదు. క్షేత్రస్థాయిలో ఇప్పటికీ కొనసాగుతున్న భయకంపితమైన పరిస్థితికి వారి పథకానికి సంబంధం ఉంది. నిజాయితీగా తప్పనిసరిగా రెండు ప్రశ్నలను ఎదుర్కోవలసి ఉంటుంది. మొదటిది, ఆ రకమైన నేపథ్యం కలిగిన వ్యక్తి విషయంలో ఆయన వందిమాగ ధులు ఎందుకు కళ్ళు మూసుకొని ఉన్నారు? అత్యంత లోతైన కుట్ర స్వభావం కలిగిన వ్యక్తి ప్రధానమంత్రిగా లౌకిక భారతదేశానికి సేవ చేయగలడా?

**మారని మోడీ...**

మోడీ ప్రధానమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుండీ కించిత్తు కూడా మారలేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ ఆయన "బయటి శక్తులను" అదుపులో ఉంచుతాడని ఆయన వందిమాగధులు అత్యుత్సాహంతో చెపుతున్నారు. ఆయనలో ఉన్న అంతర్గత భావాలను వెల్లడించడానికి విదేశాలలో ఆయన చేసిన ప్రసంగాలు చాలు.

2014 సెప్టెంబర్ 2న మోడీ జపాన్ చక్రవర్తికి శ్రీమద్ భగవద్గీతను కానుకగా ఇచ్చారు. కానీ ఆయన దీనిమీద స్వదేశంలో వచ్చే విమర్శలను ఊడ్చిపారవేయడానికి మాత్రమే ఉపయోగించుకున్నారు. "దీని తరువాత భారతదేశంలో ఏమి జరగబోతుందో నాకు తెలియదు. బహుశా దీనిమీద ఒక టీవీ కార్యక్రమం ఉండవచ్చు. మోడీ తనను తాను ఏమనుకుంటున్నాడో అని మా యొక్క లౌకిక మిత్రులు తుపాను సృష్టిస్తారు. అతనితో కలిసి ఆయన గీతను తీసుకుంటారు. దానర్థం ఏమంటే దీనిని కూడా ఆయన ఒక మతపరమైన అంశంగా మార్చివేశారు"

మోడీ బ్రిటీష్‌వాళ్ళను హత్తుకునేవిధంగా ఏమీ చేయలేదు. నవంబర్ 13న ది గార్డియన్ పత్రికలో వచ్చిన ప్రధాన శీర్షికను చదవండి "భారత దేశం ఒక హిందూ తాలిబాన్ చేత పాలించబడుతుంది" గార్డియన్ పత్రికకు చెందిన ఆదిత్య చక్రవర్తి అనే కాలమిస్టు మోడీ గురించి ఇలా చెప్పాడు "ఈ గ్రహంమీద ఉన్న అత్యంత ప్రమాదకరమైన రాజకీయవేత్తలలో మోడీ ఒకరు. ఏ జాతీయ నాయకుడి గురించైనా బాగా ఆలోచించండి. కామెరూన్, మెర్కెల్, ఒబామా – తమ జీవితంలో అత్యధిక భాగాన్ని మతోన్మాద, ఫాసిస్టు శక్తుల కోసం పనిచేస్తున్నారా? ప్రఖ్యాతి చెందిన ఇస్లామిక్ స్టేట్ కార్యకలా పాలతో పోల్చండి. మతపరమైన తగాదాలను ప్రోత్సహించే సుదీర్ఘమైన వ్యక్తిగత చరిత్రను ప్రక్కన పెట్టండి. శత్రువుల పట్ల ఎటువంటి దయలేని విధానం కలవారని మంచి పేరు కలిగిన రికార్డు ఉంది. ప్రస్తుతం తీవ్రవాదిని అణురాజ్యానికి బాధ్యుడుగా ఉ

> **❝ హేన్స్ క్రిస్టియన్ అండర్ సన్స్ చక్రవర్తి యొక్క నూతన వస్త్రముల గురించి బిడ్డ పూర్తి అమాయకత్వంతో చెబుతుంది. మంచి వారు అనేకులు ఇప్పుడు చెప్పడం ప్రారంభించారు. కొంతమంది సన్నటి స్వరంతో చెప్పడం ప్రారంభమైంది. "చక్రవర్తికి ఎటువంటి దుస్తులు లేవు" అని అరిచిన వారిని అరెస్ట్ చేశారు. ❞**

ంచారు. ఇది ఇంకా ఎక్కువ ఆందోళన కలిగిస్తుంది".

వాదనలు మనిషిని పరీక్షిస్తాయి. మోడీ తన ప్రత్యర్థుల మీద చౌకబారు, అసభ్యకర వ్యాఖ్యలు చేసే స్థాయికి దిగజారాడు. 2002లో అయితే సోనియా గాంధీని ఆయన "ఈ ఇటలీ కూతురు" అని అన్నారు. 2015 బీహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన తన ప్రత్యర్థులను "ముగ్గురు మూర్ఖులు" అని బిరుదునిచ్చారు. 2014 ఎన్నికల ప్రచారంలో, ఆయన తరచుగా షహ్‌జాదా (యువరాజు, రాహుల్‌గాంధీ), దామాద్ (అల్లుడు, రాబర్ట్ వాద్రా) గురించి మాట్లాడాడు.

ప్రజాస్వామిక పాలనకు రెండు విషయాలు కావాలి, ముఖ్యమైన అంశాల మీద జాతీయ ఏకాభిప్రాయం , పూర్తిస్థాయిలో నమ్మకం, పరస్పర గౌరవం. లౌకికవాదాన్ని తిరస్కరించడం, మోడీ చవకబారు సాంస్కృతిక విధ్వంసం ప్రజాస్వామిక పాలనకు అత్యంత ప్రమాదకరమైన అంశాలుగా ఉన్నాయి. నమ్మకం కలిగించే పొందిక అయిన, విధానపరమైన ఉపన్యాసాన్ని ఒకసారి కూడా ఆయన చేయలేదు. ఆఖరికి నవంబర్ 27న "అంబేద్కర్ వారసత్వ సంపదను గురించి కూడా పార్లమెంటులో నమ్మకం కలిగించే విధంగా మాట్లాడలేదు. అక్టోబర్ 2014న ముంబాయిలో ఉన్న సర్ హెచ్.ఎన్. రిలయన్స్ ఫౌండేషన్ హాస్పటల్, రీసెర్చ్ సెంటర్‌లో చేసిన ప్రఖ్యాత ప్రసంగంలో కనుబొమ్మలు పెద్దవి చేయబడినాయి. "కర్ణుడి తల్లి గర్భం నుండి పుట్టలేదని మహాభారతంలో చెప్పబడింది. ఆ ఇతిహాసం రాయబడిన కాలంలోనే జెనెటిక్ సైన్స్ ఉందని దీని అర్థం. మనం దరం వినాయకుడికి పూజ చేస్తాం. మానవ శరీరానికి ఏనుగు తలను అంటించడం ఆ రోజుల్లోనే జరిగిందంటే తప్పనిసరిగా ఆ రోజుల్లో ప్లాస్టిక్ సర్జన్ ఉన్నాడని తెలుస్తుంది".

దేశ రాజకీయాలను బీహార్ ఎన్నికలు ఒక మలుపు తిప్పితే లండన్ పరిణామాలు



ఆర్ఎస్ఎస్‌కు విశ్వాసపాత్రుడు మోడీ

శిఖరాగ్రానికి చేర్చాయి. ఇక పరిస్థితి క్రిందకు జారిపోవడం ప్రారంభమైంది. ఇప్పటివరకు పైకి కన్పించకుండా గంభీరంగా కనపడే విధంగా కప్పబడిన ముసుగు తనంతట తాను క్రిందకు జారిపోవడం ప్రారంభమైంది. హేన్స్ క్రిస్టియన్ అండర్ సన్స్ చక్రవర్తి యొక్క నూతన వస్త్రముల గురించి బిడ్డ పూర్తి అమాయకత్వంతో చెబుతుంది. మంచి వారు అనేకులు ఇప్పుడు చెప్పడం ప్రారంభించారు. కొంతమంది సన్నటి స్వరంతో చెప్పడం ప్రారంభమైంది. "చక్రవర్తికి ఎటువంటి దుస్తులు లేవు." అని అరిచిన వారిని అరెస్ట్ చేశారు. కానీ క్షీణతను ఆపలేరు.

భారతీయ చరిత్ర పరిశోధనా సంస్థను మొత్తంగా (ఐసిహెచ్ఆర్) ఫిబ్రవరి 24, 2015న 18 మంది కొత్త అభ్యర్థులతో ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన అఖిలభారత ఇతిహాస్ సంకలన్ యోజన ఆఫీస్ బేరర్స్‌గా ఉన్న వారితో కూడా కలిపి పునర్నిర్మాణం చేయడం జరిగింది. కేవలం ఒక పర్యాయం కాల పరిమితి మాత్రమే పూర్తి చేసిన వారిని కూడా సంస్థలో పునర్ నియామకం చేయకుండా తొలగించారు. కొత్త కమిటీ మే 12న దాని పత్రిక అయిన "చారిత్రక సమీక్ష" సంపాదక వర్గాన్ని, సలహా మండలిని రద్దు చేయాలని నిర్ణయించింది. ఈ కమిటీలో ప్రఖ్యాతి చెందిన చరిత్రకారులు రొమిల్లాథాపర్, ఇర్ఫాన్ హబీబ్, రిచర్డ్‌గా ఎం. ఈటన్, ప్రొఫెసర్ హెర్మన్ రుల్కే, ప్రొఫెసర్ విలియం క్లోస్ సభ్యులుగా ఉన్నారు. సంస్థ (ఐసిహెచ్ఆర్) కొత్త ఛైర్మన్‌గా పురాణాలు, రామాయణం,మహాభారతం చారిత్రక సంఘటనలుగా రుజువు చేయడానికి విస్తృత రచనలు చేసిన ఎన్. సుదర్శనరావు నియమింపబడ్డారు (ఆయన నవంబర్ 24న కొన్ని ఆసక్తికరమైన కారణాలతో రాజీనామా చేశారు)

నేషనల్ బుక్ ట్రస్ట్‌కు మార్చి 3, 2015న బలదేవ్ శర్మను ఛైర్‌పర్సన్‌గా నియమించారు. కేవలం రెండు సంవత్సరాల క్రితమే ఈయనను ఆర్ఎస్ఎస్ విభాగమైన పాంచజన్య ఎడిటర్ బాధ్యతల నుంచి తొలగించారు.

పరశోలి మోటార్స్‌కు ముఖ్య కార్యనిర్వహణాధికారి, మేనేజింగ్ డైరెక్టర్ గుజరాత్‌లో బిఎండబ్ల్యూకు ఏకైక డీలర్ అయిన వ్యాపారవేత్త జాఫర్ సరేష్ వాలాను జనవరి 2, 2015న హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్శిటీకి ఛాన్సలర్‌గా నియమించారు.

విద్యా విషయకంగా విధానాలను రూపొందించే దానిలో దేశంలో అత్యున్నత విభాగము కూడా ఇదే విధమైన చర్యకు గురైంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధీనంలో ఉన్న కేంద్ర విద్యా విషయక సలహామండలి, గొప్ప పాండిత్యంగల (చక్కగా నేర్చిన) స్మృతి ఇరానీగారి చేత పునర్నిర్మాణం చేయబడింది. యోగా గురువులు, సంస్కృత మేధావులు, నటులు, ఆర్ఎస్ఎస్ అనుబంధంగా ఉన్న పరిశోధనా మండలికి ప్రధాన బాధ్యులుగా ఉన్నవారిని ఇందులో నియమించారు. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధ సంస్థ అయిన శ్యాంప్రసాద్ ముఖర్జీ పరిశోధనా మండలి డైరెక్టర్‌గా ఉన్న అనిల్ బాన్ గంగూలీని దీనికి హెడ్‌గా నియమించడం చేశారు.

నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ మేధావి అయిన అమర్త్యసేన్‌ను నలంద యూనివర్శిటీ ఛాన్సలర్ బాధ్యతల నుండి తొలగించారు. ఆయన జులై 17, 2015న తొలగించబడ్డారు. ఆయన ఆగస్టులో విడుదలైన న్యూయార్క్ పుస్తక సమీక్షకు వ్రాసిన ఒక వ్యాసంలో ఇలా వ్రాశారు. "మధ్యలో ఇంత పెద్దఎత్తున జోక్యం చేసుకోవడం గతంలో లేదు. గతంలో నామమాత్రపు పాత్ర నిర్వహించిన ప్రతి ప్రభుత్వ సంస్థలో ప్రస్తుతం ప్రభుత్వం ఖచ్చితంగా దృఢమైన పాత్ర నిర్వ హిస్తున్నది"

టాటా ఫండమెంటల్ రీసెర్చి సంస్థ ఆ విధంగా ఇబ్బంది పడుతున్నది. ఢిల్లీ ఐఐటి డైరెక్టర్ రఘునాథ్ షెంగ ఓంకార్ రాజీనామా చేశారు.

అత్యున్నత గౌరవనీయ మేధావి, న్యూఢిల్లీ లోని నెహ్రూ స్మారక మ్యూజియం, గ్రంథాలయం యొక్క డైరెక్టర్ అయిన మహేష్ రంగరాజన్ సంస్థను వదిలి వెళ్ళిపోయే విధంగా బలవంతం చేశారు. ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ జీన్ డ్రెజ్‌ను 2015 నవంబర్ 4 కార్యక్రమానికి ఆహ్వానించలేదు. భారతీయ జనతాపార్టీతో రక్త సంబం ధం కలిగిన గజేంద్ర చౌహాన్‌ను భారతీయ సినిమా, దూరదర్శన్ సంస్థకు అధ్యక్షుడిగా నియమించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ సంస్థ విద్యార్థులు నెలల తరబడి ఆందోళన చేశారు. "ప్రముఖ వ్యక్తులు"గా ఆ సంస్థలో నియమించ బడిన ఎనిమిది మందిలో నలుగురు ఆర్ఎస్ ఎస్‌తో సంబంధం ఉన్నవారు. కావాలని ఇష్టం వచ్చినట్లుగా తమవారిని పెట్టుకున్నారు.

కేంద్ర చలన చిత్రాల యోగ్యతా పత్రాల నిర్ధారణ సంస్థ ఛైర్మన్‌గా పహ్లాజ్ నిహలాని యొక్క నియామకం మొత్తంగా దౌర్జన్యకరం. ఆయన మోడీపైన అభివృద్ధికరమైన వీడియోలు తయారుచేశాడు. శక్తివంతమైన జాతీయ చిత్ర అభివృద్ధి సంస్థకు (ఎన్ఎఫ్‌డిసి) భారతీయ జనతాపార్టీ మద్దతుదారుడైన సురేష్ గోపి నియమించబడ్డాడు.

"జాతీయ ప్రాధాన్యత కలిగిన సంస్థలకు అధిపతులుగా ఎంపిక చేయబడే వ్యక్తులు తగినంత అసాధారణంగా, అంకితభావంతో పని చేసేవారుగా, హిందూత్వ విధానాలను ముందుకు తీసుకుపోయే వారిని నియమిస్తున్నారు. సవ్యసాచి భట్టాచార్య ఐసిహెచ్ఆర్‌లో ఇమడలేక రాజీనామా చేశారు. అదే మాదిరిగా భారతీయ సాంస్కృతిక సంబంధాల సంస్థ (ఐసిసిఆర్)కు నూతన అధిపతి అయిన లోకేష్ చంద్ర మోడీ ప్రభుత్వం చేత నియమించబడ్డారు. అదే విషయాన్ని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తెలియజేసింది. "ఒక కార్యాచరణ పథకం ప్రకారం మహాత్ముడిని (గాంధీ) తొలగించారు" నిజానికి మోడీ "దేవుని యొక్క అవతారము" అని చంద్ర అన్నారు.

నిజానికి ఇది మొత్తం ఒక పథకం ప్రకారం తొలగించడం అని పైన చెప్పబడిన ఎనిమిది ఉదాహరణలు తెలుపుతున్నాయి. ఇవి అణిగి మణిగి ఉండండి లేదా తొలగిపోండి అనే విషయాన్ని బహిర్గతపరుస్తున్నాయి. మోడీ "ఐదు నక్షత్రాల స్వచ్ఛందసంస్థల కార్యకర్తలు"గా మానవ హక్కుల చాంపియన్స్‌గా పిలిచేవారిలో పర్యావరణ వినాశనం గురించి బ్రిటన్‌లోని ఎంపిలకు చెప్పాలని బయలుదేరిన ప్రియా పిళ్ళై ఆపి వేయబడింది. ఛత్తీస్‌ఘర్‌లోని ఎస్సార్ కంపెనీ పర్యావరణానికి కలిగించిన నష్టాన్ని గురించి చెప్పడానికి బయలుదేరినందువల్ల తనను నిలిపివేసినట్లుగా ఆమె ఆరోపించింది.

> **"సెప్టెంబర్ 28న ఉత్తరప్రదేశ్‌లోని దాద్రి లో మహమ్మద్ అక్‌లాఖ్‌ను విచారణ లేకుండా హత్యచేసిన సంఘటన దీర్ఘకాలం ప్రభుత్వానికి గుర్తుండిపోతుంది. ఆ సంఘటనను ఖండించా నికి మోడీ యొక్క మూర్ఖమైన తిరస్కరణ మరింత దుర్మార్గం. చాలా ఆలస్యంగా అక్టోబర్ 14వ తేదీన ఇది "అవాంఛనీయం, దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు."**

మతపరమైన మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న నరేంద్ర దభోల్కర్ యొక్క హత్యను ఆమె ఉదహరించింది. ఫిబ్రవరి నెలలో కమ్యూనిస్టు నాయకుడు గోవింద్ పన్సారే యొక్క హత్య జరిగింది, అలాగే ఆగస్టు నెలలో 77 సంవత్సరాల వృద్ధ మేధావి, మంచి ఉపన్యాసకుడు అయిన ఎం.ఎం. కల్బుర్గి హత్య జరిగింది. జూన్ 4, 2015న 28 సంవత్సరాల ఐటి మేనేజర్ అయిన మొహిసిన్ మహ్మద్ షేక్ పూనాలో హిందూ అతివాదుల చేత హత్య గావించబడ్డారు. అని టైమ్స్ ఆఫ్ ఇండియా తెలిపింది (జూన్ 5, 2015).

సెప్టెంబర్ 28న ఉత్తరప్రదేశ్‌లోని దాద్రిలో మహమ్మద్ అక్‌లాఖ్‌ను విచారణ లేకుండా హత్యచేసిన సంఘటన దీర్ఘకాలం ప్రభుత్వానికి గుర్తుండిపోతుంది. ఆ సంఘటనను ఖండించానికి మోడీ యొక్క మూర్ఖమైన తిరస్కరణ మరింత దుర్మార్గం. చాలా ఆలస్యంగా అక్టోబర్ 14వ తేదీన ఇది "అవాంఛనీయం, దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు.

హోంమంత్రి చూపిన లెక్కల ప్రకారం ఈ సంవత్సరం( 2015) జూన్ నెల వరకు 330 మతపరమైన అల్లర్లు జరిగాయి. 51 మంది ప్రాణాలు పోయాయి. 2014 మొదటి ఆరు నెలల్లోనే ఆ రకమైన కేసులు 252 వరకు నమోదయ్యాయి. 23 చావులు నమోదయ్యాయి. అయితే ఈ సంఘటనలతో కేంద్రం ఏమి పొందింది? ఇలా ఎందుకు? ఒరిస్సాలో ఆస్ట్రేలియాకు చెందిన గ్రాహం స్టీవార్డ్ స్టెయిన్స్, అతని 9 మరియు 6 సంవత్సరముల వయస్సు కలిగిన ఇద్దరు కుమారులను సజీవంగా కాల్చి చంపారని తెలిసిన వెంటనే అప్పట్లో రాష్ట్రపతిగా ఉన్న కె.ఆర్. నారాయణన్ 1999 జనవరి 24న వెంటనే ఖండించారు. ఈ సంఘటన ఒరిస్సాలో జనవరి 22-23 రాత్రి జరిగింది. ఇవి "ప్రపంచం యొక్క నిషిద్ధ పనులకు చెందినవి" అని ఆయన అన్నారు. డిసెంబర్ 6, 1992 న జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసాన్ని ఆనాటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ వెంటనే ఖండించారు.

**అసహన వాతావరణం**

ఎవరైతే దేశంలో వాతావరణాన్ని మార్పు చేయగల ఉన్నత నాయకత్వ స్థానంలో ఉన్నారో వారు చట్ట విరుద్ధమైన వాతావరణం, అసహనంతో కూడిన నేరాలు పెరగడానికి సహకరించే వారుగా ఉన్నారు. ఈ అసహన వాతావరణం రచయితలు, మేధావులు, కళాకారులు తమ అవార్డులను వెనక్కి ఇచ్చే విధంగా పరిస్థితులను మార్చింది. ప్రముఖ విశ్వవిద్యాలయాలకు చెందిన వందమందిపైగా ప్రఖ్యాత చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు అసహనానికి వ్యతిరేకంగా సంఘీభావాన్ని తెలియ చేస్తూ బహిరంగ లేఖ రాశారు. భారతీయ చరిత్రకారుల చేత అక్టోబర్ 26న విడుదల చేయబడిన ప్రకటనకు తమ సంఘీబావాన్ని తెలుపుతూ దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల పట్ల తమ ఆందోళనను వ్యక్తం చేశారు. (ది హిందూ నవంబర్ 10, 2015) కేవలం మోడీని గుడ్డిగా సమర్ధించే వారు మాత్రమే సహజసిద్ధమైన ఈ రకమైన (అభిప్రాయాలను) వ్యక్తీకరణలను పరిహసిస్తారు. శుభ్రపరచడం, పగ తీర్చుకోవడం, అసహ్యకరమైన ఉపన్యాసాలు, హత్యలు చేయడం లాంటివన్నీ కలిసి విషపూరిత వాతావరణాన్ని సృష్టించాయి. నేరాలను ప్రోత్స హించే విధంగా హత్యలకు సహకరించే వాతా వరణాన్ని సృష్టిస్తున్నారు. భారతదేశ జీవన మార్గాన్ని కాపాడటానికి భారతీయులు నరేంద్ర మోడి, ఆయన అను చరులతో పోరాడుతున్నారు. ❊

**(అనువాదం: కె నాగమల్లేశ్వరరావు)**

# రిజర్వేషన్లు మోదీ అంబేద్కర్

(18వ పేజీ తరువాయి)

నప్పుడు హిందూమతం నుంచి వేరుపరచి 'షెడ్యూల్డు కులం' అనే ప్రత్యేక తరగతిని ప్రవేశపెట్టారు. హిందూమతం నుంచి వీరిని వేరుపరచారు. రాజ్యాంగ రచన సమయంలో అంటరానితనాన్ని నిషేధించినట్లు కులాన్ని కూడా చట్టవిరుద్ధంగా ప్రకటించి ఉండాల్సింది.

మన సమాజం తరతరాలుగా సమానులుగా చూడకపోవడం వల్ల అంటే మన తప్పుల వల్ల రూపొందిన ప్రత్యేక తరగతి ప్రజలకోసం ప్రవేశపట్టిన ప్రత్యేక సౌకర్యం రిజర్వేషన్ల విధానమని మొదట్నుంచీ ప్రచారం చేయవలసింది. అప్పుడు సమాజంలో తమ పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన అవసరం గురించిన చైతన్యం పెరిగి ఉండేది. ఈ చైతన్యం కులనిర్మూలన దిశగా ఉద్యమరూపం దాల్చి ఉండేది. విస్తృత సామాజిక ఆకాంక్ష మాత్రమే కుల నిర్మూలనను సాధ్యం చేయగలదు. అందుకు భిన్నంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు అనే సూత్రం నిమ్నకులాల వారిని తక్కువ చేసి చూపు తున్నది. ఇది అణగారిన కులాల వారి శక్తిసామర్థ్యాల పట్ల సమాజంలో చోటు చేసుకున్న చులకన భావనను పెంచి పోషిస్తున్నది.

**పథకం ప్రకారమే..**

రాజ్యాంగ నిర్ణాయక సభ ఈ కీలకాంశాన్ని గుర్తించకపోవడ మనేది అమాయ కత్వమేమీ కాదు. పాలకవర్గాల రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించుకునేందుకు పన్నిన వ్యూహమే ఈ తరహా రిజర్వేషన్ల విధానం. లబ్దిదారులకే మళ్లీ లబ్ధి చేకూర్చుతూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఇది సృష్టిస్తున్నది. ఈ వర్గం పాలక వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తుం దనేది అసలు ఉద్దేశమన్నమాట.

నయా ఉదారవాద విధానాల వల్ల ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు దాదాపు నిలిచిపోయాయి. ఐఐటీ, ఐఐఎమ్ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్ సీట్లు ఏళ్ల తరబడి భర్తీ కావడం లేదు. దళితులు, ఆదివాసీ అభ్యర్థుల కొరత ఉంది. కులం పేరిట రిజర్వేషన్లు అందుతాయి. ఇది ఆ వర్గం పట్ల వ్యతిరేకతను పెంచుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో దళితుల పట్ల పెరుగుతున్న అకృత్యాలే ఇందుకు నిదర్శనం. రిజర్వేషన్ల లబ్ధిదారులుగా ఎక్కువగా పట్టణ ప్రాంతవాసులే ఉంటున్నారు. గ్రామీణ దళిత విస్తృత ప్రజానీకం దాకా ఇవి చేరడం లేదు. రిజర్వేషన్ల విధానం అంబేద్కర్ కులనిర్మూ లన ప్రాజెక్టుకు పూర్తిగా గండికొట్టింది. బడి వయసులోనే దళిత విద్యార్థులు తక్కువకులం వారిమనే ఆత్మన్యూనతా భావానికి, మానసిక సంక్షోభానికి లోనయ్యే పరిస్థితి చోటు చేసుకుంటు న్నది. మరోపక్క పాలకవర్గాలు రిజర్వేషన్ల తాయిలం చూపి ప్రజారోగ్యం, విద్య, ఉపాధి కల్పన వంటి మౌలిక వసతుల కల్పనను విస్మరిస్తున్నాయి.

తన లక్ష్యానికి ఏర్పడిన గండిని అంబేద్కర్ స్వయంగా గుర్తించారు. 1953లో ఆగ్రాలో మాట్లాడుతూ చదువుకున్న దళితులు తనను వంచించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తనలాగా, చదువుక్ను దళితులు ప్రధాన ప్రభుత్వ పదవుల్ని ఆక్రమించి దళితుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తారని ఆయన భావిం చారు. అందుకు భిన్నంగా వారు వ్యవహరిం చడాన్ని బాబాసాహెబ్ గమనించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసిన దళితుల వర్గదృష్టి మారిపో తుందని, పర్యవసానంగా వారు దళిత ప్రజా నీకానికి దూరమవుతారని అంబేద్కర్ గుర్తించలేక పోయారు. బాబాసాహెబ్ నేడు జీవించి ఉంటే ప్రస్తుత రిజర్వేషన్ల విధానాన్ని రద్దు చేయమనే వారు. రిజర్వేషన్ల ప్రయోజనాల్ని వీటి వల్ల లాభపడ్తున్న దెవరు? సామాజిక భారాన్ని మోస్తున్నదెవరన్న దృష్టికోణం నుంచి చూడాల్సి వుంది. **అనువాదం : బి.భాస్కర్ (సీనియర్ జర్నలిస్టు)**

---

# నేను కమ్యూనిస్టును... కాక పోతినే

(19వ పేజీ తరువాయి)

మాట నిజమే గాని తర్వాత సరళీకరణ గరళం తెచ్చిపోసి దళితులు, బలహీనులకు ఉన్న అవకా శాలు కూడా దెబ్బతీయడానికి ఆరంభ వాక్యం వారిదే కదా? దళిత నేతలకు కొందరికి పదవు లిచ్చి ఆ పేరుతో కోట్లమందిని కుటిల రాజ కీయాలకు బలిచేయడం నిజం కాదా? కమ్యూ నిస్టులు కార్మికులను, వ్యవసాయ కార్మికులను సంఘటిత పర్చి పోరాటాలు ప్రారంభిస్తే గంగవెర్రులెత్తి దాడులు దుష్ప్రచారాలు చేసింది కాంగ్రెస్‌నేతలు కాదా? ఇదంతా కాదనలేని చరిత్ర. వాటిని ప్రస్తావించకుండా ప్రక్షాళన చేసుకోకుండా ఇప్పుడు దళితులకు మళ్లీ కనెక్టు కావాలని రాహుల్‌గాంధీ ఆధునిక భాషలో చెప్పినంత మాత్రాన అంతా కరెక్ట్ అయిపోదు. కమ్యూనిస్టులు కూడా ఇప్పుడే కదా అంబేద్కర్‌ను ఇంతగా మాట్లాడుతున్నది అని అడగొచ్చు. నిజమే. దానికి వారూ సమాధానం చెప్పుకోవల సిందే. కానీ బిజెపి కాంగ్రెస్‌లాంటి పార్టీలకూ వారికి తేడాను చూడక తప్పదు. దోపిడీలను, పీడనలను, కుల, మత ఛాందసవాదులను వారు యువజన సంఘాల ద్వారా సవాల్ చేశారు. పీడిత ప్రజలలో కొత్త కదలిక తెచ్చి పూరారా సమీకరించి సంఘటిత పర్చింది వారేనన్నది ఎవరూ కాదనలేని సత్యం...ఆయనకూ సైద్ధాంతిక తేడాలున్నా ప్రభుత్వ యాజమాన్యం ఉండాలని గట్టిగా భావించారు.

వారు పారిశుధ్య కార్మికులది కర్మయోగం అనలేదు, హక్కుల కోసం కదిలించి పోరాడారు. అయితే కుల వివక్షపైన సామాజిక సమస్యలపైన మరింత ఎక్కువగా పోరాటం చేసి ఉండాల్సిం దని బహిరంగంగానే ఆత్మవిమర్శ చేసుకుని కొత్త వేదికలతో ముందుకు వచ్చారు. సబ్‌ప్లాన్, పున్నయ్య కమిషన్ వంటి వాటికి కారకుల య్యారు. చాలామంది దళిత సంఘాల నాయకు లు ఇప్పుడు సహజ మిత్రులుగానే గాక నికరమైన మిత్రులుగా స్వీకరిస్తున్నారు. ఇంకా దళితుల వెనుకబడిన తరగతుల మహిళల భాగస్వామ్యం నాయకత్వం పెంచుకోవలసిందేనని కమ్యూని స్టులూ గుర్తిస్తున్నారు. కానీ అధికారంలో వాటా వారు ఇవ్వలేరు పోరాట పతాకమైతే ఇవ్వగల్గు తారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అలాంటి ఒక ముఖ్యమైన పోరాట నినాదం.

ఇక్కడే అసలైన సత్యం ఒకటుంది. పాలకులు ఏదో ఒరగబెడతారని ఒకప్పుడు దళిత జన బాహుళ్యం నమ్మి మోసపోయారు. కానీ ఇప్పటికి కొందరు వారి తరపున మాట్లాడే మేధావులు ఏవో పదవులు తీసుకోవడమే రాజ్యాధికారంలో భాగమైనట్టు చెబుతుంటారు. ఇందుకోసం బిజెపితో కూ డా చేతులు కలిపిన సందర్భాలు ఎలాంటి ఫలితాలకు దారితీశాయో దేశమంతా చూసింది. మరికొందరు ప్రపంచీకర ణలో విముక్తిని చూపిస్తున్నారు.

ఇవన్నీ కూడా మంచివే గాని పాక్షికమైన ఆలోచనలు. అంబే ద్కర్ ఆనాడే చెప్పినట్టు ఆర్థిక సామాజిక సమానత్వం కనీసం సాధికారత సాధించినప్పుడే రాజ్యాంగంలోని రాజకీయ హక్కులు సార్థకమవు తాయి. ఇప్పుడున్న దేశీయ ప్రపంచ పరిస్థితు లలో అది ఎదురీతే. దానికి గొప్ప పోరాటం అనివార్యం. మార్టిన్‌లూథర్ కింగ్‌కన్న కలకు అమెరికా ఇంకా ఎంత దూరంలో ఉందో ఈ కర్మభూమి అంబేద్కర్ మహాప్రస్థాన లక్ష్యానికి అంతకన్నా దూరం ఉంది. ఏతావాతా విగ్రహా లకు నమస్కరిస్తూనే వినాశకర విధానాలను తిరస్కరించకపోతే వివక్ష కొత్త రూపాలు తీసుకుంటుంది. విముక్తి మిథ్యే అవుతుంది. ఆయన జీవితం 125 ఏళ్ల సందేశమూ అదే హెచ్చరిక అదే. ❋

# విజ్ఞాన వారధి, జనసారథి

(2వ పేజీ తరువాయి)

మార్గం మరొకటి లేదని విశ్వాసం ఏర్పడాలి" అంటూ డా॥ బి.ఆర్. అంబేద్కర్ తమవారి అభ్యున్నతికి స్కూళ్ళు, హాస్టళ్ళు నిర్మించి వాటి ద్వారా విద్యావ్యాప్తికి, పాఠశాలలు సాంస్కృతిక సభలు, నాటకాల ద్వారా నాగరికతను, సంస్కృతిని అభివృద్ధి చేయటానికి, పరిశ్రమల్లో సాంకేతిక పరమైన శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకమైన విద్యాకేంద్రాల ఏర్పాటు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెస్తూ, వాటి పరిష్కారానికై కృషి చేయటమే ముఖ్య లక్ష్యాలుగా 1924 మార్చి 9న "బహిష్కృత హితకారిణిసభ"ను స్థాపించడం జరిగింది. దీనికి న్యాయవాది డా॥ సర్ చిమన్ లాల్ శీతల్ వాల్‌ను అధ్యక్షులుగా, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ను నిర్వాహక అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

1927 ఫిబ్రవరి 18న విధానమండలి సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. ఫిబ్రవరి 24న విధాన మండలిలో మొదటిగా బడ్జెట్‌మీద ఉపన్యసించారు. పన్ను కట్టే వారి దృష్ట్యా ఆ బడ్జెట్ ఎంత అన్యాయమైనదో తేటతెల్లం చేశారు. ముందుచూపుతో వ్యవసాయంమీద పన్ను వెయ్యాలని సూచించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ విద్యా విధానం, వైద్య సదుపాయాల కల్పన, ప్రజలను దురలవాట్ల నుంచి దూరం చేసేందుకై చేస్తున్న కార్యక్రమాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నానని తెలియజేస్తూ ముగించారు. ఈ ఉపన్యాసంతో ఆయన పాండిత్యం, అర్థశాస్త్రంపై ఉన్న పట్టు, వాగ్ధాటి, విషయ పరిజ్ఞానం సభ్యులకు బాగా తెలిశాయి.

అంబేద్కర్ అస్పృశ్య సమాజంలోని వారికి తమపై తమకు అభిమానాన్ని నింపుతూ వారి వ్యక్తిత్వాన్ని మేలుకొలిపే ప్రయత్నం చేశారు. ఆత్మగౌరవంతో జీవించేట్లు ప్రయత్నిస్తూ వచ్చారు. అస్పృశ్యులకు ఉమ్మడి వనరులను ఉపయోగించుకునే సదుపాయం చట్టబద్ధంగా కల్పించబడింది. ఐనా పెత్తందారీ వర్గాలు దానిని అమలు జరగనివ్వని పరిస్థితి. ఇట్లాంటి ఇవ్వబడిన హక్కులను ఉపయోగించుకొనే చైతన్యాన్ని పెంపొందించే ప్రయత్నం డా॥ బి.ఆర్. అంబేద్కర్ చేశారు. దీనికి 1927 మార్చి 19వ తేదీన మహద్‌లో పరిషత్‌ను ప్రారంభించారు. మహద్ మున్సిపాలిటీ చేసిన నిర్ణయాన్ని అమలు పరిచే లక్ష్యంతో బాబాసాహెబ్ మార్చి 20న ముందడుగు వేయగా దాదాపు 5000 మంది అస్పృశ్యులు చాబ్‌దార్ చెరువు గట్టుకు చేరుకున్నారు. బాబాసాహెబ్‌తో కలిసి యావన్మంది చెరువులోని మంచినీటిని తాగి తమ హక్కును రుజువు చేశారు. 1930 మార్చి 2న 15,000 మంది జనంతో ఆలయ ప్రవేశం కోసం సత్యాగ్రహ యుద్ధ భేరిని మోగించారు.

మొదటి రౌండ్‌టేబుల్ సమావేశానికై 1930 అక్టోబర్ 18న లండన్ చేరుకున్నారు. అస్పృశ్యుల హక్కులను గూర్చి, భారత సమాజంలోని వారి హీనస్థితిని గూర్చి, వారి అభ్యున్నతికై తీసుకోవల్సిన చర్యలను గూర్చి ఎంతో స్పష్టంగా, నిక్కచ్చిగా వివరించగలిగారు. సైన్యంలో అస్పృశ్యులను చేర్చుకొనే అవకాశాలపై సైన్యాధికారితో చర్చించి, దానిపై ఓ వివరణ పత్రం తయారు చేశారు. అస్పృశ్యుల దృష్టిలో స్వరాజ్యం ఎలా అవసరమో స్ఫూర్తిని కలిగించే తన ఉపన్యాసంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ నొక్కి చెప్పారు. ఈయన ఉపన్యాసం సర్వోన్నత ఉపన్యాసంగా కీర్తింపబడింది. 1931 సెప్టెం బర్ 12న ఫెడరల్ స్ట్రక్చర్ కమిటీలో గాంధీ మొట్టమొదటిగా ఉపన్యసించారు. 1931 నవంబర్ 5న ఇంగ్లండ్ చక్రవర్తి ఇచ్చిన విందు సందర్భంలో భారత్‌లోని దళితుల దీనస్థితిని అంబేద్కర్ నోటివెంట విని చక్రవర్తి మనసు కరిగిపోయింది.

భారతదేశంలోని పీడిత వర్గాల దాస్యశృంఖలాలకు కారణం 'కులం' అని గుర్తించి దాని నిర్మూలనకు 'కుల నిర్మూలనా' గ్రంథాన్ని 1936 మే 15న విడుదల చేశారు. 1936 ఆగస్టు 15న 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ' స్థాపించారు. 1940 సంవత్సరంలో 'థాట్స్ ఆన్ పాకిస్తాన్'ను ప్రచురించారు. 1942 జులై 2న వైస్రాయ్ కౌన్సిల్ లేబర్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈయన తన పదవీకాలం 1946 వరకు కార్మికుల సమస్యల పరిష్కారానికి విస్తృతంగా పర్యటించారు. తేయాకు, బొగ్గుగని కార్మికుల వద్దకు వెళ్ళేవారు. కనీస వేతనాలు, ప్రసూతి సెలవులు, వైద్య సౌకర్యం, పని గంటలు, భద్రతా చర్యలు, కార్మికుల పిల్లలకు విద్య, జీవిత బీమా సౌకర్యాలను కల్పించారు. వీటిని స్వాతంత్ర్యానంతరం వచ్చిన రాజ్యాంగంలోనూ పొందుపరచటం జరిగింది. కార్మికులకు విస్తృత సౌకర్యాలు కల్పించటం జరిగింది. 'గాంధీ, కాంగ్రెస్ అంటరాని వాళ్ళకేం చేశారు?' పుస్తకాన్ని 1945లో అంబేద్కర్ విడుదల చేశారు. 1945 జులై 8న ముంబాయిలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌ను స్థాపించారు.

స్వాతంత్ర్యం లభించే సమయం దగ్గర పడుతుంది అని తెలిసేసరికి బాబాసాహెబ్ రాజ్యాంగ ముసాయిదాను తయారుచేసి రాజ్యాంగ కమిటీకి సమర్పించారు. 1947 మార్చిలో ఈ ముసాయిదా 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' పేరుతో అచ్చయింది. భారతదేశపు భవిష్యత్ రాజ్యాంగంలో పౌరులకు ఎటువంటి మౌలిక హక్కులు ఉండాలో, అల్పసంఖ్యాకులకు భద్రత ఎలా లభించగలదో, వారి రక్షణకు ఏ ఏర్పాట్లు చెయ్యాలో మొదలైన విషయాలు స్పష్టీకరణతో పొందుపరచబడ్డాయి. 1946 ఎన్నికలను స్పష్టంగా గణాంకాలతో సహా విశ్లేషణ చేసి, పూనా ఒప్పందం దళితులకు ఏవిధంగా హానికరమైనదో ఆయన ఋజువు చేశారు. బీమా కంపెనీల జాతీయకరణ, పరిశ్రమల జాతీయకరణ, వ్యవసాయ జాతీయకరణలను ముఖ్యంగా ఈ డ్రాఫ్ట్‌లో సూచించటం జరిగింది. మొట్టమొదట వెలువడిన మంత్రివర్గ జాబితాలో 1947 ఆగస్టు 3న అంబేద్కర్‌ను న్యాయశాఖామాత్యునిగా పొందుపరిచారు. ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. ఆగస్టు 29వ తేదీన రాజ్యాంగ సభ రాజ్యాంగ ముసాయిదాను తయారు చేయటానికి బాబాసాహెబ్ అధ్యక్షత కమిటీని ఏర్పాటు చేసింది. భారత భవిష్యత్ నిర్మాణ కార్యం తన భుజస్కందాలపై సమర్థవంతంగా మోసి, ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని అందించారు. అంబేద్కర్ 1949 నవంబర్ 29వ తేదీ సభికుల హర్షధ్వానాల మధ్య ఆమోదించారు. 1950 జనవరి 26న దేశ రాజకీయ జీవితంలో సమానత్వం అడుగు పెట్టింది. అంబేద్కర్ ఇలా అన్నారు "సాంఘిక జీవితంలోనూ ఆర్థిక జీవితంలోనూ అసమానత్వమే నిలిచి ఉంటుంది. ఈ వ్యత్యాసం అలానే ఉంటే ఈ వ్యత్యాసపు తాపంతో ఉడుకెత్తిన వర్గం మనం ఎంతగానో శ్రమించి నిర్మించిన ఈ రాజకీయ భవనాన్ని ధ్వంసం చేయక మానరు. అందుకని పాలకులు ఈ వ్యత్యాసాలను తగ్గించే ప్రయత్నాలు చెయ్యాలి" అని హెచ్చరించారు.

సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీ జాతికి సంబంధించిన స్వేచ్ఛను అందించటానికి, మనువు చెక్కిన హిందూ సాంప్రదాయ స్మృతి, శాసనాల నుంచి విముక్తిని ప్రసాదించటానికి గాను "హిందూకోడ్ బిల్లు" కోసం అహర్నిశలు శ్రమించారు. సమాజంలో వ్యక్తి వికాసానికి అడ్డంకులు సృష్టిస్తున్నది మనుధర్మశాస్త్రమేనని పూర్తిగా విశ్వసించారు. అందుకే 80 శాతం జనాభాగల దేశ ప్రజలకు విద్యను నిరాకరించిన మనుధర్మ శాస్త్రాన్ని 1927 డిసెంబర్ 25వ తేదీన బహిరంగంగా దహనం చేశారు. పౌర సమానత్వానికి బీజం వేశారు. స్త్రీ సమానత్వాన్ని వ్యతిరేకిస్తున్న, వారి అభ్యున్నతికి అడ్డంకిగా నిలిచిన ప్రభుత్వంలో మనలేక, నిరసనగా తన మంత్రి పదవినే తృణప్రాయంగా త్యజించారు. 1956 డిసెంబర్ 6న అనారోగ్య కారణంగా మృత్యువు కౌగిలిలో చేరిపోయారు. పౌర విలువలకు ప్రాధాన్యతనిచ్చారు. స్వేచ్ఛా సమానత్వపు వాయువులను కాంక్షించారు. అందుకే ఆయన ఆదర్శనీయుడు, బహుజనుల భవిష్యత్ పితామహుడు అయ్యారు. ❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-05-2016 Postal Regd. No H/SD/407/16-18

# చాతుర్వర్ణ వ్యవస్థ సాంఘిక విప్లవానికి అడ్డుపడింది



**- డా॥ బి.ఆర్. అంబేద్కర్**

వివిధ వర్గాల మధ్య బాలుడికీ, సంరక్షుడికీ మధ్య ఉండవలసిన సంబంధం ఉండడమే చాతుర్వర్ణ్య సిద్ధాంతంలోని ప్రధాన లక్ష్యం అని అనుకొన్నప్పటికీ బాలుడి ప్రయోజనాలను రక్షకుల దుష్కృత్యాల నుంచి కాపాడడానికి ఏ విధమైన నిబంధననూ ఈ సిద్ధాంతం చెయ్యడం లేదు కదా! చాతుర్వర్ణ సిద్ధాంతం లక్ష్యం బాలునికీ, సంరక్షకునికి మధ్య ఉండే సంబంధం మీద ఆధారపడినదే నని అనుకొన్నప్పటికీ, వాస్తవంగా అనుసరణలో మాత్రం అది సేవకుడికీ, యజమానికీ, మధ్య ఉండే సంబంధంగా తయారైందనడం నిస్సందేహం కాదా? బ్రహ్మణ, క్షత్రియ వైశ్య ఈ మూడు వర్గాల మధ్య సంబంధమూ అంత సామరస్యంగా లేనప్పటికీ ఏదో ఒక విధంగా అవి కలిసి బ్రతకడం నేర్చుకొన్నాయి. బ్రహ్మణుడు క్షత్రియుడిని బాగా పొగుడుతాడు. వారిద్దరూ కలిసి తాము అతనిపై బ్రతకడం కోసం వైశ్యుడ్ని బ్రతకనిస్తారు. అయితే ముగ్గురూ శూద్రుడ్ని తొక్కిపట్టి ఉంచడంలో ఏకమవుతారు. శూద్రుడు ధనం సంపాదించకూడదన్నారు. సంపాదిస్తే అతడు ఈ మూడు కులాలకూ లోబడకుండా స్వతంత్రుడవుతాడని వారి భయం. శూద్రుడు విద్యార్జన చెయ్యకూడదన్నారు. చేస్తే తన ప్రయోజనాలను గురించి తెలుసుకొని జాగ్రత్తపడతాడని వారి భయం. శూద్రుడు ఆయుధాలు ధరించకూడదన్నారు. ధరిస్తే తమ అధికారాన్ని ధిక్కరించి ఎదురు తిరుగుతాడని వారిభయం. పై మూడు వర్ణాల వారు శూద్రుల పట్ల అనుసరించిన విధానం ఇది అని చెప్పడానికి మనుధర్మశాస్త్రం ప్రబల సాక్ష్యం. సాంఘీక హక్కుల విషయంలో మనుధర్మ శాసనాలను మించిన అఘాయిత్యపు దుష్ట శాసనాలు ప్రపంచంలో మరెక్కడా లేవు. ప్రపంచంలో సాంఘీక దురన్యాయాలు ఎక్కడైనా జరిగి ఉంటే, అట్టి ఉదంతాలు ఈ మనుధర్మ శాసనం ముందు గడ్డి పరకలు. అంతటి ఆ ప్రతిష్టాకరమైనట్టిది మనుస్మృతి. ఇంతటి దుష్టమైన సంఘపీడనను, అన్యాయాన్ని ప్రజానీకం ఎందుకు భరించినట్టు?

ప్రపంచంలో అన్ని దేశాలలోను సాంఘీక విప్లవాలు జరిగినట్లు భారత్‌లో ఎందుకు జరగలేదన్నది నిరంతరం నన్ను వేధించే ప్రశ్న. బహుశ అందుకు ఒకే ఒకటి కారణమై ఉండవచ్చు. అది హిందువులలోని దిగువ తరగతుల ప్రజలను పనికిమాలిన చాతుర్వర్ణ్య వ్యవస్థ పేరుతో అణచిపెట్టి ఉంచి ప్రత్యక్ష చర్యకు పూర్తిగా పనికిరాకుండా చేయడమే. వారు ఆయుధాలు ధరించకూడదు. ఆయుధాలు లేకుండా తిరుగబాటు సాధ్యం కాదు. వాళ్ళు సేద్యగాండ్రుగా నిర్ణయించబడ్డారు. కానీ తమ నాగళ్ల కరుకోలలనైనా ఖడ్గాలుగా చేసుకోవడానికి వారికి వీలులేదు. ఏ రకమైన ఆయుధాలు వారికి లేవు. అందువల్లనే ప్రతివాడూ తలపై ఎక్కి కూర్చున్నాడు.

చాతుర్వర్ణ్య వ్యవస్థ కారణంగానే ఈ దిగువ కులాల ప్రజలు విద్యను అర్జించలేక పోయారు. విముక్తిని గురించి స్వయంగా ఆలోచించుకొనే శక్తిని కోల్పోయారు. తమ విమోచనకు తాము ఏవిధంగా పాటుపడాలో గుర్తించలేని అజ్ఞానులైనారు. సంఘంలో హీనులుగా దీనులుగా అణగద్రొక్కి ఉంచడం వల్లన, ఈ ప్రజలు “అంతా మన కర్మ” అనుకొంటూ, శాశ్వత బానిసవృత్తికి అలవాటైపోయారు.

**(అంబేద్కర్ రచించిన కుల నిర్మూలన గ్రంథం నుండి ఈ భాగం గ్రహించబడింది)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.1. Published on May 1, 2016